PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 51 | విజయవాడ, శనివారం 21 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 21 September 2024 | Rs

మరణశిక్ష జోన్‌లుగా సెజ్‌లు
- 'అసెన్షియా'పై మర్డర్ కేసు పెట్టాలి
- భద్రత పాటించని యాజమాన్యాలను జైలులో పెట్టాలి
- ఫార్మా, సెజ్ కార్మికుల రక్షణ యాత్ర ముగింపు

3



బంగ్లా కట్టడి

టీమిండియాకు 308పరుగుల ఆధిక్యత

8

ప్రతి నెలా 1న 'పేదల సేవలో'

అక్టోబర్‌లో బోగస్ పింఛన్లపై వెరిఫికేషన్ • 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు పేదల ఇళ్లకు వెళ్లి వారి కష్టాలు తెలుసుకొని సాయం అందించాలని సూచించారు. 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గాడి తప్పిన పాలనను గాడిలో పెడతానని, మీరంతా సహకరించాలని కోరారు. గత ప్రభుత్వంలో చాలామంది అనర్హులకు పింఛన్లు ఇచ్చారని, అక్టోబరులో గ్రామసభలు పెట్టి పింఛన్లు వెరిఫికేషన్ చేయిస్తామని తెలిపారు. అనర్హులను తొలగిస్తామని, అర్హులందరికీ వచ్చేలా చూస్తామన్నారు. వైసిపిని భూస్థాపితం చేసి చరిత్రలో ఎన్నడూలేని విజయాన్ని ఇచ్చారన్నారు. తన అనుభవాన్ని అంతా ఉపయోగించి సంపద సృష్టిస్తామనని, రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా చేస్తానని పేర్కొన్నారు. వంద రోజుల పాలన ఎలా ఉందో తెలుసుకోవడానికే వచ్చానన్నారు. గ్రామంలో మూడు ఇళ్లకు వెళ్లి అన్నీ పరిశీలించానని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రమూ ఇవ్వని విధంగా నెలకు రూ.4 వేలు పింఛను ఇస్తున్నామన్నారు. తాను ఇళ్లకు వెళ్లి చూసినప్పుడు ఆర్థిక పరిస్థితుల కారణంగా పిల్లలను చదివించలేక పనులకు పంపుతున్నారని



'ఇది మంచి ప్రభుత్వం' సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తెలిసిందన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని, మళ్లీ కాలేజీల్లో చేర్పిస్తామని భరోసా ఇచ్చారు. తల్లికి వందనం పథకాన్ని కచ్చితంగా అమలు చేస్తామన్నారు.

రాష్ట్రం వెంటిలేటర్‌పై ఉందని, ఆక్సిజన్ తీస్తే ప్రాణం పోయేలా తయారైందని చంద్రబాబు అన్నారు. 21 మంది ఎంపీలను ఇచ్చినందున ఢిల్లీ నుంచి ఆక్సిజన్ తెచ్చుకునే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రం పది లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో ఉందని తెలిపారు. రూ.లక్ష కోట్ల వడ్డీలు కట్టాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. లేకుంటే బ్యాంకులు ప్రభుత్వ ఆస్తులను కూడా జప్తు చేస్తాయని తెలిపారు. ఇదే జరిగితే రాష్ట్రం పరువు పోతుందన్నారు. రాష్ట్రానికి సంబంధించి ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశానని, అన్ని శాఖలపైనా సమీక్షలు చేస్తున్నామని తెలిపారు. వంద రోజుల్లో ఎంతో చేశామని పేర్కొన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ముందుకు పోతున్నామన్నారు. అందులో భాగంగానే మెగా డిఎస్‌సి ప్రకటించామని తెలిపారు. ఇసుకను గ్రామాల్లో ట్రాక్టర్ లేదా ఎడ్లబండితో ఎవరైనా ఉచితంగా తీసుకెళ్లవచ్చన్నారు. రూ.99కే క్వార్టర్ మద్యం ఇచ్చే పాలసీని ప్రవేశపెట్టామని తెలిపారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డులో నాణ్యత లోపించిందని చంద్రబాబు అన్నారు. నాణ్యత లేని నెయ్యిని, కల్తీ నెయ్యిని వాడారని ఆరోపించారు. వరదల్లోనూ దాతల సాయం స్ఫూర్తిదాయంగా ఉందన్నారు. దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ఓవర్‌యాక్షన్ చేస్తే అటువంటి వారి తాటతీస్తానని, రాజకీయ ముసుగులో నేరాలు, ఘోరాలు చేసేవాళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సభకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. వేదికపై మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా వీరాంజనేయస్వామి, ఎంపీలు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కృష్ణప్రసాద్, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు, గ్రామ సర్పంచ్ స్వర్ణ అనురాధ తదితరులు ఆశీనులయ్యారు.



ఇక ఎన్‌టిఆర్ నగర్‌లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిటిడ్కో- పిఎంఎవై-హెచ్‌ఎఫ్‌ఎ(యు), పిఎంఎవై (యు) -కింద చేపట్టిన వైఎస్‌ఆర్ జగనన్న నగర్‌ల పేరును రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ నగర్‌గా మార్చింది. ఈ మేరకు మునిసిపల్‌శాఖ జీఓ ఆర్‌టి నెంబరు 715ను శుక్రవారం విడుదల చేసింది. టిడ్కో లే అవుట్స్ పేర్లను పిఎంఎవై-ఎన్‌టిఆర్ నగర్‌గా మారుస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

అదానీపై స్విస్ సీరియస్ విచారణ..!

- మెగా మనీలాండరింగ్‌పై దృష్టి
- మోసం చేస్తే ఐదేళ్ల వరకు శిక్ష

7



లడ్డూ లడాయి

- టిడిపి, వైసిపి మధ్య పరస్పర విమర్శలు
- రంగంలోకి బాబు, జగన్
- విచారణకు టిటిడి ఇఓకు సిఎం ఆదేశం
- కల్తీ జరిగిందన్న కార్యనిర్వహణాధికారి
- ఇదే అదనుగా మత భావాలు రెచ్చగొడుతున్న బిజెపి, సంఘ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రసిద్ధ తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో తయారవుతున్న లడ్డూ ప్రసాదంలో నాణ్యతాంశం ప్రకంపనలు తారాస్థాయికి చేరాయి. రాజకీయంగా లేచిన దుమారం టిడిపి-బిజెపి-జనసేన, వైసిపి మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలకు దారి తీసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులవుతున్న సందర్భంగా బుధవారం మూడు పార్టీల ఎంఎల్‌ఎల సమావేశంలో టిటిడి లడ్డూలో నాణ్యతాలోపం అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఆ క్షణం నుంచి రాష్ట్రంలో, దేశంలో, విదేశాల్లో శ్రీవారి లడ్డూ నాణ్యతపై అనుమానాలు, ప్రశ్నలు, ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల తర్వాత సిఎం చంద్రబాబు శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించి సమగ్ర విచారణ జరిపించాలని, నివేదిక అందజేయాలని టిటిడి ఇఓను ఆదేశించారు. ఇదిలా ఉండగా లడ్డూ నాణ్యతాంశం బయటపడ్డాక రెండు రోజుల తర్వాత ఇఓ శ్యామలరావు అధికారికంగా స్పందించారు. లడ్డూ తయారీకి కంపెనీలు సరఫరా చేసే నెయ్యిలో నాణ్యత లేదని గుర్తించామన్నారు. తమిళనాడుకు చెందిన ఎఆర్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సరఫరా చేసిన నెయ్యిలో నాణ్యత లేదని నిర్ధారించి నాలుగు ట్యాంకర్లను గుజరాత్‌లోని ఎన్‌డిడిబి ల్యాబ్‌కు జులైలో పరీక్షలకు పంపగా, కల్తీ జరిగిందని, నెయ్యిలో జంతువుల కొవ్వు, ఎడిబుల్ ఆయిల్స్‌లో కల్తీ జరిగినట్లు నివేదికలొచ్చాయని చెప్పారు. టిటిడికి నెయ్యి నాణ్యతను గుర్తించే సొంత ల్యాబ్ లేదని, ప్రైవేటు ల్యాబ్‌లపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. కిలో నాణ్యమైన నెయ్యి రూ.320 నుంచి 411 ధరకు సరఫరా చేయడం అసాధ్యమన్నారు. కానీ అంత తక్కువకు నెయ్యి సరఫరాకు కంపెనీలు అంగీకరించాయని పేర్కొన్నారు. నిపుణుల కమిటీని వేశామని చెప్పారు. మరో వైపు సిఎం చంద్రబాబు ఒంగోలులో జరిగిన సభలో లడ్డూ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. జగన్ ప్రభుత్వం నిర్వాకమని మండిపడ్డారు. టిడిపి, బిజెపి, జనసేన నేతలు పలువురు వైసిపి ప్రభుత్వం తిరుపతిని, దేవుడిని అపవిత్రం చేసిందన్నారు. వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, తమ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు లడ్డూ నాణ్యతపై కట్టుకథ అల్లారని మిగతా 7లో

అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ

వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుపతి లడ్డూ తయారీలో జరిగిన అక్రమాలపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. టిటిడి లడ్డూలో వాడుతున్న నెయ్యిలో కల్తీ జరిగిందని, ఇతరేతర పదార్థాలు వాడారని జరుగుతున్న ప్రచారంతో భక్తుల్లో ఆందోళన కలుగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్‌డిడిబి రిపోర్టును అధికారికంగా ప్రకటించి విచారణ జరిపించాలని కోరారు. ఈ వివాదం మాటున మత మనోభావాలు రెచ్చగొట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, ప్రజలు ఇలాంటి శక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రత్యేక మిషన్

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- షరతులతో రూ.500 కోట్లు ఇచ్చి తెలుగువారిని అవమానిస్తారా ?
- ఉక్కుపై కుట్రలను తిప్పికొట్టాల్సిన బాధ్యత టిడిపి కూటమిదే

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను అడ్డుకోవడానికి, ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి సర్కారు వంద రోజుల్లో మాటలకు తగ్గట్టుగా చేతల్లో నిర్దిష్ట చర్యలేవీ తీసుకోలేదని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు సరఫరా లేదు.. పెట్టుబడుల్లేవు.. ఆఫీసర్ల జీతాల్లో 30 శాతం కోత విధించారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలివ్వడం లేదు. ఈ నేపథ్యంలో ఏ రకంగా ప్లాంట్‌ను కాపాడుతారో' చెప్పాలని ప్రశ్నించారు. తక్షణమే రూ.15 వేల కోట్ల రుణాన్ని కేంద్రం నుంచి ఎయిడ్ లేదా బ్యాంకుల నుంచి హామీ అయినా ఇచ్చి ప్లాంట్‌ను ఆదుకోవాల్సిన బాధ్యత టిడిపి కూటమి ప్రభుత్వ భుజస్కందాలపై ఉందన్నారు. ఏదైనా ఒక ప్రాజెక్ట్ సక్సెస్ కావాలంటే మిషన్ మోడ్‌లో పని చేయాలని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఒక 'మిషన్' ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆ షెడ్యూల్ ప్రకారం ఉత్పత్తి పెంచడానికి, రా మెటీరియల్ సాధనకు కృషి చేయాలన్నారు. సెయిల్‌లో విలీనం చేయడం, ఇతర పనులు జరిగేలా చూడటం తక్షణ కర్తవ్యమని చెప్పారు. ఈ మిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఎంపిలు, ఉక్కు మంత్రిత్వ శాఖ, ప్లాంట్ ఉన్నతాధికారులు ఉండి సమర్థవంతంగా పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

మూడేళ్లుగా కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటంతో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆగిందని, నేడు దీన్ని కాపాడాల్సిన బాధ్యత టిడిపి కూటమి ప్రభుత్వానిదేనన్నారు. ప్లాంట్‌పై మోడీ ప్రభుత్వం చేస్తోన్న కుట్రలను గతంలో జగన్, నేడు చంద్రబాబు అడ్డుకోలేకపోవడాన్ని తప్పుబట్టారు. తాజాగా కేంద్రం రూ.500 కోట్లు ఇస్తూ ఉక్కు కార్మికులకు జీతాలు ఇవ్వకూడదు, రా మెటీరియల్ మిగతా 7లో

మళ్లీ 'సాగు ధ్రువీకరణ' పునరుద్ధరణ?

- 2016 నుంచి ఎల్‌ఇసిలకు సమాంతరంగా సిఒసిలు
- సిసిఆర్‌సి చట్ట సవరణే పరిష్కారం : న్యాయ నిపుణులు
- ఆ విషయం చర్చించని కేబినెట్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కౌలు రైతుల గుర్తింపునకు తమ హయాంలో ప్రవేశపెట్టిన సాగు ధ్రువీకరణ పత్రాల (సర్టిఫికెట్ ఆఫ్ కల్టివేషన్-సిఒసి)ను టిడిపి కూటమి ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరించనున్నట్లు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంలో కౌలు రైతుల గుర్తింపునకు రుణ అర్హత కార్డులు (ఎల్‌ఇసి) ఉండగా, రాష్ట్ర విభజన అనంతరం 2016లో టిడిపి సర్కారు సిఒసిలను తీసుకొచ్చింది. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఎల్‌ఇసి, సిఒసిలను ఎత్తేసి ప్రత్యేక చట్టం ద్వారా పంట సాగుదారు హక్కు కార్డు (సిసిఆర్‌సి)లను అమల్లోకి తెచ్చింది. కాగా సిసిఆర్‌సిల జారీకి భూమి యజమాని సంతకం తప్పనిసరి చేయడంతో ఆ నిబంధన లేకుండా తమకు గుర్తింపు కార్డులివ్వాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవు తున్న సమయాన బుధవారం నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో కౌలు రైతులకు ల్యాండ్ ఓనర్ల సంతకంతో ప్రమేయం లేకుండా ఈ రబీ నుంచి గుర్తింపు కార్డులివ్వాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. సర్కారు ఏ పద్ధతిలో కార్డులివ్వబోతోందన్నదానిపై చర్చ సాగుతోంది.

ఇదీ ప్రస్థానం

సరైన గుర్తింపు లేక తమకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అందట్లేదని కౌలు రైతుల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఉమ్మడి రాష్ట్రంలో 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ఎపి ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ యాక్ట్'ను తీసుకొచ్చింది. దాని ప్రకారం భూ యజమానులతో సంబంధం లేకుండా రెవెన్యూ అధికారులు గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి ఎల్‌ఇసిలను జారీ చేయాలి. చాలాచోట్ల భూస్వాములు, పెత్తందార్ల ప్రభావంతోనే ఎల్‌ఇసిలు జారీ చేశారు. కార్డులున్నా బ్యాంకులు ఏవో కొర్రీలు వేసి చాలా మందికి లోన్లు ఇవ్వలేదు. అయినప్పటికీ కొంతలో కొంత కౌలు రైతులకు కార్డులు, రుణాలు అందాయి. ఇదిలా ఉండగా, ఎల్‌ఇసిలను ఒక వైపు కొనసాగిస్తూనే టిడిపి ప్రభుత్వం



సిఒసిలను ముందుకు తెచ్చింది. వ్యవసాయశాఖ మెమో నెం.క్రెడిట్/02/2016 తో జులై 1న ఆపరేషనల్ గైడ్‌లైన్స్ వెలువడ్డాయి. ఇ-సేవా కేంద్రాల్లో అర్జీలు పెట్టుకోమన్నారు. ఎల్‌ఇసిలు రెవెన్యూ అధికారు లివ్వగా సిఒసిలను మండల వ్యవసాయాధికారుల (ఎఒ)తో ఇప్పించారు. ఎల్‌ఇసిలు ఫెయిల్ అయ్యాయని సిఒసిలను తేగా, వాటి జారీ సైతం సరిగ్గా జరగలేదు. 2016-17లో కేవలం 31 వేల సిఒసిలే జారీ అయ్యాయి. ఆ ఏడాది 2 వేల సిఒసిలపై బ్యాంకులు రూ.9 కోట్ల రుణాలిచ్చాయి. 2017-18లో 31 వేల కార్డులపై రూ.185 కోట్లు, 2018-19లో 80 వేల కార్డులపై రూ.494 కోట్లు రుణాలొచ్చాయి. వైసిపి వచ్చాక ఎల్‌ఇసి చట్టాన్ని, అంతకుముందున్న ఎపి టెనెన్స్ యాక్ట్ (ఆంధ్రా ఏరియా)-1956 చట్టాలను రద్దు చేసి ఎపి క్రాప్ కల్టివేటర్స్ రైట్స్ యాక్ట్‌ను (సిసిఆర్‌సి) 2019 జులైలో తీసుకొచ్చింది.

చట్టం మారుతుందా?

భూ యజమానుల సంతకం లేకుండా సిసిఆర్‌సిలు ఇవ్వాలంటే సిసిఆర్‌సి చట్టానికి సవరణలు చేయాలి. అంటే సవరణ చట్టం తేవాలి. ఆ విషయంపై కేబినెట్‌లో చర్చించలేదని సమాచారం. చట్టం అమలు కోసం ఇచ్చే రూల్స్‌లో మార్పు చేస్తే సరిపోతుందనుకున్నా... చట్టంలో ఓనరు, కౌల్దారు మధ్య అగ్రిమెంట్ నమోదు చేయాలని ఉంది. కాబట్టి చట్ట సవరణ జరిగితేనే కుదురుతుందనేది న్యాయ నిపుణుల అభిప్రాయం. లేకపోతే మొత్తానికే సిసిఆర్‌సి చట్టాన్ని రద్దు చేయాలి. ప్రస్తుతం గ్రామ సచివాలయంలోని రెవెన్యూ అధికారి (విఆర్‌ఒ) సిసిఆర్‌సిలు జారీ చేస్తున్నారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం ఇక నుంచి సిసిఆర్‌సిలను వ్యవసాయాధికారులు ఇస్తారన్నారు. అంటే సిసిఆర్‌సి చట్టం, దాని రూల్స్ ఉండగా అది సాధ్యం కాదు. దీన్నిబట్టి గతంలోని సిఒసిలను తిరిగి ప్రవేశపెడతారని తెలుస్తోంది. ఎల్‌ఇసి, సిసిఆర్‌సి చట్టాలున్నప్పుడే బ్యాంకులు కౌలు రైతులకు రుణాలివ్వలేదు. అధికారుల మెమోలు, సర్క్యులర్లు, జిఒలను బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటాయా అన్నది ప్రశ్న. ఖరీఫ్ సీజన్ సెప్టెంబరు ఆఖరుతో ముగుస్తుంది. అక్టోబరు నుంచి రబీ మొదలవుతుంది. ఈ తక్కువ సమయంలో సిసిఆర్‌సిలపై కూటమి సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

మహిళా న్యాయవాది పట్ల కర్ణాటక హైకోర్టు జడ్జి వ్యాఖ్యలపై సుప్రీం విచారణ


న్యూఢిల్లీ : కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి న్యాయస్థానంలో మహిళా న్యాయవాదిని ఉద్దేశించి చేసిన అవమానకర వ్యాఖ్యల వీడియోను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. కోర్టు కార్యకలాపాల సందర్భంగా ఒక మహిళా న్యాయవాదిని ఉద్దేశించి బహిరంగ న్యాయస్థానంలో హైకోర్టు న్యాయమూర్తి చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యల వీడియోను సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం శుక్రవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ సంఘటనపై హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను సంప్రదించి రెండు రోజుల్లోగా నివేదికను ఇవ్వాల్సిందిగా బెంచ్ కర్ణాటక హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది. ఈ నెల 25కి ఈ కేసు విచారణను వాయిదా వేసింది. ఈ న్యాయమూర్తిపై చర్య తీసుకోవాలని, సిజెఐని కోరుతున్నట్లు న్యాయవాది ఇందిరా జైసింగ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కేసులో అవతలి పక్షం తరపున వాదనలు వినిపిస్తున్న పురుష న్యాయవాదికి ఉద్దేశించి అడిగిన ప్రశ్నపై మహిళా న్యాయవాది కలుగజేసుకోవడంపై న్యాయమూర్తి రయ్యన లేచారు. 'ఆయన గురించి ఆమెకు అన్నీ తెలుసనుకుంటా, ఆయన వేసుకున్న లో దుస్తుల రంగులను కూడా ఆమె రేపు అడిగితే చెప్పగలరు' అంటూ అవహేళనగా మాట్లాడారు.

ప్రతి గ్రామానికీ పక్కా రహదారి

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల మధ్య అనుసంధాన రహదారులు నాణ్యతతో ఉండాలనే ఆశయంతో ముందుకు సాగుతున్నామని, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంటు బ్యాంకు (ఎఐఐబి) బ్యాంకు సహకారంతో 250 జనాభా దాటిన గ్రామాల మధ్య రోడ్ల అనుసంధానం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తెలిపారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఎఐఐబి బ్యాంకు ప్రతినిధులు పవన్‌కర్కి, తౌషిక్ రెహ్మాన్, పంచాయతీరాజ్ అధికారులతో ప్రాజెక్టు స్థితిగతులపై డిప్యూటీ సిఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే మొదట ఆ ప్రాంతంలో రవాణా మార్గాలు మెరుగవ్వాలనేది ఆర్థికశాస్త్ర ప్రాథమిక సూత్రమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేసే రోడ్లు వరదలకు కొట్టుకుపోకుండా, వర్షాలకు ఛిద్రం కాకుండా ఉండాలన్నారు. అధునాతన పరిజ్ఞానంతో రహదారులు వేయాలని, రోడ్ల నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దన్నారు. పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రాజెక్టు పూర్తయ్యేలోగా రాష్ట్రంలో రహదారులు లేని గ్రామాలు లేకుండా సమగ్రంగా ప్రాజెక్టు రూపకల్పన చేయాలన్నారు. పనులు వేగంగా,



పకడ్బందీగా జరిగేలా అధికారులు చొరవ తీసుకోవాలని, బ్యాంకర్లు ప్రాజెక్టులో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ.. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉడుముడిలంక గ్రామాల్లో పర్యటించి అక్కడ రోడ్డుతో పాటు ఓ వంతెన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించుకుని ఆ రోడ్డు అనుసంధానంపై డ్రోన్‌తో సర్వే నిర్వహించి నట్లు బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణం కూడా వేగవంతంగా జరగాలని, ఇందు కోసం తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు బాలునాయక్, సివి సుబ్బారెడ్డి, పివి రమణమూర్తి, కె చక్రవర్తి, బిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొండంత నష్టం... గోరంత పరిహారం

- వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు చెల్లించాలి
- రైతుసంఘం బృందం

3

సవరించిన ఐటి నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం !

- కొట్టేసిన బాంబే హైకోర్టు

7

వెంటనే విధుల్లో చేరాలి

- పిహెచ్‌సి డాక్టర్ల సంఘానికి వైద్యారోగ్యశాఖ కమిషనరు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిజి వైద్య విద్యలో వున్న ఇన్ సర్వీస్ పిహెచ్‌సి డాక్టర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని, తక్షణం ఆందోళన కార్యక్రమంలో వున్న వైద్యులు విధుల్లో చేరాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు సి హరికిరణ్ కోరారు. ఈ మేరకు హరికిరణ్ శుక్రవారం పిహెచ్‌సిల డాక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ యూనస్‌కు లేఖ రాశారు. ప్రజారోగ్య సేవలు నిత్యవసర సేవలైనందున ఆందోళన చేస్తున్న డాక్టర్లంతా సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జిఓ నెంబర్ 85ను సవరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. 2018 నుండి 22 మధ్య కాలంలో ఇన్ సర్వీస్ రిజర్వేషన్‌లకు సంబంధించి నిర్దిష్టమైన కోటా లేదని, సేవలందించిన కాలం ఆధారంగా వెయిటేజీ మార్కులు వున్నాయని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల పలు ప్రాంతాల్లో సీజనల్, కీటక జనిత వ్యాధులు ప్రబలుతున్నాయని, ఈ సమయంలో ప్రభుత్వ వైద్యులు ప్రజలకు అందుబాటులో వుండాల్సిన అవసరాన్ని గుర్తించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు

- అక్టోబర్‌లో 'ఉక్కు' పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు వస్తున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు అన్నారు. విశాఖలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు 120 శాతం ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించిన చరిత్ర ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 30 ఏళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోయినా సొంత లాభాలతో సాలీన 32 లక్షల టన్నుల సామర్థ్యం నుంచి 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి వెళ్లిందన్నారు. హుదూద్ వల్ల ప్లాంట్‌కు వచ్చిన నష్టం రూ.వెయ్యి కోట్లలో కేంద్రం ఒక్క రూపాయి కూడా భరించలేదన్నారు. కోవిడ్ కాలంలోనూ విశాఖ స్టీల్ లాభాల్లోనే ఉందని గుర్తు చేశారు. రాజకీయ కారణాలతో రాయబెరిల్లీలో రైల్‌వీల్ ప్లాంట్ కోసం రూ.2 వేల కోట్లను విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి అనవసరంగా ఖర్చు పెట్టించారని తెలిపారు. ఒడిశా మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఇనుప గనుల కొనుగోలు కోసం ఒక్క టన్ను కూడా రాకపోయినా రూ.వెయ్యి కోట్లు వృథాగా ఖర్చుపెట్టారన్నారు. పన్నులు, డివిడెండ్ల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.58 వేల కోట్లు చెల్లించినట్టు తెలిపారు. ఏ ప్రయివేటు కంపెనీ అయినా ఇంత మొత్తంలో పన్నులు చెల్లించిందా ? అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌లో కేంద్ర ప్రభుత్వం పెట్టిన పెట్టుబడులు రూ.4890 కోట్లు మాత్రమేనని తెలిపారు. మూడు లక్షల కోట్లు విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియాకు చెందిన 'పోస్కో'కు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం మూడున్నర సంవత్సరాల నుంచి ప్రయత్నాలు చేస్తోందన్నారు.

పైసా ఖర్చు లేకుండా సెయిల్‌లో విలీనం చేయొచ్చని, ఎందుకు కేంద్రం అలా చేయడం లేదని ప్రశ్నించారు. సెయిల్ అదనంగా 20 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యం పెట్టుకుందని, దీనికి రూ.లక్ష కోట్లు అదనంగా పెట్టుబడులు కావాలన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తే 20 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సులభంగా పెంచవచ్చుని తెలిపారు. ప్రముఖ ప్రైవేటు స్టీల్ ప్లాంట్ అయిన ఎస్సార్ కంపెనీ రూ.55 వేల కోట్లకుపైగా అప్పులు చేసి దివాళా తీసిందని, కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల అప్పులను మాఫీ చేసి ఆర్సిల్ మిట్టల్ కంపెనీకి ట్రిబ్యునల్ ద్వారా అప్పగించిందని గుర్తు చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుకు అమ్మాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతి రోజూ రూ.15 కోట్లు నష్టాలు వచ్చేలా చేస్తోందన్నారు. ప్రయివేటు ఉక్కు ఫ్యాక్టరీల మాదిరిగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు లాభాలు ఎందుకు రావడం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశంలో ప్రశ్నించారని, కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శించలేక విశాఖ స్టీల్‌పై అబండాలు వేయడం సరికాదని హితవుపలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పోరాట కమిటీ నిర్ణయించిందని తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో అన్ని ప్రజా సంఘాలతో కలిపి మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు జరుపుతామని చెప్పారు. సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కార్యదర్శి బి.జగన్ పాల్గొన్నారు.

ఒకటి నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

- 48 గంటల్లోనే రైతు ఖాతాకు నగదు
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్టోబరు ఒకటి నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. సుమారు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేయడంతోపాటు కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాంకేతికతను ఉపయోగించి ముందుకు వెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలశాఖ అధికారులు, సహకార, మార్కెటింగ్, వ్యవసాయ అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపే వారి ఖాతాలకు సొమ్ము జమ చేసే విధంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని మంత్రి నాదెండ్ల వెల్లడించారు. ధాన్యం అమ్మకం నుంచి మిల్లు ఎంపిక చేసుకునే వరకు రైతుకు స్వేచ్ఛ ఇచ్చేలా ఈ ప్రణాళికలు ఉండబోతున్నాయన్నారు. ఐదేళ్ల పాలన గురించి ఒక్కరోజు కూడా గర్వంగా చెప్పుకోలేని జగన్ ఇప్పుడు తానేదో అద్భుతం చేశామని మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతులకు రబీ ధాన్యం బకాయిలు ఎందుకు చెల్లించకుండా వెళ్లిపోయారో చెప్పాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందితోపాటు క్షేత్రస్థాయిలో రవాణాకు ఇబ్బందులు లేకుండా పెద్ద సంఖ్యలో లారీలు సిద్ధం చేస్తున్నామన్నారు. జిపిఎస్‌కు అనుసంధానం చేసే ప్రతి బస్తా.. ట్రాన్స్‌పోర్టు డేటా తెలుసుకునేలా ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు నిండిన సందర్భంగా క్షేత్రస్థాయిలో నిబద్ధతతో రైతుకు అండగా నిలిచేలా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం అమలు చేస్తామన్నారు. వర్క్‌షాప్‌లో పౌరసరఫరాలశాఖ ఎమ్‌డి వీరపాండియన్, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ మంజిర్ జిలానీ సమూర్, వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాలశాఖ అధికారులు పాల్గొన్నారు.

కల్తీ వ్యవహారంపై కేంద్రం ఆరా

ఉన్నతాధికారులతో చంద్రబాబు సమీక్ష

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో / అమరావతి బ్యూరో

తిరుమల శ్రీవారి మహా ప్రసాదం లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిపినట్లు వచ్చిన ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం నివేదిక కోరింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బిజెపి జాతీయ అధ్యక్షులు జయ ప్రకాశ్ నడ్డా దీనిపై స్పందించారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో నడ్డా మాట్లాడుతూ.. తాను చంద్రబాబుతో మాట్లాడానని, వారి వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాలని చెప్పానని అన్నారు. కేంద్రం ఈ విషయంలో రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ) నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ మంత్రి ప్రహ్లాద్ జోషి లడ్డూ కల్తీ ఆరోపణలపై దర్యాప్తు అవసరమని, దీనిపై సమగ్రంగా విచారణ జరిపి, దోషులుగా తేలిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర నివేదిక పంపాలని ఇఒకు చంద్రబాబు ఆదేశం

తిరుమల తిరుపతి లడ్డూ తయారీలో వాడకూడని పదార్థాలు వాడారనే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు... మంత్రులు, అధికారులతో శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దీనిపై వీలైనంత త్వరగా నివేదిక పంపించాలని టిటిడి ఇఒ శ్యామలరావును ఆదేశించారు. తిరుమల లడ్డూలో వాడిన పదార్థాలపై ఎన్‌డిడిబి నుండి వచ్చిన నివేదికలో పేర్కొన్న అంశాలపై పెద్దయెత్తున ఆందోళనలు వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. లడ్డూ తయారీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై నివేదిక ఇవ్వాలని ఇఒను ఆదేశించారు. తిరుమల పవిత్రతను కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుమల వచ్చేవారి విశ్వాసాలను కాపాడుతామని తెలిపారు.

సిబిఐ విచారణకు షర్మిల డిమాండ్

టిటిడి లడ్డు తయారీలో నెయ్యి కల్తీ జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశంపై నిగ్గు తేల్చేందుకు సిబిఐతో విచారణ చేయించాలంటూ కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షాకు లేఖ రాసినట్లు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇదే అంశంపై శనివారం సాయంత్రం గవర్నర్ డాక్టర్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో భేటీ కానున్నట్లు ఆమె తెలిపారు. జులై12న శాంపిల్స్ తీశారని, ఆ రోజు తీసిన శాంపిల్స్ గత ప్రభుత్వం ఇచ్చిన నెయ్యి కాంట్రాక్టర్‌వేనని, ఆ శాంపిల్స్‌లో బీఫ్ ఆయిల్, ఫిష్ ఆయిల్ కంటెంట్స్ ఉన్నాయని రిపోర్టు వచ్చిందన్నారు. ఇది సెంటిమెంట్‌కు సంబంధించిన విషయమన్నారు. ఇంత పెద్ద విషయాన్ని సిఎం చంద్రబాబు సీరియస్‌గా తీసుకోకుండా ఎలా క్యాజువల్‌గా తీసు కుంటారని ప్రశ్నించారు. కూటమి 100 రోజులు పాలన శిశుపాలుడు తప్పులను వెతికినట్లుగా ఉందన్నారు. సూపర్‌సిక్స్‌లో కనీసం ఒక్క సిక్స్‌కూడా అమలు కాలేదు.. విశాఖ స్టీల్ ప్లాంట్‌కి వెంటనే క్యాప్టివ్‌మైన్స్ ఇవ్వాలని ఆమె కేంద్రాన్ని డిమాండ్ చేశారు. వాలంటీర్లకు ఉద్యోగ భద్రత విషయంలో ప్రభుత్వం స్పష్టతనివ్వాలని కోరారు.



దారుణంగా నెయ్యి నాణ్యత : టిటిడి ఇఒ

లడ్డూ నాణ్యత పడిపోయిందని, నెయ్యిలో యానిమల్ ఫ్యాట్స్ ఉన్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయని, వీటిపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సిఎం ఆదేశించడంతో ఆయన ఆదేశాల ప్రకారం నెయ్యిని పరిశీలించామని టిటిడి ఇఒ శ్యామలరావు చెప్పారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది మార్చి 12న ఎఆర్ డెయిరీ ఫుడ్ ప్రయివేట్ లిమిటెడ్ పంపిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిని జులై 6, 12 తేదీల్లో ఎన్‌డిడిబి కాఫ్ ల్యాబ్‌కు పరీక్షకు పంపామన్నారు. టోటల్ ప్యూరిటీ టెస్ట్‌లో 95.68 నుండి 100.32 శాతం ఉంటేనే స్వచ్ఛమైన నెయ్యి అని, 20.32 శాతం మాత్రమే ఉండటం వల్ల కల్తీ జరిగిందనే విషయం బయట పడిందన్నారు. పందికొవ్వు, ఫిష్ ఆయిల్, బీఫ్ టాలో వంటి ఏనిమల్ ఫ్యాట్‌తో పాటు వెజిటబుల్ ఫ్యాట్ కలిసినట్లు తేలిందన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగంపై సమగ్రమైన విచారణ చేపట్టాలని టిటిడి మాజీ ప్రధానార్చకులు రమణ దీక్షితులు డిమాండ్ చేశారు. శ్రీవారి లడ్డూల తయారీలో జరిగిన అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు.

పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే..

పకడ్బందీగా ల్యాబ్‌లలో టెస్టులు
నాణ్యత లేదని 18 ట్యాంకర్ల నెయ్యిని వెనక్కు పంపాం
సిఎం చంద్రబాబు విమర్శలపై వైసిపి అధినేత జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబు వంద రోజుల్లో తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ అంటూ దుర్మార్గమైన ప్రచారానికి పాల్పడుతున్నారని వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విమర్శించారు. రాజకీయాల కోసం చంద్రబాబు ఎంతగా దిగజారిపోతారో మరోసారి నిరూపణైందన్నారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేని అసమర్థ పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కట్టుకథలతో తిరుమల ప్రసాదంలో నెయ్యి బదులు జంతువుల కొవ్వు వాడారని అబద్ధపు ప్రచారాన్ని మొదలుపెట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి స్థాయిలో వున్న వ్యక్తి ఇలా బాధ్యతా రాహిత్యంగా మాట్లాడటం తగదని, ఈ మాటలతో కోట్లాది మంది ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. తిరుమల ప్రసాదాల తయారీలో దశాబ్దాలు తరబడి ఒకే విధానంలో వుందని, తమ ప్రభుత్వంలో కూడా అదే విధానాన్ని అమలు చేశామని తెలిపారు. ప్రతి నెయ్యి ట్యాంకరు నేషనల్ అక్రిడిటెడ్ బోర్డ్ ఫర్ ల్యాబ్స్ (ఎన్‌ఎబిఎల్) నుండి సర్టిఫికెట్ తీసుకొస్తేనే తీసుకుంటారని తెలిపారు. అలాగే టిటిడి కూడా మూడు శ్యాంపిల్స్‌ను తీసి పరీక్ష చేస్తుందని, నిబంధనలకు లోబడి లేకపోతే వెనక్కు పంపుతారని చెప్పారు. టిడిపి హయాంలో 14, 15 సార్లు నెయ్యి లారీలను రిజెక్టు చేస్తే, తమ ప్రభుత్వం 18 పర్యాయాలు రిజెక్టు చేసిందన్నారు. టిటిడికి అద్భుతమైన వ్యవస్థ వుందని చెప్పాల్సింది పోయి దుష్ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక జులై 12న శ్యాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపితే 17న టెస్టులకు పంపారని తెలిపారు. ఈ నెల 23న వస్తే రెండు నెలలు వరకు ఈ ల్యాబ్ రిపోర్టును ప్రభుత్వం ఎందుకు బహిర్గతం చేయలేదన్నారు. టిటిడి అధికారులు బహిర్గతం చేయాల్సిన నివేదికను టిడిపి కార్యాలయంలో ఎలా చేస్తారని ప్రశ్నించారు. తిరుమల శ్రీవారి ప్రతిష్టను చంద్రబాబు దిగజారుస్తున్నారని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ప్రధాని మోడీకి, సిజెఐకి లేఖలు రాస్తామని తెలిపారు. తమ ప్రభుత్వంలో తొమ్మిది వేల మంది టిటిడి ఉద్యోగులకు ఇళ్ల పట్టాలిచ్చామన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో కూడా టిటిడి తరపున ఆలయాలు నిర్మించామని తెలిపారు. తిరుమలలో మొదటిసారి గోశాలను ఏర్పాటు చేశామన్నారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు చెప్పిన సూపర్ సిక్స్, అమ్మఒడి, మహిళలకు రూ.18 వేలు, రైతులకు పెట్టుబడి సాయం, ఫీజు రీయంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీలాంటి వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని తెలిపారు. చివరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కూడా ప్రైవేట్‌పరం చేసే కుట్రలను చేస్తున్నారని, వంద రోజుల పాలనలో వంద తప్పులు చేశారని ఆరోపించారు. తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేలా దుష్ప్రచారం చేయడం తగదని అన్నారు. బిజెపికి చిత్తశుద్ధి వుంటే చంద్రబాబు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు.

హైకోర్టుకు వైవి సుబ్బారెడ్డి

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగిస్తున్నారనే వ్యవహారంపై నిజా నిజాలు నిగ్గు తేల్చేందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ.. టిటిడి మాజీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవి సుబ్బారెడ్డి శుక్రవారం హైకోర్టును ఆశ్రయించారు. సిట్టింగ్ జడ్జితో విచారణ వీలుకాని పక్షంలో హైకోర్టు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోరారు. పిల్‌పై విచారణ జరపాలని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనాన్ని కోరారు. శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యి విషయంలో నిజా నిజాలతో సంబంధం లేకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేస్తే బుధవారం విచారణ జరుపుతామని ధర్మాసనం ప్రకటించింది.

- టిటిడి ఛైర్మన్‌గా చేసినప్పుడు అక్రమాలకు పాల్పడ్డారంటూ తనపై చేసిన ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు తగిన డాక్యుమెంట్లను అందజేయకుండానే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఎస్‌పి వివరణ కోరడాన్ని సవాలు చేస్తూ వైవి సుబ్బారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ప్రకాశం జిల్లా వైసిపి అధ్యక్షులుగా శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా వైసిపి అధ్యక్షులుగా దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గానికి పార్టీ పరిశీలకులుగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

పేదలకు వైద్య విద్యను దూరం చేయొద్దు

- ఎన్‌ఎంసికి రాసిన లేఖను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆలోచన విరమించుకోవాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం 107, 108 జిఒలను రద్దు చేయాలని, ఎన్‌ఎంసికి రాసిన లేఖను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం పలు జిల్లాల్లో ధర్నాలు నిర్వహించారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి, ఉచిత వైద్య విద్యను అందించాలని నినదించారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో చేపట్టిన ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదవాలనుకునే వారి ఆశలను టిడిపి కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తోందని విమర్శించారు. విద్యను హక్కుగా అందించాల్సిన ప్రభుత్వం తన బాధ్యతను మరిచి ప్రయివేటుకు పట్టం కట్టడం దుర్మార్గమని అన్నారు. కేంద్రంతో సంప్రదించి రాష్ట్రానికి 5 మెడికల్ కళాశాలలకు అనుమతులు తేవాల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లకు కూడా వసతులు కల్పించలేమని రాష్ట్ర ప్రభుత్వమే ఎన్‌ఎంసికి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఒపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 700 సీట్లు కోల్పోయామన్నారు. ప్రయివేటీకరణ జరిగితే ఎంతో మంది పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనకాపల్లి కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, పాయకరావుపేట, చోడవరం తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటుపరం చేయొద్దంటూ ప్లకార్డులు పట్టుకుని నినదించారు. కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో విద్యార్థులు నిరసన తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో నిరసన ప్రదర్శన, అనంతరం ధర్నా చేపట్టారు. వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని నినదించారు.



కాకినాడ జిల్లా పిఠాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కొనసాగుతున్న పూలింగ్

- ఇంకా 3,558 ఎకరాల సమీకరణకు ప్రభుత్వ యత్నాలు
- రైతుల ఇళ్లకు వెళుతున్న మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధానికి భూ సమీకరణ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. గతంలో పూలింగు ప్రక్రియ ముగిసే సమయానికి 4,811 ఎకరాలు అప్పట్లో పెండింగ్‌లో ఉండిపోయింది. అనంతరం 220 ఎకరాల వరకూ రైతులు ముందుకొచ్చి పూలింగుకు ఇచ్చారు. మరో 400 ఎకరాలు రైతులు అమ్ముకోగా కొనుగోలు చేసిన వారు వాటిని పూలింగు ప్రక్రియలో ఇచ్చేశారు. ఇదిపోనూ ఇంకా 3,558 ఎకరాల భూమి ఇంకా పెండింగ్‌లో ఉంది. వీటిల్లో ఎక్కువ భాగం పెనుమాక, నిడమర్రు, ఎర్రబాలెం, ఉండవల్లి గ్రామాల పరిధిలోనే ఉంది. అలాగే రాయపూడిలో కొంత, లింగాయపాలెం పరిధిలో కొంత, మందడం, వెలగపూడి, మల్కాపురం పరిధిలో కూడా కొంత సమీకరించాల్సిన భూమి ఉండిపోయింది. ఇటీవల రాయపూడికి చెందిన ధనిక రైతు మల్లెల శేషగిరిరావు పూలింగ్ విధానంలో భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అప్పట్లో ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకించిన వారిలో శేషగిరి సోదరుడు హరీంద్రనాథ్‌చౌదరి, లింగయపాలానికి చెందిన అనుమోలు గాంధీతోపాటు పలువురు రైతులు ఉన్నారు.

గతంలో ఏం జరిగింది?

2014 డిసెంబర్ 8న రాజధాని ప్రకటన తరువాత 2015 జనవరి ఒకటోతేదీన నేలపాడు నుండి పూలింగు ప్రక్రియ మొదలుపెట్టారు. 2015 ఫిబ్రవరి 28తో పూలింగు గడువు ముగుస్తుందని ప్రకటించారు. అప్పటి వరకూ 4,811 ఎకరాలు ఇంకా పెండింగ్‌లో ఉంది. భూములు ఇస్తామని చెప్పినా అగ్రిమెంటుకు చేసుకోని వారికి చెందిన భూములు 2,542.69 ఎకరాలు కూడా పెండింగ్‌లో ఉండిపోయాయి. మొత్తంగా 34,040.38 ఎకరాలకు రైతులు అంగీకారపత్రాలివ్వగా 31,771 ఎకరాల్లో అధికారులు సర్వేలు పూర్తిచేశారు. 2019 చివరి నాటికి సిఆర్‌డిఏకు రావాల్సిన భూమి 4,800 ఎకరాల వరకూ ఉంది. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రక్రియ మొత్తం నిలిపేశారు.

ప్రస్తుతం ఇలా...

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెండింగ్ భూములపై జరిపిన సమీక్షలో సిఆర్‌డిఎ అధికారులు సిఎంకు వీటిపై నివేదిక ఇచ్చారు. వెంటనే మిగిలిన భూములను కూడా తీసుకోవాలని, అవసరమైతే భూ యజమానుల ఇళ్లకు వెళ్లి సమీకరణకు ఇచ్చేందుకు వారికి నచ్చచెప్పాలని ముఖ్యమంత్రి మంత్రికి సూచించారు. దీంతో మంత్రి నారాయణ ఎక్కువగా పెండింగ్‌లో ఉన్న నిడమర్రు, పెనుమాక గ్రామాల్లో రైతులను వ్యక్తిగతంగా కలుస్తున్నారు. కొంత ఫలితాన్ని సాధించారు. ఈ వారం రోజుల్లో 200 ఎకరాల వరకూ రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అలాగే పెనుమాక పరిధిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు పరిధిలో ఉన్న భూముల 44 ఎకరాలను రైతులు ప్రభుత్వానికి ఇచ్చారు. ఇటీవల పూలింగు ప్రక్రియలో భూములిచ్చిన రైతులకు 15 రోజుల్లో రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. దీంతో రైతులు కూడా ముందుకు వస్తున్నారు. గతంలో పూలింగు ప్రక్రియపై ప్రపంచబ్యాంకుకు లేఖ రాసిన రైతు కూడా భూములు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నారని సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు. దీంతో . దీంతో అతి త్వరలో పూలింగు ప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.



ధర్నా చేస్తున్న ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయులు

వేతన బకాయిలు చెల్లించాల్సిందే

- ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

తమ నాలుగు నెలల బకాయిల చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా ఆదివాసీ ప్రాంతంలో గిరిజన సంక్షేమ శాఖ విద్యా విభాగంలో ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయుల సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పాడేరు ఐటిడిఎ ముందు శుక్రవారం ఈ ధర్నా చేపట్టారు. తొలుత పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. వారినుద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి, జులై, ఆగస్టు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ మాతృ బహు భాషా విద్యా బోధన జరుగుతోందని, నాటి నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా వారు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు లేని పాఠశాలలను సైతం మాతృ బహు భాషా ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారన్నారు. వారు ఉండడం వల్ల విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య తగ్గిందన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ విద్యాబోధన అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఆదివాసీల జీవన ప్రమాణాలు పెరగడంతోపాటు బాహ్య ప్రపంచంతో అనుసంధానం పెరిగిందన్నారు.

ఇంత విశిష్ట కృషి చేస్తోన వారిపై నిర్లక్ష్యం తగదన్నారు. మాతృభాష ఉపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి శ్రీను, మహిళా కార్యదర్శి పాంగి కుమారి మాట్లాడుతూ తమ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం కానరాలేదన్నారు. ధర్నా అనంతరం గ్రీవెన్స్‌లో ఐటిడిఎ పిఒ అభిషేక్‌కు వినతిపత్రం అందజేశారు. వేతన బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కె వీరయ్య, కె కొండయ్య, డి రాజబాబు, ఎం బాబి, ఎస్ చిన్నమ్మి పాల్గొన్నారు.

26వరకు సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయవద్దు

గ్రామ వార్డు సచివాలయాల శాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో బదిలీలైన వారిని ఈనెల 26 వరకు రిలీవ్ చేయవద్దని గ్రామ వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం "ఇది మంచి ప్రభుత్వం" పేరుతో ఈనెల 20 నుంచి 26 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం 100 రోజుల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన స్టిక్కర్లు , కరపత్రాలు పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులను రిలీవ్ చేస్తే ప్రభుత్వ కార్యక్రమానికి ఇబ్బంది కలుగుతుంది. అందువల్ల ఈనెల 26వరకు ఆయా ఉద్యోగులను రిలీవ్ చేయవద్దని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ డిపార్టుమెంట్ అధికారులకు ఉత్తర్వుల్లో సూచించారు.

బాలికలపై లైంగిక దాడి కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లా కేంద్రంలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన వార్డెన్ భర్త శశికుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన భార్య, మరో యువతిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వివరాలను ఏలూరు జిల్లా ఎస్‌పి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరులోని గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన బొమ్మిరెడ్డిపల్లి శశికుమార్ ఓ డిజిటల్ ఫోటో స్టూడియో నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య శశి.. శ్రీస్వామి దయానంద సరస్వతి ఆశ్రమం బాలిక వసతి గృహంలో వార్డెన్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, ఆమె మేనకోడలు ఐయ్యారపు లావణ్య కేర్ టేకర్‌గా పని చేస్తున్నారు. వీరిద్దరిని ఆసరాగా చేసుకుని బాలికలు నివసించే ప్రాంతంలో రాత్రి సమయాల్లో శశికుమార్ సంచరించేవాడు. ఈ నెల 15న ఆశ్రమంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను కేర్ టేకర్ లావణ్య సాయంతో బలవంతంగా తన కారులో ఎక్కించుకుని బాపట్లలో ఇదే ఆశ్రమానికి చెందిన మరో బ్రాంచ్‌కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అక్కడ నుంచి బాలికను తీసుకొచ్చి ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపుతానని బెదిరించాడు. ఆదేరోజు రాత్రి 11 గంటల సమయంలో సరిగ్గా చదవడం లేదనే వంకతో మిగిలిన బాలికలను చితకబాదాడు. దీంతో బాలికలంతా కలిసి ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ రమణ కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం పాత బస్టాండ్ సమీపంలో శశికుమార్, శశి, లావణ్యలను అరెస్టు చేశారు. నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు.

చీపురుపల్లి టు నేపాల్ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-చీపురుపల్లి



పర్యావరణ పరిరక్షణలో భాగంగా విజయనగరం జిల్లా గరివిడి మండలం, కుమరాం పాలవలస గ్రామానికి చెందిన కొట్టాడ హరికృష్ణ చీపురుపల్లి నుండి నేపాల్ వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ రోజు రోజుకూ పర్యావరణం ప్రమాదంలో పడుతుం డడం ఆందోళన కలుగుతోందన్నారు. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా ప్రజలను జాగృతం చేసేందుకు చీపురు పల్లి నుండి నేపాల్ వరకు సైకిల్ యాత్ర చేపట్టానని తెలిపారు. హరికృష్ణను వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అభినందిం చారు.

మరణశిక్ష జోన్‌లుగా సెజ్‌లు

అసెన్షియా యాజమాన్యంపై మర్డర్ కేసు నమోదు చేయాలి

భద్రత పాటించని యాజమాన్యాలను జైలులో పెట్టాలి

ఫార్మా, సెజ్ కార్మికుల రక్షణ యాత్ర ముగింపు సభలో వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అచ్యుతాపురం విలేకరి

ప్రత్యేక ఆర్థిక మండళ్లు(సెజ్‌లు) ప్రత్యేక మరణ శిక్ష జోన్‌లుగా మారాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పరిశ్రమాధిపతులు లాభాలు సంపాదించి శత కోటీశ్వరులు అవుతుంటే, కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో ఫార్మా, సెజ్ కార్మికులు, ఉద్యోగులు, ప్రజల భద్రత కోసం ఐదు రోజుల పాటు సిపిఎం ఆధ్వర్యాన చేసిన రక్షణ యాత్ర ముగింపు సభ శుక్రవారం అచ్యుతాపురం జంక్షన్ వద్ద పార్టీ మండల కన్వీనర్ ఆర్.రాము అధ్యక్షతన జరిగింది. ఆ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల పేరుతో ఈజ్ ఆఫ్ డెత్ బిజినెస్ చేస్తున్నారని విమర్శించారు. బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టిన వారికి రాయితీలిచ్చి, కష్టపడి పనిచేసే కార్మికులకు ఎటువంటి సౌకర్యాలూ కల్పించడం లేదన్నారు. అచ్యుతాపురం సెజ్‌లో అసెన్షియా కంపెనీలో 17 మంది మృతికి కారణమైన యాజమాన్యంపై మర్డర్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన యజమానులను జైల్లో పెట్టాలన్నారు. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని కాలాన్ని 8 నుంచి 12 గంటలకు పెంచినా కార్మికుల వేతనం మాత్రం పెంచడం లేదన్నారు.



సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై లోకనాథం తదితరులు

పరిశ్రమలు, గార్మెంట్లలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రకృతి వనరులైన భూమి, గాలి, నీటిని అదానీకి కట్టబెడుతున్నారని వివరించారు. కాకినాడ సెజ్‌కు పది వేల ఎకరాలు సేకరించి పదేళ్లయినా.. 150 ఎకరాల్లోనే పరిశ్రమలు వచ్చాయన్నారు. ఇతర పార్టీలు అధికారం, పదవుల కోసం యాత్ర నిర్వహిస్తే, కార్మికుల భద్రత, రక్షణకు సిపిఎం రక్షణ యాత్ర చేపట్టిందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉద్యోగాలొస్తాయని కోస్టల్ కారిడార్‌కు రెండున్నర లక్షల ఎకరాల భూములిచ్చినా, పరిశ్రమలు, ఉద్యోగాలు కలగానే మిగిలాయన్నారు. కార్మికులకు సేవ చేసే ప్రభుత్వాలివి కాదని, పెట్టుబడిదారుల పల్లకీ మోసే ప్రభుత్వాలని విమర్శించారు. అసెన్షియా ప్రమాదం నుంచి పాఠాలు నేర్చుకొని కార్మికుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ఎంపీలు పార్లమెంట్‌ను ఎందుకు దిగ్బంధం చేయడం లేదని ప్రశ్నించారు. ఎంపీలు మోడీకి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు, నిర్వాసిత కుటుంబాలకు శాశ్వత ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.ప్రభావతి, ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ, వివి.శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, ఎ.రాజు, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి కన్నుమూత

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మాజీ శాసన సభ్యులు, రాజకీయ విశ్లేషకులు అడుసుమిల్లి జయప్రకాశ్ (72) శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో మరణించారు. గత కొంత కాలంగా ఆయన లంగ్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. కాకాని వెంకటరత్నం అనుచరుడుగా ఆయన ఆంధ్రోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుడైన జయప్రకాశ్ 1983లో ఆ పార్టీ తరఫున విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు.



సమైక్యవాద ఉద్యమంలో పాల్గొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం విజయవాడ మొగల్రాజపురంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాజీ ఎంపి సురేష్ నివాసంలో తనిఖీలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితుడుగా ఉన్న మాజీ ఎంపి నందిగం సురేష్ నివాసంలో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేశారు. తుళ్లూరు మండలం ఉద్దండ్రాయుని పాలెంలోని సురేష్ నివాసానికి పోలీసులు వెళ్లారు. ఇంట్లో పెద్దవాళ్లు ఎవ్వరూ లేకపోవడంతో ఇంట్లో ఉన్న ఒక యువకుడికి నోటీసులు అందించారు. ప్రస్తుతం అరెస్టు అయి రిమాండ్‌లో ఉన్న సురేష్ ఇటీవల విచారణలో అనేక అంశాలు వెల్లడించడంతో ఆయన కుటుంబ సభ్యులను విచారించి పలు ఆధారాల కోసం దర్యాప్తు చేపట్టారు. టిడిపి కార్యాలయంపై దాడి ఘటనలో పరస్పర విరుద్ధమైన సమాధానాలు చెప్పడంతో పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన రోజున ఆయన స్వగ్రామంలో ఉన్నారా లేక బయట నుంచి వైసిపి కార్యాలయానికి వచ్చారా అని కూడా విచారిస్తున్నట్టు తెలిసింది. సురేష్ నివాసంలో ఏమైనా ఆధారాలు లభిస్తాయోమోనని తనిఖీలు చేసినట్టు సమాచారం. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో పెద్దవారు వస్తే మంగళగిరి పోలీసు స్టేషన్‌కు రావాలని ఆదేశించి వెనుదిరిగారు.

నరసాపురం-మచిలీపట్నం రైల్వేలైన్ సర్వే సానుకూలం

- కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - నరసాపురం

ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన నరసాపురం-మచిలీపట్నం రైల్వే లైన్ నిర్మాణానికి చేపట్టిన సర్వే సానుకూలంగా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. నరసాపురం నుంచి మొగల్తూరు, బంటుమిల్లి మీదుగా మచిలీపట్నం వరకు చేపట్టే కొత్త రైల్వే లైన్‌కు అయ్యే ఖర్చు, భూసేకరణ, ప్రయాణికుల రద్దీ, ఇతర రూట్లతో అనుసంధానం తదితర అంశాలపై రైల్వే అధికారులు ప్రాథమిక సర్వే నిర్వహించారని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు త్వరలోనే క్లియరెన్స్ వస్తుందని చెప్పారు. మన రాష్ట్రం నుంచి వారణాసికి ప్రస్తుతం విశాఖ నుంచి ఒక రైలు నడుస్తున్నా అది విజయనగరం జిల్లా వాసులకే ఉపయోగకరంగా ఉందని, ఈ రైలును నరసాపురం నుంచి నడపాలని రైల్వే మంత్రిని కోరినట్లు చెప్పారు. నరసాపురం నుంచి పగటిపూట వందేభారత్ రైలు నడపాలని, చెన్నై-విజయవాడ మధ్య నడుస్తున్న వందేభారత్‌ను నరసాపురం లేదా భీమవరం వరకూ పొడిగించాలని కోరినట్లు తెలిపారు. నరసాపురం నుంచి ప్రతి ఆదివారం హైదరాబాద్‌కు నడుస్తున్న స్పెషల్, వీక్లీ.. బెంగుళూరు స్పెషల్‌ను రెగ్యులర్ చేయాలని మంత్రిని కోరామన్నారు. కోటిపల్లి రైల్వేలైన్ పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటాలో ఒక్క రూపాయి కూడా వైసిపి ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. కోనసీమ జిల్లాలో భూసేకరణ పెండింగ్‌లో ఉందన్నారు.

సినీ నటి కేసులో విద్యాసాగర్ అరెస్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫోర్జరీ పత్రాలతో తనపై అక్రమంగా కేసులు పెట్టి హింసించారని బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీ పెట్టిన కేసులో కె విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. జెత్వానీ ఫిర్యాదు తర్వాత విద్యాసాగర్ అజ్ఞాతంలోకి వెళ్లారు. కేసు నమోదైన తర్వాత పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో డెహ్రాడూన్‌లో వున్నట్లు గుర్తించారు. వారి నుంచి తప్పించుకునేందుకు విద్యాసాగర్ తన స్నేహితుడి మొబైల్ వినియోగించారు. అయినా, సాంకేతికత సాయంతో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ఫోర్జరీ పత్రాలతో తనపై తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేసి ఇబ్బందులకు గురి చేశారని జెత్వానీ ఇటీవల ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందులో ఐపిఎస్ అధికారులు సీతారామాంజనేయులు, కాంతిరాణా, విశాల్ గున్ని కీలకపాత్ర పోషించారని ఆమె ఫిర్యాదులో తెలిపారు. దీనిని ఆధారంగా చేసుకుని పోలీసులు విద్యాసాగర్‌ను ఏ1గా చేర్చారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం విచారణ అనంతరం ఇప్పటికే ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పిఎస్ఆర్ సీతారామాంజనేయులు, విజయవాడ సిపి కాంతిరాణా టాటా, డిసిపి విశాల్ గున్నిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అతనితోపాటు మరికొందరు అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. తప్పుడు ఆధారాలను సృష్టించడం, నేరానికి పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం, పత్రాలను ఫోర్జరీ చేయడం, తప్పుడు రికార్డులను తయారు చేయడం, తదితర ఆరోపణలపై ఐపిసిలోని 192, 211, 218, 220, 354 (డి), 467, 420, 469, 471 రెడ్ విత్ 120 (బి), ఐటి చట్టంలోని 66ఎ సెక్షన్ల కింద కేసు పెట్టిన విషయం తెలిసిందే.

27 నుండి తిరుపతిలో అనస్తీషియా వైద్యుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తియాలజిస్ట్స్ (ఎనస్తీషియా వైద్యులు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ 33వ వార్షికోత్సవ సదస్సు తిరుపతిలోని శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎనస్తీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్, యర్రంశెట్టి అచ్యుత్ రామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొండంత నష్టం... గోరంత పరిహారం

- వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు చెల్లించాలి
- రైతుసంఘం బృందం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలు, వరద ప్రభావంతో దెబ్బతిన్న గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం, దుగ్గిరాల మండలం, తెనాలి మండలం హాఫ్‌పేటలోని పొలాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వి కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం కేవలం 4.50 లక్షల ఎకరాలుగా ఉన్నా, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే దాదాపు పది లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయారని తెలిపారు. కృష్ణా లంక ప్రాంతాల రైతులు వాణిజ్య పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. దాదాపు ఎకరాకు రూ.లక్ష వరకూ పెట్టుబడులు పెడితే ప్రభుత్వం కేవలం రూ.14 వేలు పరిహారం ప్రకటిచడం దారుణమన్నారు. వరి సాగుకు ఎకరానికి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోతే, ఎకరాకు



హాఫ్‌పేటలో దెబ్బతిన్న వరిని చూపుతున్న రైతు సంఘం బృందం

కేవలం రూ.10 వేలు చెల్లిస్తామనడం సరికాదన్నారు. కె ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ సాగుదారుకు పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం చెబుతున్నా పరిహారం నమోదు విషయంలో భూ యజమాని అనుమతి కావాలంటూ కొందరు అధికారులు కౌలు రైతులను ఇబ్బంది పెడుతున్నారన్నారని, ఫలితంగా కౌలు రైతులకు అన్యాయం జరగుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జొన్నా శివశంకరరావు, కె అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు, సిఐటియు నాయకులు నన్నపనేని శివాజి, రైతులు పాల్గొన్నారు.



మూడో పడవ తొలగింపు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

ప్రకాశం బ్యారేజీ వద్ద గేట్లను ఢీకొట్టి చిక్కుకుపోయిన మూడో పడవ తొలగింపునకు శుక్రవారం చర్యలు ప్రారంభించారు. బ్యారేజీ 69వ గేటు వద్ద బోల్తా పడి ఉన్న దీని తొలగింపునకు ఒకటి రెండ్రో పట్టవచ్చుని తెలిపారు. రెండో పడవను గురువారం విజయవంతంగా బయటకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

చెరకు పంటకు మద్దతు ధర ఇవ్వాలి

- ఎపి చెరకు రైతుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

చెరకు టన్నుకు 9.5 రికవరీ శాతంపై రూ.నాలుగు వేలు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ చెరకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం తక్కెళ్లపాడు, గుణ్ణంపల్లి గ్రామాల్లో సంఘం నేతలు పర్యటించి చెరకు పంటను పరిశీలించారు. తక్కెళ్లపాడులో చెరకు రైతు ముల్లంగి ఈశ్వరరెడ్డి సాగు చేసిన 2468 విత్తనం ఎకరాకు 70 టన్నులు దిగుబడి రావడంతో సాగు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదు లక్షల ఎకరాల్లో సాగయ్యే చెరకు పంట కాస్త ఐదు వేల ఎకరాలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా చెరకు రైతులు సంక్షోభంలో కూరుకుపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చెరకు ఫ్యాక్టరీలు మూతపడ్డాయని, చెరకు పంటపై ఆధారపడిన రైతులు, కూలీలు, కార్మికులు ఉపాధి కోల్పోయారని చెప్పారు. మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపించాలని, చెరకు పంటకు రాష్ట్ర ప్రభుత్వం సలహా ధర ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం సర్క్యూట్లపై ప్రత్యేక శ్రద్ధ

- పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టూరిజం సర్క్యూట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పర్యాటకులు 2-3 రోజులు టూరిజం స్పాట్‌లో గడిపేలా వసతులు ఉండాలని తెలిపారు. ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో పర్యాటకశాఖ అధికారులతో మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పర్యాటకంపై సోషల్ మీడియా ద్వారా విరివిగా ప్రమోషన్ చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లాలని ఆదేశించారు.

పర్యాటక ప్రాంతాల్లోని సమస్యలపై దృష్టిసారించి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఎకోటూరిజం, అడ్వెంచర్ టూరిజం, టెంపుల్ టూరిజం, అగ్రిటూరిజాలపై దృష్టి సారించాలని చెప్పారు. ప్రముఖ సంస్థలతో మాట్లాడి పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎఫ్‌డిసితో సమన్వయం చేసుకుని థియేటర్‌లలో పర్యాటకంపై లఘు చిత్రాలు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తన నియోజకవర్గం నిడదవోలులో పర్యాటక ప్రాంతానికి అవసరమైన అన్ని వనరులూ ఉన్నాయని వివరించారు. త్వరలోనే సినీ నిర్మాతలతో సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ నెల 27న పర్యాటకశాఖ దినోత్సవాన్ని పెద్దయెత్తున నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపి టిడిసి ఇడి ఎఎల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి సహకరించాలి

పర్యాటక రంగం అభివృద్ధికి సహకరించాలని మంత్రి దుర్గేష్ కోరారు. 'ఆంధ్రప్రదేశ్-వియత్నాం టూరిజం కాన్‌క్లేవ్-2024' కార్యక్రమం విజయవాడలో శుక్రవారం జరిగింది. ఐరా ఓవర్సీస్ స్టడీస్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. వియత్నాం తరపున హెచ్ఇ ఎంగ్యాయేన్ థాన్హ్‌ పాల్గొన్నారు. బౌద్ధరామాలు, స్మారకాలపై వియత్నాం ప్రతినిధి ఆసక్తి కనపరచగా, వాటి గురించి మంత్రి వివరించారు. రాష్ట్రంలో రెండు ప్రధాన బౌద్ధ సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని వారిని కోరారు.

భారత్-వియత్నాం, ఆంధ్రప్రదేశ్-వియత్నాం మధ్య సంబంధాలు బలోపేతం కావాలని వియత్నాం ప్రతినిధి హెచ్ఇ ఎంగ్యాయెన్ థాన్హ్‌ కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పొట్లూరి భాస్కర్‌రావు, టూరిజం అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్ మోహన్, ఐరా ఓవర్సీస్ స్టడీస్ వ్యవస్థాపకులు, సిఇఒ దీప తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వారంలో రెండు కొత్త అవుట్‌లెట్లు

- పండుగ సీజన్‌లో 35 శాతం డిస్కౌంట్లు
- సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవ్ సర్కార్ వెల్లడి

Godrej interio

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ ఫర్నీచర్ ఉత్పత్తుల బ్రాండ్ గోద్రేజ్ ఇంటీరియో రిటైల్ నెట్‌వర్క్‌లో భారీ విస్తరణపై దృష్టి పెట్టింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ దేవ్ సర్కార్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రతీ వారంలో రెండు చొప్పున కొత్తగా 104 అవుట్‌లెట్లు తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

వచ్చే మూడేళ్లలో 25 కొత్త షోరూంలు, 150 రిటైల్ అవుట్‌లెట్‌లను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రస్తుతం దక్షిణాదిలో తమకు 250 పైగా ఛానల్ భాగస్వాములు ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా 600 పైగా నగరాల్లో తమకు 900 పైగా అవుట్‌లెట్‌లు ఉన్నాయన్నారు. గతేడాది రూ.3200 కోట్ల టర్నోవర్‌ను సాధించామన్నారు. ప్రస్తుత పండుగ సీజన్‌లో తమ ఉత్పత్తులపై 35 శాతం వరకు డిస్కౌంట్‌ను అందిస్తామన్నారు. వచ్చే మూడేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో 25 అవుట్‌లెట్‌లు తెరువాలని నిర్దేశించుకున్నామన్నారు. ఫర్నీచర్ మార్కెట్ రూ.1.40 లక్షల కోట్లుగా ఉందని.. ఇందులో సంఘటిత మార్కెట్ విలువ రూ.8000 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేశారు.

మారుతి సుజుకి సరికొత్త వాగనర్ వాల్ట్జ్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి కొత్తగా వాగనర్ వాల్ట్జ్ లిమిటెడ్ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.5.65 లక్షలుగా నిర్ణయించింది. ఇది పెట్రోల్, సిఎన్‌జి వేరియంట్లలో లభిస్తుందని ఆ కంపెనీ తెలిపింది. ఇది లీటర్‌కు 25.19 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని పేర్కొంది. 1999లో విడుదల చేసిన వాగనోర్ ఇప్పటి వరకు 32,50,000 యూనిట్లను విక్రయించినట్లు ఆ కంపెనీ తెలిపింది.



ఫిజిక్స్‌వాలాకు రూ.1750 కోట్ల నిధులు

బెంగళూరు : ఎడ్‌టెక్ సంస్థ ఫిజిక్స్‌వాలా (పిడబ్ల్యు) 210 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1750 కోట్లు) నిధులు సమీకరించినట్లు శుక్రవారం ప్రకటించింది. సిరీస్ బి ఫండింగ్ రౌండ్‌లో ఈ నిధులను సమీకరించినట్లు వెల్లడించింది. దీంతో సంస్థ విలువ 2.8 బిలియన్ డాలర్లు (రూ.23,383 కోట్లు)కు చేరినట్లు తెలిపింది. తాజా ఫండింగ్ రౌండ్‌లో ప్రస్తుత పెట్టుబడిదారులు జిఎస్‌వి, వెస్ట్‌బ్రిడ్జ్‌లు మద్దతును కొనసాగించగా.. హార్న్‌బిల్ కాపిటల్, లైట్‌స్పీడ్ వెంచర్ భాగస్వాముల నుంచి మద్దతు లభించిందని ఆ సంస్థ సిఇఒ అలఖ్ పాండే తెలిపారు.

సెన్సెక్స్ @84వేలు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు నూతన మైలురాయిని నమోదు చేశాయి. సెన్సెక్స్ తొలిసారిగా 84 వేలు, నిఫ్టీ 25,800 పాయింట్ల మార్క్‌ను దాటాయి. శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1359.51 పాయింట్లు లేదా 1.63 శాతం ఎగిసి 84,544కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 375 పాయింట్లు లేదా 1.48 శాతం పెరిగి 25,791 వద్ద ముగిసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నాలుగు సంవత్సరాల తర్వాత వడ్డీ రేట్లను తగ్గించింది. దీంతో మార్కెట్లకు కొత్త ఉత్సాహం లభించింది. ఈ క్రమంలో గురువారం అమెరికా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. ఆ ప్రభావం భారత మార్కెట్లపై పడింది. నిఫ్టీ 50లో 44 షేర్లు లాభపడ్డాయి. ఎంఅండ్ఎం, ఐసిఐసిఐ బ్యాంక్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఎలఅండ్‌టి, కోల్ ఇండియా షేర్లు అత్యధికంగా 5.3 శాతం పెరిగాయి. మరోవైపు గ్రాసిం ఇండస్ట్రీస్, ఎస్‌బిఐ, ఎన్‌టిపిసి షేర్లు నష్టాలను చవి చూశాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్క శాతం చొప్పున పెరిగాయి.



మరో సిమెంట్ కంపెనీలో అదానీ పెట్టుబడులు..!

న్యూఢిల్లీ : భారత సిమెంట్ రంగంలో గౌతం అదానీ ఏకచత్రాదిపత్యం కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

ఇప్పటికే అనేక సిమెంట్ కంపెనీలను స్వాధీనం చేసుకున్న అదానీ గ్రూపు తాజాగా ఐటిడి సిమెంట్రేషన్ ఇండియాలో 46.64శాతం వాటాలను కొనుగోలు చేశారని సమాచారం. రూ.5,888.57 కోట్లతో వాటాను కొనుగోలు చేసేందుకు ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరినట్లు మీడియా రిపోర్టులు వస్తోన్నాయి. గత రెండేళ్లలో ఆరు సిమెంట్ కంపెనీలను కొనుగోలు చేసింది.

ట్రిపుల్ ఐటి విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

- డాక్టర్ పోలా భాస్కర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలోని విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాష్ట్ర వెనుకబడిన తరగతుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, విద్యార్థుల అనారోగ్యం నేపథ్యంలో రాష్ట్ర ఉన్నతాధికారులు శుక్రవారం ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్ ఐటిని సందర్శింకచారు. జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వితో కలసి విద్యార్థుల మెస్, కిచెన్, డైనింగ్ హాళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం సమావేశ మందిరంలో ట్రిపుల్ ఐటి అధికారులుతో వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలా భాస్కర్ మాట్లాడుతూ ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటిలో చోటుచేసుకున్న పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. ట్రిపుల్ ఐటిలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సేవలందించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెస్ కాంట్రాక్టర్‌ను మార్చి కొత్తగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. సిసి కెమెరాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. మెస్ కాంట్రాక్టర్ల ఎంపిక, విద్యార్థులకు సౌకర్యాల కల్పన తదితర అంశాలపై ట్రిపుల్ ఐటి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.

సంపాదకీయం


వంద రోజుల పాలన

తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని జనసేన, బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి శుక్రవారానికి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పాలనా తీరును పరిశీలిస్తే ఉగాది పచ్చడిలా అనిపిస్తోంది. గత ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజానీకం టిడిపి సంకీర్ణాన్ని భారీ మెజార్టీతో అధికారానికి తెచ్చారు. అలాగే ప్రభుత్వ పనితీరుమీద కూడా ప్రజలు కోటి ఆశలు పెట్టుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే సామాజిక పెన్షన్లను పెంచుతూ తీసుకున్న నిర్ణయం సానుకూల సంకేతాలను పంపింది. ఆయా తరగతులవారంతా సంతోషించారు. ఇచ్చిన మాట ప్రకారం అన్న క్యాంటీన్లను విడతల వారీగా ప్రారంభించడమూ మంచిదే! మెగా డిఎస్‌సి ఫైలుపై సంతకం చేసినా, నోటిఫికేషన్ వాయిదా వేయడంతో అభ్యర్థులకు ప్రయోజనం కలుగలేదు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి కోసం గిరిజన నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. షెడ్యూల్డు ప్రాంతంలో క్లాస్3, క్లాస్4 ఉద్యోగాలు, టీచర్ తదితర పోస్టులను నూరు శాతం గిరిజనులకే రిజర్వు చేసిన జిఓ నెంబర్ పునరుద్ధరణకు సుప్రీం కోర్టులో ఇంప్లీడ్ కావడానికి సర్కారు ఇంకా నిర్దిష్ట చర్యలు చేపట్టలేదు. గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పదంగా మారిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేసింది. ధాన్యం బకాయిల చెల్లింపు రైతాంగానికి ఊరట. అయితే, సూపర్ సిక్స్ హామీలలో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు దీపావళి నుండి ఇస్తామన్నారు. రైతులకు ఇస్తామన్న 20 వేల రూపాయలు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత ప్రయాణం, యువగళం వంటివి ఎప్పుడిస్తారా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

రాష్ట్రానికి కీలకమైన ప్రత్యేకహోదా గురించి సంకీర్ణ సర్కారు నేతలు మాట్లాడడమే లేదు. విభజన హామీల ఊసూ లేదు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు మూడేళ్లకుపైగా ఆందోళన కొనసాగిస్తున్నారు. ప్రైవేటీకరించి తీరుతామని కేంద్ర ప్రభుత్వ పెద్దలంటున్నారు. కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న టిడిపి ఈ విషయంలో బిజెపిని నిలవేస్తున్న దాఖలాల్లేవు. ఎలాగైనా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నది రాష్ట్ర ప్రజలందరి కోరిక. అందుకోసం టిడిపి కృషి చెయ్యాలి. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్, గైడ్‌బండ్ డ్యామేజ్ కావడం వంటి అంశాలతో గందరగోళం నెలకొంది. నిపుణుల పరిశీలన అనంతరం 900 కోట్ల రూపాయలతో డయాఫ్రం వాల్ మళ్లీ కట్టాలని నిర్ణయించారు. కానీ వేల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగానికి బాధ్యులను మాత్రం తేల్చలేదు. అలాగే నిర్వాసితుల సమస్యలను పరిష్కరించే విషయంలో ముందడుగు లేదు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర రాజధాని గందరగోళంగా మారింది. అమరావతే రాజధాని అని కొత్త ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. కేంద్రం నుండి రూ.3000 కోట్లు వచ్చాయి. మరో రూ.15 వేల కోట్ల రుణం ఇప్పిస్తామని కేంద్రం ప్రకటించింది. ప్రపంచబ్యాంకు ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చి చర్చించి వెళ్లారు. శ్వేత పత్రాలను విడుదల చేసిన ప్రభుత్వం గత ఐదేళ్ల ఏలుబడిని విమర్శించడమే లక్ష్యంగా చేసుకుంది కానీ ఆయా రంగాల్లో ఏం చేయబోతున్నామన్న స్పష్టతనివ్వలేదు. జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం పేర్లతోపాటు సుమారు 28 సంక్షేమ పథకాల పేర్లను మార్చారు. ఎన్నడూ లేని విధంగా కృష్ణానదికి వరద, బుడమేరు ముంపుతో తీవ్రనష్టం సంభవించింది.

కొత్త ప్రభుత్వం వచ్చాక స్కీమ్ వర్కర్లు, ఇతర చిరుద్యోగులపై రాజకీయ వేధింపులు పెరిగాయి. వారి ఉద్యోగ భద్రతకూ ముప్పు ఏర్పడడంతో ఎక్కడికక్కడ ఆందోళన చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఆస్తి పన్ను పెంపుదల, చెత్తకు యూజర్ ఛార్జీలు వంటివి రద్దు చేస్తామని ఎన్నికల ముందు చెప్పినా ఆచరణలో అడుగు ముందుకు పడలేదు సరికదా పాత రేట్ల ప్రకారమే జనానికి నోటీసులొస్తున్నాయి. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గిస్తామని హామీనిచ్చినా ఆ దిశలో చర్యలు లేవు. స్మార్ట్ మీటర్ల విషయంలోనూ అంతే! తాజాగా గ్రీన్ పవర్ పేరిట భూములు, నీళ్లు వంటి ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే యత్నాలు కూడా మొదలయ్యాయి. మొత్తమ్మీద కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో నయా ఉదారవాద ఆర్థిక విధానాల అమలు గత ప్రభుత్వం మాదిరే కొనసాగిస్తోంది. ఏది ఏమైనా ప్రజలకిచ్చిన హామీలన్నిటినీ ప్రభుత్వం అమలు చేయాలి.

మంచి మాట



పుస్తకాలు ఎంత ముఖ్యమో, అంతకంటే పది రెట్లు మనిషి జీవితానుభవం ద్వారా నేర్చుకోగలుగుతాడు. విద్య పుస్తకాల వరకే పరిమితం కాక, నిత్య జీవితంతో సంబంధం కలిగి వుండాలి. అది జీవితాంతం విద్య కావాలి.

- గ్రుండ్ విగ్,
ఫోక్ హైస్కూల్ రూపకర్త.

N. F. S. Grundtvig

జమిలి ఎన్నికలు సమాఖ్య విధానానికి విరుద్ధం

విశ్లేషణ



కె.యస్.లక్ష్మణరావు


నరేంద్ర మోడీ ప్రభుత్వం కొన్నేళ్లుగా చెబుతూ వస్తున్న 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై మరో అడుగు ముందుకు వేసింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ ఈ ప్రతిపాదనపై ఇచ్చిన నివేదికను కేంద్ర మంత్రివర్గం లాంఛనంగా ఆమోదించడంతో దేశవ్యాప్త చర్చ ప్రారంభమైంది. 2014లో తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గత దశాబ్ద కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత ప్రజల భిన్నత్వ, బహుళత్వ సంస్కృతిపై దాడి ప్రారంభించింది. దేశంలో ఒకే మతం వుండాలని, ఒకే రకమైన పన్ను వుండాలని, ఒకే రకమైన తిండి తినాలని, ఒకే రకమైన సంస్కృతి, భాష ఉండాలని చేస్తున్న దాడులలో భాగంగా ఇప్పుడు 'ఒకే ఎన్నికలు' ఉండాలని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. 2022 డిసెంబర్‌లో జాతీయ లా కమిషన్ ఓ ధర్మ సందేహాన్ని వెలిబుచ్చింది. జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి, సమాఖ్య రాజ్యపాలనా పద్ధతికి భంగకరం కావచ్చని పేర్కొన్నది. దీనికి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఎటువంటి సమాధానం చెప్పలేదు. జమిలి ఎన్నికలు జరపాలని కేంద్ర కేబినెట్ ఆమోదించటాన్ని ముఖ్యమైన రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు, లౌకికవాదులు, రాజ్యాంగవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సిఫార్సులు

జమిలి ఎన్నికల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాయకత్వంలో ఓ కమిటీని నియమించింది. ఈ కమిటీ 18 వేల పేజీల నివేదికను రాష్ట్రపతికి సమర్పించింది. దేశంలో 47 రాజకీయ పార్టీలలో 32 పార్టీలు జమిలి ఎన్నికలకు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. ఈ కమిటీ 2029 నాటికి రాజ్యాంగంలో 5 ఆర్టికల్స్ సవరణ చేసి జమిలి ఎన్నికలు నిర్వహించవచ్చని తెలిపింది. 7 దేశాలలో జమిలి ఎన్నికల గురించి అధ్యయనం చేశామని పేర్కొంది. కానీ స్వీడన్, జర్మనీ, బెల్జియం వంటి దేశాలలో అమలులో ఉన్న నైష్పత్తిక ప్రాతినిధ్య విధానం గురించి కమిటీ పేర్కొనలేదు. కోవింద్ కమిటీ 10 కీలక సిఫార్సులు చేసింది. తొలి దశలో లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, రెండో దశలో కార్పొరేషన్లకు, మునిసిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు, పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొంది. స్థానిక సంస్థల ఎన్నికలు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన 100 రోజుల్లోగా పూర్తి చేయాలని చెప్పింది. జాతీయ ఎన్నికల సంఘం రాష్ట్ర ఎన్నికల సంఘాలతో కలిసి ఒకే ఫొటో గుర్తింపు కార్డును జారీ చేయాలని పేర్కొంది.

రాజ్యాంగ సవరణలు

జమిలి ఎన్నికలు అమలులోకి రావటానికి కనీసం 6 రాజ్యాంగ సవరణలు చేయవలసి ఉంటుందని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ పేర్కొన్నది. దేశంలో వివిధ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు, మార్గదర్శకాలను నిర్దేశించిన 1951 ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయడంతో పాటు కనీసం 6 కీలక రాజ్యాంగ సవరణలు చేయవలసి ఉంటుంది. లోక్‌సభ, రాజ్యసభ కాల పరిమితిని నిర్ణయించే 83వ ఆర్టికల్, రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని నిర్ణయించే 172వ ఆర్టికల్, ఎన్నికల కమిషన్ అధికారాలకు సంబంధించిన 324వ ఆర్టికల్ సవరణ చేయాలి. వీటితో పాటు స్థానిక సంస్థలకు సంబంధించిన ఆర్టికల్ 243-కె, 243-జడ్.ఏ లను కూడా సవరించవలసి ఉంటుంది. ఇవన్నీ జరగాలంటే రాజ్యాంగ సవరణలను రాజ్యసభ, లోక్‌సభలలో 2 బై 3వ వంతు మెజారిటీతో ఆమోదించాలి. ప్రస్తుతం రెండు సభలలో బిజెపికి ఉన్న బలంతో అది సాధ్యం కాదు. ఇతర పార్టీల మద్దతు కూడగట్టవలసి ఉంటుంది. దీనితో పాటు స్థానిక సంస్థల రాజ్యాంగ సవరణలకు సగం రాష్ట్రాల శాసనసభలు కూడా ఆమోదించాలి. బిజెపి మిత్రపక్షాలు అంగీకరిస్తేనే ఇది సాధ్యమౌతుంది.



నరేంద్ర మోడీ ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీలు రాజకీయ నియంతృత్వం కోసమే జమిలి ఎన్నికలను ప్రతిపాదిస్తున్నాయి. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలలో బిజెపి మాత్రమే అధికారంలో ఉండాలనే ఆరాటం కనిపిస్తున్నది. దీని కోసం గత దశాబ్ద కాలంలో కనీస నైతిక విలువలు పాటించకుండా త్రిపుర, మణిపూర్, గోవా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో అనైతిక రాజకీయాలు చేశారు. కనీస విలువలు పాటించలేదు. నరేంద్ర మోడీ, అమిత్‌షాలు తమ పార్టీ ప్రాబల్యం కోసం ఒక్కో రాష్ట్రానికి ఒక్కో వ్యూహం అమలు చేస్తున్నారు. దేశమంతటా 'డబుల్ ఇంజిన్' సర్కార్ కోసం తహతహలాడుతున్న బిజెపి ఇప్పుడు జమిలి ఎన్నికలను ఒక అస్త్రంగా మలచుకోవాలని భావిస్తున్నది.

నరేంద్ర మోడీ ప్రభుత్వ వాదనలు

జమిలి ఎన్నికల గురించి 2024 ఎన్నికలకు ముందే కేంద్రం చెప్పిందని, 2047 కల్లా భారత దేశాన్ని 'వికసిత్ భారతదేశం'గా అభివృద్ధి చేయటానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. హోం మంత్రి అమిత్ షా, నరేంద్ర మోడీ 3.0 పాలనా కాలంలోనే జమిలి ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాధనం ఖర్చు తగ్గుతుందని, అభివృద్ధిపై దృష్టి సారించవచ్చని, శాంతిభద్రతల సమస్యలు తగ్గిపోతాయని వారు వాదనలు చేస్తున్నారు. 2024-25లో భారత దేశ స్థూల దేశీయోత్పత్తి నాలుగు లక్షల కోట్ల డాలర్లు దాటిపోతుందని, జిడిపిలో జపాన్‌ను అధిగమించి అతి త్వరలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని డాంబికాలు పలుకుతున్న కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల ఖర్చు ఏపాటిది? ఒకవేళ జమిలి ఎన్నికలకు వెళితే ఇ.వి.ఎం ల కొనుగోలు కోసమే ప్రతి 15 ఏళ్లకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేయవలసి ఉంటుందని ఎలక్షన్ కమిషన్ పేర్కొన్నది. జమిలి ఎన్నికల వలన జాతీయ అంశాలే ఉధృతంగా ప్రచారంలోకి వచ్చి స్థానిక అంశాలు, సమస్యలు మరుగున పడిపోతాయని ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

బహు పార్టీ విధానం-సంకీర్ణ రాజకీయాలు

భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రారంభమైన తర్వాత 1952, 1957, 1962 ఎన్నికలలో కేంద్రంలో, అన్ని రాష్ట్రాలలో (1957లో కేరళ మినహా) కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కొనసాగింది. 1967 ఎన్నికలలో కాంగ్రెస్ 8 రాష్ట్రాలలో ఓటమి చెంది భిన్నమైన పార్టీలు అధికారంలోకి వచ్చాయి. 1989 నుంచి 2014 వరకు భారతదేశంలో కేంద్రంలో అనేక రాష్ట్రాలలో సంకీర్ణ ప్రభుత్వాలు, సంకీర్ణ రాజకీయాలు కొనసాగాయి. భారతదేశంలో చారిత్రక పరిస్థితులు, భిన్నత్వం దృష్ట్యా బహు పార్టీ వ్యవస్థ ఏర్పడింది. దేశంలో జాతీయ స్థాయిలో 7 పార్టీలు జాతీయ పార్టీలుగా ఉండగా, రాష్ట్రాలలో అనేక పార్టీలు ప్రాంతీయ, రాష్ట్ర పార్టీలుగా కొనసాగుతున్నాయి. 1989, 1996, 1998లలో ఏర్పడిన లోక్‌సభలు ముందే రద్దయ్యాయి. జమిలి ఎన్నికలు జరిగినప్పటికి లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దు కావనే గ్యారంటీ ఏముంది? సంకీర్ణ ప్రభుత్వాలలో ఏదైనా సాధ్యమే. ఆ మాటకొస్తే 2024 మే లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కూడా సంకీర్ణ ప్రభుత్వమే. తెలుగుదేశం, జనతాదళ్ (యు) పార్టీ మద్దతుపై మోడీ ప్రభుత్వం ఆధారపడి ఉన్నది. రాజ్యాంగంలో 83వ నిబంధన లోక్‌సభ, 172వ నిబంధన శాసనసభ ముందే రద్దు కావడానికి అవకాశం కల్పించింది.

రాజకీయ నియంతృత్వం కోసమే

నరేంద్ర మోడీ ప్రభుత్వం, భారతీయ జనతా పార్టీలు రాజకీయ నియంతృత్వం కోసమే జమిలి ఎన్నికలను ప్రతిపాదిస్తున్నాయి. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాలలో బిజెపి మాత్రమే అధికారంలో ఉండాలనే ఆరాటం కనిపిస్తున్నది. దీని కోసం గత దశాబ్ద కాలంలో కనీస నైతిక విలువలు పాటించకుండా త్రిపుర, మణిపూర్, గోవా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో అనైతిక రాజకీయాలు చేశారు. కనీస విలువలు పాటించలేదు. నరేంద్ర మోడీ, అమిత్‌షాలు తమ పార్టీ ప్రాబల్యం కోసం ఒక్కో రాష్ట్రానికి ఒక్కో వ్యూహం అమలు చేస్తున్నారు. దేశమంతటా 'డబుల్ ఇంజిన్' సర్కార్ కోసం తహతహలాడుతున్న బిజెపి ఇప్పుడు జమిలి ఎన్నికలను ఒక అస్త్రంగా మలచుకోవాలని భావిస్తున్నది. భారత్ వంటి భిన్నత్వ, బహుళత్వ దేశంలో జమిలి ఎన్నికల ద్వారా రాజకీయ నియంతృత్వాన్ని ప్రజలపై రుద్దాలని భావించడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తుంది.

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

భారత రాజ్యాంగంలో ఒకటవ నిబంధన భారత దేశాన్ని 'రాష్ట్రాల యూనియన్'గా పేర్కొన్నది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు బలంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. సాధారణ సమయాలలో భారతదేశం 'సమాఖ్య రాజ్యాంగం'గా కొనసాగుతుందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు. బహు పార్టీ విధానంలో భారతదేశంలో కేంద్రంలో ఒక పార్టీ లేక సంకీర్ణ పార్టీలు, రాష్ట్రాలలో భిన్నమైన పార్టీలు అధికారంలో కొనసాగే అవకాశం రాజ్యాంగం ఇచ్చింది. కానీ జమిలి ఎన్నికల ద్వారా బిజెపి సమాఖ్య విధానాన్ని దెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నది. జమిలి ఎన్నికలు భారత సమాఖ్య స్వభావానికి సరిపడవని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పి.బి.సావంత్ ఎప్పుడో చెప్పారు. హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు జస్టిస్ అజిత్ ప్రకాష్ షా, జస్టిస్ గిరీష్ చంద్ర గుప్తా, జస్టిస్ సంజీవ్ బెనర్జీలు కూడా జమిలి ఎన్నికలను అనర్థదాయకాలుగా వర్ణించారు. జమిలి ఎన్నికలను 'వైవిధ్యానికి నెలవైన సమాఖ్య వ్యవస్థలో కృత్రిమంగా ఏక కేంద్ర స్వభావాన్ని చొప్పించడమే' అని అనేకమంది మేధావులు విమర్శిస్తున్నారు.

సమకాలీన భారతదేశంలో ప్రజలలో ప్రాంతీయ ఆకాంక్షలు, సామాజిక ఆకాంక్షలు పెరిగాయి. ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యత పెరిగినది. ప్రజలకు జాతీయ, రాష్ట్ర స్థాయి, స్థానిక ఆకాంక్షలు భిన్నంగా ఉంటాయి. లోక్‌సభ ఎన్నికలలో ప్రజల ఆకాంక్షలు ఒక రకంగా ఉంటే, శాసనసభ ఎన్నికలలో మరో విధంగా ఉండవచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలలో స్థానిక సమస్యలు, అభ్యర్థుల వ్యక్తిత్వాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. 2014 లోక్‌సభ ఎన్నికలలో ఢిల్లీలో 7 లోక్‌సభ స్థానాలను బిజెపి గెలుపొందింది. కొద్ది నెలల తేడాతో జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఆప్ పార్టీ 70 స్థానాలకుగాను 67 స్థానాలలో గెలుపొందింది. 1980వ దశకంలో కర్ణాటకలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ 28 స్థానాలలో 26 స్థానాలలో గెలుపొందింది. కొద్ది నెలల తేడాతో జరిగిన శాసనసభ ఎన్నికలలో రామకృష్ణ హెగ్డే నాయకత్వాన జనతా పార్టీ మెజారిటీ స్థానాలలో గెలుపొందింది. అందువల్ల జమిలి ఎన్నికలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా ఉండవు. ఇటీవల కాలంలో కూడా కొన్ని రాష్ట్రాలలో లోక్‌సభ ఎన్నికలలో బిజెపి గెలుపొందగా తరువాత జరిగిన శాసనసభ ఎన్నికలలో ఇతర పార్టీలు గెలుపొందాయి.


పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలలో సమాఖ్య విధానం, లౌకిక విధానంతో పాటు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ముఖ్యమైనది. ప్రపంచంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో బ్రిటన్ మినహా అన్ని దేశాలలో బహుళ పార్టీ వ్యవస్థ కొనసాగుతున్నది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ భారతదేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రజల హక్కులు, స్వేచ్ఛ కాపాడేదిగా ఉంటుందని పేర్కొన్నారు. జమిలి ఎన్నికల ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నది. బిజెపి మినహా మిగిలిన జాతీయ పార్టీలు, అనేక ప్రాంతీయ పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయి. పౌర సమాజం నుంచి కూడా ఒత్తిడి తెచ్చి భారత ప్రజల ప్రయోజనాలను రక్షించుకోవాలి.

/వ్యాసకర్త శాసనమండలి సభ్యులు, సెల్ : 8309965083 /

బాధితులను ఆదుకున్న భోజన కేంద్రాలు

వ్యాఖ్య



సిహెచ్. బాబూరావు



ముందస్తు హెచ్చరికలు చేయటంలో విఫలమైన ప్రభుత్వం ఈ నష్టాలకు నైతిక బాధ్యత వహించాలి. కేంద్రంపై ఒత్తిడి తేవాలి. నిధులు సాధించాలి. ఇప్పటికే దాతలు, స్వచ్ఛంద సంస్థలు వందలాది కోట్ల రూపాయలు విరాళాలు అందించారు. వరదపై విజయం సాధించేలా చేశామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పకోవడం సిగ్గుచేటు. ప్రభుత్వం చాలా చేశామనే భావన వదిలి, ఇంకా చేయాల్సింది చాలా ఉందనే ఆలోచనతో ముందుకు సాగాలి. బాధితులకు అండగా సిపిఎం నిలుస్తున్నది. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతున్నది. బాధితులకు పూర్తి స్థాయి న్యాయం జరిగే వరకూ పోరాడుతుంది.

సెప్టెంబర్ 1వ తేదీన విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజలు చూస్తుండగానే బుడమేరు వరద నీరు ఉవ్వెత్తున వచ్చి పడింది. ఇప్పటికే కృష్ణానది వరదలు వచ్చాయి. ప్రభుత్వం నుండి ఎటువంటి ముందస్తు హెచ్చరిక లేదు. కళ్ళ ముందే ఇళ్ళన్నింటిని ముంచేసింది వరద. కింది అంతస్తులలో వారు ఒక్క సామాను తీసుకునే అవకాశం లేదు. బతికితే చాలనే పరిస్థితి ఏర్పడింది. ఒక ప్రాంతం కాదు, విజయవాడలో దాదాపు సగ భాగం...32 వార్డులు, 2,70,000 కుటుంబాలు, 8 లక్షల జనం నిండా మునిగిపోయారు. వరదలు, వర్షాలతో రాష్ట్రం మొత్తంలో 11 లక్షల 90 వేల మంది నష్టపోయారు. 66 మంది మరణించారు.

వరదలో జనం అంతా మునిగిన తర్వాత ప్రభుత్వం మేల్కొంది. ముఖ్యమంత్రి తిరిగారు. యంత్రాంగం కదిలింది. కానీ జరిగిన ప్రయోజనం తక్కువ. ముంపులో ఉన్న వారిని బయటికి తేవడానికి కావాల్సిన పడవలు లేవు. మంపులో ఉన్న ఇళ్లకు కనీసం ఆహారం అందించే ఏర్పాట్లు చేయలేదు. ప్రభుత్వం మాత్రం రూ.368 కోట్ల ఖర్చుతో కోటి 14 లక్షల మందికి ఆహారం, రూ. 26 కోట్ల ఖర్చుతో కోటి 12 లక్షల మందికి మంచినీళ్ల బాటిళ్లు, రూ. 23 కోట్ల ఖర్చుతో కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు ఇచ్చామని ప్రభుత్వం ప్రకటించడం ఆశ్చర్యకరంగా వుంది. వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా వుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కొందరు యువకులు కిలోమీటర్ల దూరం నీటిలో ప్రయాణించి, ఆహారం, మంచినీళ్లు తీసుకుని స్థానిక బాధితులకు అందించారు. స్వచ్ఛంద సంస్థలు వెంటనే స్పందించాయి. ముంపులో ఉన్న వారికి అందించే ఏర్పాట్లు ప్రభుత్వం పూర్తిగా చేయలేదు. ఆహారం, సరుకులు వృధా అయ్యాయి. పంపిణీ ప్రధాన రోడ్లకే పరిమితమయ్యింది.

వారం, పది రోజుల వరకు కొన్ని ప్రాంతాలలో నీరు తగ్గలేదు. ఇళ్లల్లో తగ్గినా, రోడ్లపై పోలేదు. ఆహారం వారం తర్వాత కూడా ఇంటింటికి అందలేదు. ఆహార పొట్లాల కోసం వాహనాల వెంట పరుగులు తీసి కాళ్లు, చేతులు విరిగిన వారు ఎందరో ఉన్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు కదలినా, వాటిని వినియోగించుకునే స్థితిలో ప్రభుత్వ యంత్రాంగం లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు మొహం చాటేశారు. ముఖ్యమంత్రి హడావుడేగాని క్షేత్ర స్థాయిలో ప్రజలను ఆదుకున్నది తక్కువే.

సిపిఎం, వివిధ ప్రజా సంఘాల కార్యకర్తలు తొలి రోజే భోజన ప్యాకెట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, ఇతర వస్తువులు బాధితులకు అందించారు. పూర్తిగా మునిగిపోయిన జనం దగ్గరికి వెళ్ళటానికి అధికారులను పదేపదే అభ్యర్థించినా పడవలు ఏర్పాటు చేయలేదు. అయినా సిపిఎం కార్యకర్తలు, రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల కార్యకర్తలు నాలుగైదు అడుగుల లోతు నీటిలో వాటర్ ప్యాకెట్లు, ఆహారం పొట్లాలు, పాలు ఇతర వస్తువులు నెత్తిమీద పెట్టుకుని పది గంటల పాటు ప్రయాణిస్తూ అవకాశమున్నంత వరకు బాధితుల వద్దకు వెళ్లి అందించారు. పలు రోజులు శిబిరాలు నిర్వహించారు. శ్రమదానం చేసి వ్యర్థాలు తొలగించారు.

రోజులు గడచినా నాణ్యమైన ఆహారం అందటం లేదు. సిపిఎం చొరవ తీసుకొని ముంపుకు గురైన ప్రాంతాలలోనే భోజన కేంద్రం ప్రారంభించింది. ఒకదానితో ప్రారంభించి వెంట, వెంటనే 12 కేంద్రాలు ఏర్పడ్డాయి. ఒక రోజు కాదు...ఈ కేంద్రాలు ఒక్కొక్కటి నాలుగు నుండి తొమ్మిది రోజుల వరకు నడిచాయి. తగిన రవాణా సౌకర్యం లేదు. పాలక నేతల పర్యటనలతో ట్రాఫిక్ మరింత స్తంభిస్తున్నది. అయినా వీటన్నిటిని అధిగమించి ఎక్కడికక్కడ వంట ఏర్పాటు చేసి వేడివేడి భోజనం, కూర, సాంబార్‌తో మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా అందరికీ భోజనం అందించింది. విజయవాడలోనే ఇప్పటికి 15 రోజులుగా 1,40,000 భోజనాలు పెట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇతర ప్రాంతాలు, కృష్ణ, గుంటూరు జిల్లాల పరిధిలోని భోజన కేంద్రాలు నడిచాయి. ఆ ప్రాంతాల్లో 30 వేల మందికి భోజనం పెట్టారు.

వరద ముంపుకు గురైన బాధితులే కాదు, బాధితులకు సేవలు అందించడం కోసం విధి నిర్వహణలో భాగంగా వచ్చిన ఎన్.డి.ఆర్.ఎఫ్, ఎస్.డి.ఆర్.ఎఫ్, పోలీసులు, మున్సిపల్, ఫైర్ ఇతర శాఖల సిబ్బంది, అధికారులు ఈ కేంద్రాల్లోనే భోజనం చేయడం విశేషం. బాధితులకు, సిబ్బందికి వారం రోజులుగా సరైన ఆహారం అందలేదు. ఈరోజే సరైన భోజనం చేస్తున్నామని వారందరూ సిపిఎం కార్యకర్తలను అభినందించారు. ప్రభుత్వం వరదలో ముంచింది, సిపిఎం మమ్ములను ఆదుకున్నదంటూ బాధితులు కన్నీటితోనే సిపిఎం కార్యకర్తలను అభినందించారు. సిపిఎం చేసిన పని అన్ని వనరులు వుండి ప్రభుత్వం ఎందుకు చేయలేదు? గెలిచిన నాయకులు ఎందుకు చేయడం లేదు? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం అందించిన పాచిపోయిన పులిహోర, బిర్యాని తినలేక పారవేశామని, ఇబ్బందులు పడ్డామని చెబుతూ ఈ కేంద్రాల్లో నాణ్యమైన భోజనం పెట్టి ఆదుకున్నారని జనం రెండు చేతులెత్తి నమస్కరించడం కార్యకర్తలు, నేతలను కదిలించి వేసింది. ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టిన నేతలు, భారీ మెజారిటీతో విజయవాడలో గెలిచిన కూటమి శాసనసభ్యులు, నగరపాలక సంస్థలో బాధ్యతల్లో ఉన్న వైసిపి ప్రజాప్రతినిధులు మొహం చాటేశారని ప్రజలు విమర్శలు కురిపించారు.

సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తల ఇళ్ళన్నీ మునిగిపోయాయి. అనారోగ్యం పాలయ్యారు. అయినా 300 మంది పైగా కార్యకర్తలు ఈ భోజనకేంద్రాల నిర్వహణలో నిబద్ధతతో, ఉత్సాహంగా పాల్గొనడం గమనార్హం. కొందరు అధికార పార్టీ నేతలు ఆటంకాలు కల్పించడానికి ప్రయత్నించారు. కానీ వారి కార్యకర్తలు మాత్రం భోజన కేంద్రాల నిర్వహణపై ప్రశంసలు కురిపించారు.

ఈ వరదలో కూడా కొందరు మత, కులతత్వ, సంకుచిత ధోరణలు వదల్లేదు. ఎన్నో సంఘాలు స్వచ్ఛందంగా సేవలందించినా, కొందరు మతాలు, కులాల పేరుతో వారికే సహాయం అందించడం విమర్శల పాలయ్యింది. కానీ సిపిఎం భోజన కేంద్రాలు కులాలు, మతాలు, రాజకీయ తేడాలు లేకుండా అందరికీ భోజనం అందించడం ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నది. సాధారణ ప్రజలు సైతం ముంపుకు గురైన వారికి తమపై అంతస్తు ఇళ్లల్లో ఆశ్రయం ఇచ్చారు. భోజనం పెట్టారు. అందరూ కలిసి కష్టాలు పడ్డారు. కుల, మత తేడాలు లేకుండా సామరస్యాన్ని ప్రదర్శించారు. ఎంతో మంది యువత ఆ వీధుల వారికి కావలసిన సహాయం కోసం కృషి చేశారు. వీరి సేవా తత్పరత అభినందించ తగ్గది. రాష్ట్రం నలుమూలల నుండి సిపిఎం పిలుపు మేరకు ఎందరో ఆర్థికంగా తోడ్పడ్డారు. వరద ముంపులో ఉన్న ప్రాంతాలలో సైతం వారి శక్తి మేరకు వస్తువులు అందించారు. భోజనం వడ్డించారు. అంచనాలకు మించిన జనం రావటంతో కార్యకర్తలు, నేతలు అప్పులు చేసి మరీ ఈ కేంద్రాలను నిర్వహించడం విశేషం.

సిపిఎం ఒకవైపున సేవ, మరోవైపున పోరాటం రెంటినీ చేసింది. భోజన కేంద్రాలు ప్రభుత్వ తీరును ఎండగట్టాయి. ప్రజా ప్రతినిధులపై ఒత్తిడి పెంచాయి. ప్రజలను ఐక్యం చేశాయి. సాధారణ ప్రజలకు భరోసానిచ్చాయి. సిపిఎం కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవాలనే దృక్పథాన్ని పెంచింది. సామాన్య ప్రజలకు, కష్టాల్లో ఉన్న వారికి సంఘీభావం తెలపడం, సహాయం చేయడం ప్రజా చైతన్యంలో భాగమే. సిపిఎం గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కరువు ప్రాంతాల్లో గంజి కేంద్రాలు, కరోనా సమయంలో ఐసోలేషన్ కేంద్రాలు, ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించింది.

అనేక ప్రజా సంఘాలు, విజ్ఞాన కేంద్రాలు ఈ కృషిలో అన్ని విధాల తోడ్పాటునిచ్చాయి. సిపిఎం ఈ కృషి చేస్తూనే ముఖ్యమంత్రికి వరద బాధితుల కోర్కెలపై వినతిపత్రం సమర్పించింది. స్థానిక ప్రజలు ఆహారం కోసం, ప్రభుత్వ సహాయంకోసం ఆందోళనలు నిర్వహించగా సిపిఎం నేతలు సంఘీభావం తెలిపారు. సేవా కార్యక్రమాలు సాగించారు.

మరోవైపు ప్రభుత్వం చేసింది తక్కువ. ప్రచారం మాత్రం ఎక్కువ. ప్రతిపక్ష వైసిపి విమర్శలతోనే సరిపెట్టింది. తన బాధ్యతను విస్మరించింది. ఈ స్థితిలో సిపిఎం ఉన్న పరిమితుల్లోనే శక్తికి మించిన కృషి సాగించింది. ప్రజల ప్రశంసలు పొందింది. బాధితులే కాదు, రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన అధికారులు, సిబ్బంది అభినందించారు. నగర, జిల్లా ప్రజలు ఆ నోట, ఈ నోటా విని, చూసి ప్రశంసలు కురిపించారు.

రాష్ట్ర ప్రభుత్వం రూ.6880 కోట్ల సహాయం కోరినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నయా పైసా విడుదల చేయలేదు. రాష్ట్రానికి సంబంధించిన బిజెపి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వరదను వదిలిపెట్టి, ఫిర్యాదుల స్వీకరణ పేరుతో హడావిడి చేశారు. విజయవాడ వచ్చారు, వెళ్లారు. కనీసం బాధితులను పరామర్శించలేదు. వరద సహాయం గురించి నోరు విప్పలేదు. పైపెచ్చు బిజెపి నేతలు మోడీ జన్మదినోత్సవ కార్యక్రమాల్లో, సభ్యత్వ నమోదులో మునిగి తేలుతున్నారు. ఇది ప్రజల ఎడల వారికున్న చిత్తశుద్ధి!

మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం 20 రోజులు గడిచినా బాధితులకు ఆర్థిక సహాయం ఇంకా అందించలేదు. కింది అంతస్తులో వారికి రూ.25,000, పైఅంతస్తుల వారికి రూ.10,000 ఇతర ప్యాకేజి ప్రకటించారు. ప్రతి ఇంటికి లక్ష నుండి పది లక్షల రూ" పైగా ఆస్తి నష్టం జరిగింది. వ్యాపారం, పరిశ్రమలకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లింది. ఈ నష్టంతో పోల్చితే ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ చాలా పరిమితం. ముందస్తు హెచ్చరికలు చేయటంలో విఫలమైన ప్రభుత్వం ఈ నష్టాలకు నైతిక బాధ్యత వహించాలి. కేంద్రంపై ఒత్తిడి తేవాలి. నిధులు సాధించాలి. ఇప్పటికే దాతలు, స్వచ్ఛంద సంస్థలు వందలాది కోట్ల రూపాయలు విరాళాలు అందించారు. వరదపై విజయం సాధించేలా చేశామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు. ప్రభుత్వం చాలా చేశామనే భావన వదిలి, ఇంకా చేయాల్సింది చాలా ఉందనే ఆలోచనతో ముందుకు సాగాలి. బాధితులకు అండగా సిపిఎం నిలుస్తున్నది. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతున్నది. బాధితులకు పూర్తి స్థాయి న్యాయం జరిగే వరకూ పోరాడుతున్నది. జరిగిన నష్టం తీవ్రమైంది. జీవిత కాలంలో కోలుకోలేనిది. ఒకవైపున వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు, తక్షణ సహాయం వీటన్నిటి పైన ఉమ్మడిగా కృషి సాగాల్సి ఉంది.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు /


బుడమేరు ముంపునకు గురైన ఆటోలు

వరద దెబ్బకు ఆటోవాలా విలవిల

- ధీమా ఇవ్వని బీమా కంపెనీలు
- ముంపునకు గురైన వాహనాలకు నామమాత్రపు సెటిల్‌మెంట్లు
- సమస్యాత్మకంగా బజాజ్ బిఎస్-6 మోడల్ ఆటోల మరమ్మతులు
- సీరియల్ ప్రకారం రెండు నెలలకు టోకెన్లు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

భారీ వర్షాలు, బుడమేరు వరద ముంపు తర్వాత బెజవాడ ఆటోవాలాలు విలవిల్లాడుతున్నారు. వరద ముంపునకు గురై పాడైన ఆటోలకు కనీస స్థాయిలో బీమా కంపెనీలు క్లెయిములు చెల్లించడం లేదు. దీంతో, మరమ్మతులకు భారీగా అప్పులు చేయాల్సి వస్తోంది. బజాజ్ బిఎస్-6 మోడల్ ఆటోల మరమ్మతులు సమస్యాత్మకంగా మారాయి. వరుస క్రమంలో రెండు నెలల కాలానికి కంపెనీ వారు టోకెన్లు ఇస్తున్నారు. మరోవైపు ముంపు తర్వాత ప్రయాణికుల సంఖ్య తగ్గడంతో అష్టకష్టాలు పడి రోడ్డెక్కించిన ఆటోలకు కిరాయిలు లేక ఆటోవాలాలు అవస్థలు పడుతున్నారు. విజయవాడలోని రైల్వేస్టేషన్ స్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 400 ఆటోలు ఉన్నాయి. వీటిలో 270 ఆటోలు వరదలకు నీటిలో మునిగి దెబ్బతిన్నాయి. ఈ ఆటోవాలాలు టాటా ఎఐజి, లిబర్టీ కంపెనీలకు ప్రీమియం చెల్లించారు. కానీ, ఈ రెండు కంపెనీలు ఇదే తరహాలో నామమాత్రంగానే ఆటోవాలాలకు సెటిల్‌మెంట్ చేస్తున్నాయి.



- విజయవాడలోని పాత రాజరాజేశ్వరరావు పేటకు చెందిన షేక్ అప్సర్ రెండు నెలల క్రితం బజాజ్ మాక్సిమా వాహనం కొన్నారు. రూ.10 వేలకుపైగా బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించారు. వరదలకు వాహనం ముంపునకు గురైంది. సెన్సార్లు కలిగి ఉన్న బిఎస్-6 ఆటోను కంపెనీ స్థాయిలో మరమ్మతులు చేయించాలి. కంపెనీకి తీసుకెళితే టోకెన్ ఇచ్చి విడిభాగాలు అందుబాటులో లేవని, సీరియల్ ప్రకారం మరమ్మతులు చేయడానికి రెండు నెలలు పడుతుందని చెబుతున్నారు. విజయవాడలో సంభవించిన వరదలకు ఈ తరహా బిఎస్-6 వాహనాలు 2,500కుపైగా ముంపునకు గురయ్యాయి. ఈ వాహనాల మరమ్మతులు ఎప్పటికి పూర్తయి రోడ్డెక్కుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.
- వరద బాధితుడు అప్సర్‌కు చెందిన ఆటో మరమ్మతులకు షోరూమ్ వారు రూ.25 వేలకు కొటేషన్ ఇచ్చారు. వాస్తవంగా అయితే కొత్త వాహనానికి పూర్తి స్థాయిలో బీమా రావాల్సి ఉంటుంది. కానీ, బీమా కంపెనీ నిబంధనల ప్రకారం క్లెయిమ్ ఎప్పటికి పరిష్కారం అవుతుందో చెప్పలేమని, అందువల్ల సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఆటోవాలాను కంపెనీ వారు సూచించారు. ఇంజిన్ రిపేరుకు, ఫైబర్ పార్ట్‌లకు క్లెయిమ్ ఉండదని, స్పేర్ పార్టులకు మాత్రమే రూ.9 వేలు ఇస్తామని బీమా కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.
- అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కె.శ్రీనివాసులు 2020 మోడల్ ఆటోకు ఏటా రూ.6,250 చొప్పున నాలుగేళ్లుగా రూ.25 వేలు బీమా ప్రీమియం చెల్లించారు. వరద ముంపునకు గురైన శ్రీనివాసులు ఆటో మరమ్మతులకు రూ.30 వేలు వ్యయం అవుతుందని కంపెనీ కొటేషన్ ఇచ్చింది. బీమా కంపెనీ మాత్రం రూ.7,500కు సెటిల్ చేసింది.



కిరాయిలు లేక అవస్థలు

సింగ్‌నగర్‌కు చెందిన కొండా వెంకటేశ్వర్లు రైల్వేస్టేషన్ స్టాండ్ నుంచి ఆటో నడుపుతారు. భారీ వర్షాలు, వరదలకు ముందు ప్రయాణికులకు రవాణా సేవలు అందించడం ద్వారా రోజువారీ రూ.1300 ఆదాయం వచ్చేది. సిఎన్‌జి గ్యాస్‌కు రూ.300, ఆటో అద్దె రూ.250 చెల్లించగా, కుటుంబ అవసరాలకు రూ.750 మిగిలేవి. కానీ, వరదలు, వర్షాల కారణంగా ఆదాయం తగ్గిపోయింది. ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు రోడ్డుపై వేచి ఉన్నా రోజుకు రూ.250 మాత్రమే రోజువారీ చేతికి మిగులుతోంది. వర్తక, వాణిజ్య కేంద్రంగా ఉన్న విజయవాడ రైల్వేస్టేషన్‌కు రోజువారీ సుమారు లక్ష మంది ప్రయాణికులు వస్తారని అంచనా. వరదల తర్వాత ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. ఇక్కడ స్టాండ్‌లో అత్యధిక ఆటోలు మరమ్మతులకు గురవ్వగా, ఉన్న 130 ఆటోలకు సైతం పూర్తి స్థాయిలో కిరాయిలు ఉండడం లేదని ఆటోవాలాలు వాపోతున్నారు.





జయప్రకాశ్ మృతి పట్ల జగన్ సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ ఎమ్మెల్యే, రాజకీయ విశ్లేషకులు అడుసుమల్లి జయప్రకాశ్ మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అడుసుమిల్లి జయప్రకాశ్ జై ఆంధ్ర ఉద్యమంలో, సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

టిటిడిని దోచుకున్న జగన్

- వర్ల రామయ్య ఆరోపణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో వైసిపి అధినేత వైఎస్ జగన్ అందినంత దోచుకున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో ప్రపంచ వ్యాప్తంగా అందరి వేళ్లు జగన్‌వైపు చూపిస్తున్నాయని అన్నారు. లడ్డూలో వాడే నెయ్యి కల్తీపై సమాధానం చెప్పకుండా చంద్రబాబు పాలనపై విమర్శలు చేయడం అర్థం లేని మాట అని విమర్శించారు. వైసిపి నాయకులు, జగన్.. ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరారు.

జగన్‌కు వాస్తవాలు రుచించవు : ఎంపి శబరి

నెయ్యిలో జంతువుల కొవ్వు వాడారన్న విషయం బయటపడినా జగన్ తీరులో మార్పు రాలేదని టిడిపి ఎంపి బైరెడ్డి శబరి విమర్శించారు. జగన్‌కు వాస్తవాలు రుచించవని శుక్రవారం విడుదల చేసిన వీడియోలో అన్నారు. లడ్డూను కల్తీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విశాఖ పోర్టులో ఎస్‌సి కమిషన్ సభ్యుడు పర్యటన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాక)

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామ్‌చందర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీల్ కుమార్ బాబు, ప్రైవేటు సెక్రటరీ వి.క్రాంతి కుమార్ శుక్రవారం విశాఖపట్నం పోర్టులో పర్యటించారు. పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె వారికి సాదర స్వాగతం పలికారు. కమిషన్ సభ్యుడు రామ్‌చందర్ పోర్టు అధికారులు, ఎస్‌సి ఉద్యోగులు, అధికారుల సంఘం ప్రతినిధులతో కలిసి పరిపాలనా కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. అనంతరం అయన పోర్ట్ ఎస్‌సి ఉద్యోగులు, అధికారుల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పోర్టు మేనేజ్‌మెంట్‌తో రిజర్వేషన్ విధానం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహిం చారు. పోర్టులో ఉన్న మౌలిక సదుపాయాలు, ఎగుమతి, దిగుమతి సౌకర్యాలు, వ్యాపార అవకాశాలు, హరిత చర్యలు, కొనసాగుతున్న ప్రాజెక్టులను అక్కడి అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్‌సి సంక్షేమానికి సిఎస్‌ఆర్ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. పోర్టు సేవలపై రామ్‌చందర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

సమస్యలు పట్టని కేంద్ర సర్కారు

- అరకొర వేతనాలతోనే విధులు
- కష్టాల్లో రైల్వే కాంట్రాక్టు కార్మికులు
- పని భారంతో సతమతం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రైల్వే శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో కనీస వేతనాలను అమలు చేయాల్సిన కేంద్రంలోని బిజెపి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కుటుంబ పోషణ కష్టంగా మారిన పరిస్థితుల్లో కార్మికులు అప్పులపై ఆధారపడి జీవించాల్సిన దుస్థితి నెలకుంది. మరోవైపు రోజులు గడిచే కొద్దీ కార్మికుల సంఖ్యను కుదిస్తుండడంతో వారిపై పనిభారం పెరిగి సతమతమౌతున్నారు.

పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పని

కాకినాడ పోర్ట్ రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పెట్టెలు శుభ్రం చేసే వాళ్ళు, అప్పర్ గేర్ కార్మికులు, ట్రైన్ లైటింగ్ రిపేర్ చేసే కార్మికులు, ఎసి రైలు పెట్టెలో బెడ్స్ మార్పు చేసేవాళ్లు, రన్నింగ్ రూమ్స్‌లో వంట పని చేసేవాళ్లు, రైల్వే బెడ్స్‌పై క్లాత్‌లు ఉతికేవాళ్లు, బయో టాయిలెట్స్ శుభ్రం చేసే వాళ్లు ఇలా వివిధ విభాగాల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా సుమారు 300 మంది, రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారు. రెగ్యులర్ మాదిరిగా 8 నుంచి 10 గంటలు నిరంతరాయంగా విధుల్లో ఉంటున్నారు. కనీస వేతనాలు కూడా అందుకోలేక పెరుగుతున్న ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేద్దామన్నా పుట్టని పరిస్థితుల నడుమ ధీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుతో పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగానే కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను కుధిస్తూ ఉపాధిని దూరం చేస్తుంది. దీంతో ఉన్నవారిపైనే తీవ్ర పని భారం పెరుగుతోంది.

శ్రమ దోపిడీ..

సంవత్సరాల తరబడి పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను కేంద్ర ప్రభుత్వం పర్మనెంట్ చేయడం లేదు. ఏటా కొన్ని కోట్ల రూపాయలు రైల్వే సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టటంలో వీరి పాత్ర కూడా అధికం. అయినా సౌకర్యాలు, వేతనాలు ఎక్కువగా ఇవ్వాలనే కారణంగా వీరి శ్రమను దోచుకుంటున్నారు. కనీసం సాధారణ సెలవులు కూడా అమలు కావడం లేదు. నిరంతరం పని చేయాల్సిందే. ఒకవేళ ఏదైనా అనారోగ్యంతో బాధ పడుతున్నా, తప్పనిసరి పరిస్థితుల్లో పనికి రాకపోయినా కాంట్రాక్టర్ల వేధింపులకు గురి అవుతున్నారు. పబ్లిక్ హాలిడే రోజున డ్యూటీ చేస్తే కనీసం డబల్ జీతం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. రెండేళ్లకు ఒకసారి కాంట్రాక్టర్ మారుతున్నప్పుడల్లా కొత్త కాంట్రాక్టర్ కార్మికుల్లో కొందరిని తగ్గించి కొంతమందినే పనిలోకి పెట్టుకుంటున్నారు. దీంతో ఉన్న వారిపైనే పని భారం ఎక్కువవుతుండగా అనేకమంది ఉపాధిని కోల్పోతున్నారు. గతంలో ట్రైన్ పెట్టెలు శుభ్రం చేసే పనిలో 150 నుంచి 180 మంది ఉండేవారు. ప్రస్తుతం 100 లోపు మాత్రమే పని చేస్తున్నారు. రెగ్యులర్ చేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, అంత వరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కార్మికుల కోరుతున్నారు.

ధరలు పెరుగుతున్నా..

కేంద్రంలోని బిజెపి సర్కార్ అనుసరిస్తున్న విధానాలు కారణంగా రోజురోజుకీ నిత్యవసరాలు వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటు తున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో రవాణా రంగం మీద ఆధారపడిన అన్ని రంగాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. బియ్యం, పప్పులు, నూనెలు, గ్యాస్, ఇతర నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలకు హద్దే లేకుండా పోయింది. ఇంకా పెరుగుతూనే ఉన్నా యి. కానీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు మాత్రం ఎదుగుబొదుగు లేకుండా ఉంటున్నాయి. కాంట్రాక్టర్స్ ఎవరూ కార్మిక చట్టాలను అమలు పరుచుతున్న పరిస్థితి కన్పించడం లేదు. పైగా సకాలంలో వేతన జీవులకు జీతాలు చెల్లించడం లేదు. పెరుగుతున్న ధరలకు అను గుణంగా కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలనే డిమాండ్ అనాధిగా వస్తూనే ఉంది. అయినా అటు పాలకుల్లోనూ, ఇటు కాంట్రాక్టర్లలోనూ ఏమాత్రం మార్పు కన్పించడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగు ణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ప్రతీనెలా పే సిప్పులు ఇవ్వాలని చట్టంలో ఉన్నా ఎవరికి ఇవ్వడం లేదు. పే సిప్పులు ఇవ్వకపోవడంతో సెలవులు ఎన్ని, బేసిక్, డిఎ ఎంత అనే వివరాలు తెలియడం లేదు. పిఎఫ్ సొమ్ము ఎం త కటింగ్ అవుతున్నదనే సమాచారం తెలియకుండా కాంట్రాక్టర్లు గో ప్యంగా ఉంచుతున్నారు. చట్టం ప్రకారం పిఎఫ్ సొమ్ము ఎప్పటికప్పుడు ఖాతాలలో జమ చేయాల్సివున్నా కార్మికులకు తెలియనివ్వడం లేదు.

ఆదిమూలం కేసులో కీలక మలుపు

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఎమ్మెల్యే ఆదిమూలంపై ఆ పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు ఎ వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన అత్యాచార కేసు కీలక మలుపు తిరిగింది. ఆదిమూలంపై తానిచ్చిన ఫిర్యాదులోని అంశాలన్నీ అసత్యాలని వరలక్ష్మి స్వయంగా హైకోర్టుకు నివేదించారు. ఇది తప్పుడు కేసని, దానిని కొట్టేయాలని కోరారు. ఆ మేర ఆమె నోటరీ చేసిన అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. వాటిని శుక్రవారం పరిశీలించిన హైకోర్టు ఈ నెల 25న తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదిమూలం తనపై అత్యాచారం చేశారంటూ వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని ఆదిమూలం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పుడు ఫిర్యాదుదారు హైకోర్టులో స్వయంగా హాజరై పై విధంగా చెప్పారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది చిత్తరవు రఘు వాదనలు వినిపిస్తూ, అత్యాచారం కేసును మహిళా పోలీసు అధికారి నమోదు చేయాలన్న నిబంధన అమలు చేయలేదన్నారు. వరలక్ష్మి తరపున న్యాయవాది జితేంద్ర స్పందిస్తూ, పిటిషనర్‌పై ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలు అవాస్తవాలని తెలిపారు. దీంతో న్యాయమూర్తి కోర్టులో ఉన్న ఫిర్యాదుదారు వరలక్ష్మితో మాట్లాడారు. ఫిర్యాదులోని అంశాలు అవాస్తవాలని ఆమె చెప్పారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తరపున న్యాయవాది కల్పించుకుని తదుపరి విచారణ వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి సమ్మతిస్తూ ఆ మేర పోలీసులకు ఆదేశాలిచ్చారు.

ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించిన కాంతిరాణా

ప్రజాశక్తి-అమరావతి

సినీ నటి కాదంబరి జత్వానీ ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ఐపిఎస్ అధికారి కాంతిరాణా టాటా హైకోర్టును ఆశ్రయించారు. ఎఫ్ఐఆర్‌లో నిందితుల స్థానంలో విద్యాసాగర్, ఇతరులను పేర్కొన్నారని, ఆ ఇతరుల కింద పోలీసులు తనను అరెస్టు చేయాలని చూస్తున్నారని పిటిషన్‌లో వివరించారు. తప్పుడు ఫిర్యాదు ఆధారంగా పెట్టిన కేసులో తనను అక్రమంగా ఇరికించే అవకాశం ఉందని, వెంటనే జోక్యం చేసుకుని ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ చేయనుంది.

గీతం దూరవిద్య కోర్సుల్లో అడ్మిషన్లు

ప్రజాశక్తి- మధురవాడ

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సిడిఒఇ) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో ఎంఎ ఇంగ్లీష్, బిఎ, బికామ్ డిగ్రీ కోర్సులలో 2024 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు సిడిఒఇ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస్ తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో సూచనల మేరకు ప్రవేశ దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు తెలిపారు.

పూర్తి చేసిన ధరఖాస్తులను నవంబర్ 15వ తేదీలోగా అందజేయాలని, పూర్తి సమాచారం కోసం దొండపర్తిలోని గీతం సిటీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం cdl.gitam.edu వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

సమాజహితం కోసం కృషి చేయాలి

- జెఎన్‌టియు విసి ఒఎస్‌డి ఎన్.దేవన్న

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజినీరింగ్ కళా శాలలు విద్యాబోధనతోపాటు సమాజ హితం కోసం కృషి చేయాలని జెఎన్‌టియు ఉపకులపతి ఒఎస్‌డి ఎన్.దేవన్న పిలుపు నిచ్చారు. అనంతపురంలోని జెఎన్‌టియు పరిపాలన భవనంలోని ఆర్య భట్టా ఆడిటోరియంలో భారత ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నస్ ఫేజ్-3 ప్రాజెక్టు, సెంటర్ పర్ డెవలప్ మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్ సహకారంతో 'సైబర్ అవేర్నెస్ డిజిటల్ నాగ్రిక్' అనే అంశంపై సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కళాశాలల అధ్యాపకులు అవగాహన సదస్సుపై అవగాహన చేసుకుని వారి కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.



'మ్యాడ్ స్క్వేర్' ఫస్ట్ సాంగ్ విడుదల

'సితార ఎంటర్‌టైన్‌మెంట్స్' సంస్థ గతేడాది విడుదలై విజయవంతమైన 'మ్యాడ్'కి కొనసాగింపుగా.. 'మ్యాడ్ స్క్వేర్'ను రూపొందిస్తోంది. మ్యాడ్‌లో నటించిన నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ఈ సినిమాలోనూ హీరోలుగా చేస్తున్నారు. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ సంస్థలతో కలిసి సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మ్యాడ్ స్క్వేర్ నుంచి ఇటీవల ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసిన చిత్ర యూనిట్.. తాజాగా తొలి గీతాన్ని రిలీజ్ చేసింది. 'మా లడ్డు గాని పెళ్లి.. జగ చూస్తో లొల్లి లొల్లి' అంటూ సాగే లిరికల్ సాంగ్ విడుదల అయింది. ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా మంగ్లీ ఆలపించారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

'థగ్ లైఫ్' పూర్తి చేశారు

కమల్‌హాసన్ నటిస్తున్న తాజా చిత్రం 'థగ్ లైఫ్'. మణిరత్నం డైరెక్షన్‌లో 'కెహెచ్ 234' ప్రాజెక్టుగా వస్తోన్న ఈ చిత్రంలో ఐశ్వర్యలక్ష్మి, త్రిష, ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. శింబు కీలక పాత్ర చేస్తున్నారు. గౌతమ్ కార్తీక్, జోజు జార్జ్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా శుక్రవారంతో థగ్ లైఫ్ షూటింగ్ పూర్తయింది. ఈ మూవీ డిజిటల్ రైట్స్ రూ.149.7 కోట్లకు అమ్ముడుపోయాయి. ఈ మొత్తం కోలీవుడ్ సినీ చరిత్రలోనే అత్యధికం కావడం విశేషం. ఈ చిత్రాన్ని 2025 వేసవి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మూవీకి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని కమల్ హాసన్-ఉదయనిధి స్టాలిన్ సమర్పణలో రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్, రెడ్ జెయింట్ మూవీస్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై కమల్ హాసన్-ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.

హిట్ కొట్టాకే..

ప్రస్తుతం యు వి ప్రొడక్షన్స్ బ్యానర్‌లో అనిల్ అనే కొత్త దర్శకుడు దర్శకత్వంలో అఖిల్ సినిమా చేస్తున్నాడు. తాజాగా అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా నాగార్జున సహా కుటుంబ సభ్యులందరూ ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. అలా ఒక కార్యక్రమంలో అందరూ అఖిల్ గురించి ప్రశ్నిస్తున్న సమయంలో 'హిట్ కొడితే తప్ప అభిమానుల ముందుకు రానని అఖిల్ అన్నాడం'టూ నాగార్జున మాట్లాడారు.

'మాల్స్'లో వెట్టిచాకిరి..!

- రోజుకు పది నుంచి 12 గంటలు పని
- వేతనం నెలకు రూ.పది వేలలోపే
- ఉదయం నుంచి నిల్చొని ఉండాల్సిందే
- ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం
- కొరవడిన అధికారుల తనిఖీలు.. ఇష్టానుసారంగా యాజమాన్యాలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని అన్ని పట్టణాల్లో షాపింగ్‌మాల్స్‌తోపాటు మాల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గడిచిన రెండు, మూడేళ్లలో ఏలూరులో అతిపెద్ద కార్పొరేట్ షాపింగ్‌మాల్స్, మార్ట్‌లు అనేకం ప్రారంభమయ్యాయి. మాల్స్‌లో పని చేసేందుకు స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున మహిళలు, యువకులు పని చేసేందుకు వస్తున్నారు. అత్యధికంగా మహిళలు ఉంటున్నారు. ప్రతి షాపింగ్‌మాల్, మార్ట్‌ల్లోనూ వందల సంఖ్యలో ఉద్యోగులు పని చేస్తున్నారు. మాల్స్‌లో ఎక్కడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. మాల్స్ యాజమాన్యాలు పాటిస్తున్నదే చట్టం.. వారు అవలంభిస్తున్న నిబంధనలే శిరోధార్యం అన్నట్లు పరిస్థితి తయారైంది. అధికారుల తనిఖీలు పూర్తిగా కొరవడటంతో మాల్స్‌లో పని చేసే ఉద్యోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. సరైన ఉపాధి లేకపోవడంతో అనేక మంది యువత మాల్స్‌లో పని చేసేందుకు వస్తున్నారు. దీన్ని అదునుగా తీసుకుని మాల్స్ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా పని గంటల విషయంలో నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతున్న పరిస్థితి ఉంది. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులతో రోజుకు పది నుంచి 12 గంటలు పని చేయిస్తున్నారు. ఉదయం పది గంటలకు పని ప్రారంభిస్తే రాత్రి పది గంటల వరకూ ఉంచుతున్నారు. ఉద్యోగులకు వేతనాలు సైతం అత్యంత దారుణంగా ఇస్తున్నారు. రూ.ఏడు వేల నుంచి రూ.పది వేలలోపు జీతం తీసుకునే ఉద్యోగులే అధికంగా ఉంటున్నారు. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులకు కార్మికచట్టాల నిబంధనలను అమలు చేయాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. జిల్లా కేంద్రం ఏలూరులో పరిస్థితి మరింత దారుణంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చట్టాల్లోని నిబంధనలు పట్టవా..!

కార్మిక చట్టాల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు మాత్రమే పని చేయించాలి. అంతకుమించి ఎక్కువ పని గంటలు చేస్తే ఓటీ కింద రెట్టింపు వేతనం చెల్లించాలి. ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. ప్రతి ఉద్యోగిని చేర్చుకునేటప్పుడు అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలి. కనీస వేతనం చెల్లించాలి. పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలి. వెల్ఫేర్ ఫండ్ కట్టాలి. ప్రతియేటా బోనస్ చెల్లించాలి. వీటన్నిటితోపాటు ఉద్యోగులకు గ్రాట్యుటీ ఇవ్వాలి. పురుష, మహిళా ఉద్యోగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. మహిళలకు ప్రసూతి సెలవులు అమలు చేయాలి. క్యాజువల్ లీవులు ఇవ్వాలి. మధ్యాహ్న భోజనం చేసేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించాలి. మాల్స్‌లో ఎక్కడా ఈ నిబంధనలు అమలు కావడం లేదు. కొన్ని మాల్స్ యాజమాన్యాలు పిఎఫ్, ఇఎస్ఐ వంటివి పది, ఇరవై మంది ఉద్యోగులకు అమలు చేసి వాటినే రికార్డుల్లో చూపిస్తున్నాయి. ఆదివారం, పండుగ దినాల్లోనూ పని చేయిస్తున్నా అదనంగా ఎటువంటి వేతనమూ ఇవ్వడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిలువకాళ్లపై నిలబడి పని చేస్తుండటంతో మోకాళ్ల నొప్పులతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు మాల్స్‌లో పని చేసే ఉద్యోగులను వెంటాడుతున్నాయి. కుటుంబ సభ్యులతో గడిపే సమయం లేకుండాపోతోంది. ఉద్యోగులు ఎవరైనా ప్రశ్నిస్తే తొలగించడంగాని, వారి నుంచి తీసుకున్న సర్టిఫికెట్లు ఇవ్వకుండా నానా ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. పెద్దఎత్తున లాభాలు కూడగట్టుకుంటున్న మాల్స్ యాజమాన్యాలు అక్కడ పని చేసే ఉద్యోగులను మాత్రం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అధికారుల తనిఖీలు లేకపోవడంతో మాల్స్‌లో నిబంధనలు అమలుకాని పరిస్థితి నెలకొంది. మాల్స్‌లో సిసి కెమెరాలు ఉంటాయి. ఉద్యోగులు ఎన్ని గంటలకు వస్తున్నారు.. ఎన్ని గంటలకు వెళ్తున్నారో పక్కాగా తెలుస్తోంది. అయినప్పటికీ ఏఒక్కరూ పట్టించుకోని పరిస్థితి ఉంది. మాల్స్‌లో పని చేసే ఉద్యోగులు రోజురోజుకీ పెరుగుతుండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన పరిస్థితి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేకపోతే శ్రమ దోపిడీ మరింత పెరిగే పరిస్థితి ఉంది.

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

ప్రజాశక్తి - వల్లూరు (వైఎస్ఆర్ జిల్లా): గుండెపోటుతో ఉపాధి కార్మికుడు మృతి చెందిన సంఘటన వైఎస్ఆర్ జిల్లా వల్లూరు మండలం పెద్దపుత్త గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పెద్దపుత్త గ్రామానికి చెందిన పెద్ద గంగులయ్య (68) గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఉపాధి పనులు చేస్తూండగా ఒక్కసారిగా కుప్పకూలి మరణించారు. ఎంపిడిఒ జయశ్రీ, ఎపిఒ సుధారాణి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చేపల లోడు కంటైనర్ బోల్తా

పదిమందికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

ఎదురుగా వెళ్తున్న మినీ వాహనాన్ని చేపల లోడు కంటైనర్ వెనుక నుంచి ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లతోపాటు మరో ఎనిమిది మంది కూలీలు గాయాలపాలయ్యారు. ఈ ఘటన ఏలూరు జిల్లా ఉంగుటూరులోని నారాయణపురం - ఉంగుటూరు జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భీమడోలు మండలం ఆగడాలలంక చెరువులో చేపలను జితేంద్ర అనే వ్యాపారి కొనుగోలు చేశాడు. శుక్రవారం ఉదయం పట్టుబడి పట్టి అక్కడే కూలింగ్ చేశారు. అనంతరం ఉంగుటూరు బాలాజీ ఐస్ ఫ్యాక్టరీకి ప్యాకింగ్ నిమిత్తం సుమారు 150 ట్రేల్లో కంటైనర్ వాహనం బయలు దేరింది. ఈ క్రమంలో ఉంగుటూరు ప్రసాద్ థియేటర్ దాటాక ఎదురుగా వెళ్తున్న మినీ వాహనాన్ని చేపల లోడు కంటైనర్ వెనుక నుంచి ఢీకొని వేగ నియంత్రణ కోల్పోవడంతో కంటైనర్ రోడ్డుకు అడ్డంగా, మినీ వ్యాన్ రోడ్డు డివైడర్ మధ్యలో బోల్తా పడ్డాయి. ఆ సమయంలో కంటైనర్‌లో ట్రేల మధ్యలో ఇద్దరు జట్టు కూలీలు, క్యాబిన్‌లో డ్రైవర్, మరో ఏడుగురు కూలీలున్నారు. వాహనం రోడ్డుకు అడ్డంగా బోల్తా పడడంతో కంటైనర్‌లో చేపల ట్రేల వద్ద కూర్చున్న ఇద్దరు కూలీలతో చేపలు ట్రేలు పడిపోయాయి. ఆ ఇద్దరు కూలీలకు వెంటనే హైవే అంబులెన్సులో ఆక్సిజన్ ఎక్కించడంతో స్పృహలోకి వచ్చారు. క్యాబిన్‌లో ఉన్న మిగతా వారిని, మినీ వ్యాన్ డ్రైవర్‌ను అంబులెన్సులో తాడేపల్లిగూడెంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారంతా ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ కొత్తగూడేనికి చెందిన జట్టు కూలీలుగా పోలీసులు తెలిపారు.

ప్రతి హామీ నెరవేరుస్తా: మంత్రి నారా లోకేశ్

- బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, బంగారుపాళ్యం



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్

యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. యువగళం 100 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా ఇచ్చిన తొలి హామీ మేరకు గ్రామస్తుల ఆనందోత్సాహాల మధ్య బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లలో చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. గత ఏడాది జనవరి 27న కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత నుంచి తాను ప్రారంభించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిందన్నారు. 11ఉమ్మడి జిల్లాలు, 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 2200 గ్రామాలను స్పృశిస్తూ 3132 కి.మీ.ల మేర యువగళం పాదయాత్ర సాగిందని గుర్తు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో మరెవరూ చేయనివిధంగా 14 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ 45రోజులపాటు 577 కి.మీ.ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించిందన్నారు. యువగళం పాదయాత్ర 8వ రోజు 2023, ఫిబ్రవరి 3న బంగారుపాళ్యంలో వంద కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తొలి మైలురాయిని ఆవిష్కరించానన్నారు. డయాలసిస్ కేంద్రం అవసరమని స్థానికులు చెప్పిన మేరకు ఇపుడు నెరవేర్చానన్నారు.

బంగారుపాళ్యం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని, తరచూ డయాల సిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లడానికి డబ్బు, సమయం అవుతుందన్నారు. ప్రస్తుతం తమ ఊళ్లోనే ఉచితంగా డయాలసిస్ చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు. బంగారుపాళ్యంలో కొత్తగా నిర్మించిన 30 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తూ టిడిపి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పూతలపట్టు ఎంఎల్ఎ మురళీమోహన్, చంద్రగిరి ఎంఎల్ఎ పులివర్తి నాని పాల్గొన్నారు.

హెడ్ భారీ శతకం

- తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై 7వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా గెలుపు



హెడ్(154నాటౌట్)

ట్రెంట్‌బ్రిడ్జ్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. ఇంగ్లండ్ నిర్దేశించిన 316పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 3వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు 49.4ఓవర్లలో 315పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. డక్కెట్(95), జాక్స్(62), కెప్టెన్ బ్రూక్(39), బేథెల్(35) బ్యాటింగ్‌లో రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లు జంపా, లబూషేన్‌కు మూడేసి, హెడ్‌కు రెండు, డ్వారిష్, షార్ట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా ఓపెనర్ హెడ్(154నాటౌట్; 129బంతుల్లో 20ఫోర్లు, 5సిక్సర్లు) భారీ సెంచరీకి తోడు, లబూషేన్(77నాటౌట్; 61బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) మ్యాచ్‌ను ముగించారు. కెప్టెన్ మార్ష్(10), స్మిత్(32), గ్రీన్(32) స్వల్పస్కోర్లకే పరిమితమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లు లివింగ్‌స్టోన్, బేథెల్, పాట్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యతలో నిలువగా.. రెండో వన్డే నేడు(శనివారం) జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హెడ్‌కు లభించింది.

ఆదుకున్న కరుణరత్నే, ఛండీమాల్

శ్రీలంకకు 202 పరుగుల ఆధిక్యత

గాలే: న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలిటెస్ట్‌లో శ్రీలంక జట్టుకు ఆధిక్యత లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 305పరుగులు చేయగా.. న్యూజిలాండ్ జట్టు 340 పరుగులు చేసింది. అనంతరం మూడోరోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 4వికెట్ల నష్టానికి 237పరుగులు చేసింది. దీంతో ఆ జట్టుకు ఇప్పటికే 202 పరుగుల ఆధిక్యత లభించింది. శ్రీలంక జట్టులో కరుణరత్నే(83), ఛండీమాల్(61) అర్ధసెంచరీలకి తోడు మాథ్యూస్(34), కెప్టెన్ ధనుంజయ(34) క్రీజ్‌లో ఉన్నారు. న్యూజిలాండ్ బౌలర్ ఓరోర్కేకు మూడు, అజాజ్ పటేల్‌కు ఒక వికెట్ దక్కాయి.

'ఉగ్రవాద' జాబితా నుంచి క్యూబాను తొలగించండి

- 600మంది ఎంపీల లేఖ
- అమెరికా దాష్టీకానికి ఖండన

న్యూఢిల్లీ : తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందంటూ క్యూబాను ఉగ్రవాద స్పాన్సర్ దేశంగా అమెరికా ముద్ర వేసి తీవ్రమైన ఆంక్షలు కొనసాగించడాన్ని ఖండిస్తూ 73 దేశాలకు చెందిన 600మంది పార్లమెంట్ సభ్యులు ఒక లేఖ రాశారు. అమెరికా చర్యను 'క్రూరమైన, మానసిక దౌర్బల్యంతో కూడినది, అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించేదిగా ఉందని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ ఈ లేఖను ప్రచురించింది. క్యూబాపై ఇటువంటి ముద్రను తొలగించేందుకు అవసరమైన చర్యలను వెంటనే తీసుకోవాలని కోరుతూ ఎంపీలు తమ తమ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఇలా ముద్ర వేయడం చాలా క్రూరమైన చర్య అని దీనివల్ల క్యూబా ప్రజల కష్టాలు, ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని వారు ఆ లేఖలో పేర్కొన్నారు. క్యూబా ఆర్థిక వ్యవస్థ నలిగిపోతోందని, మానవతా సాయంపై కూడా ఆంక్షలు అమలవుతున్నాయని తెలిపారు. దేశాల సార్వభౌమాధికారం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగు దేశాలను దుష్ట రాజ్యాలుగా అమెరికా ముద్ర వేసింది. వీటిలో క్యూబా, ఉత్తర కొరియా, ఇరాన్, సిరియా వున్నాయి. 2015లో ఒబామా క్యూబాపై ఆ ముద్రను తొలగించగా, ఆ తరువాత వచ్చిన ట్రంప్ క్యూబాను మళ్లీ ఆ జాబితాలో చేర్చారు. ప్రస్తుత బైడెన్ ప్రభుత్వం ఆ ఆంక్షలను కొనసాగిస్తోంది. కనీసమైన మానవ హక్కులనైనా అమెరికా గుర్తించాలని వారు కోరారు. జెరిమి కార్బైన్, అయాన్ బెలారా, పీటర్ మెర్టెన్స్ వంటి ప్రముఖులు ఈ లేఖపై సంతకాలు చేశారు.

కొలీజియం సిఫార్సుల పెండింగ్‌పై వారంలోగా వివరాలివ్వండి

- కేంద్రానికి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు కొలీజియం అనేది న్యాయమూర్తులకు సంబంధించి సెర్చ్ కమిటీ కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి కొలీజియం సిఫార్సు చేసిన వ్యక్తులను నియమించే విషయంలో నెలలు, ఏళ్ల తరబడి జాప్యం చేయడం వెనుక గల కారణాలు ఏమిటో చెప్పాలని కేంద్రాన్ని శుక్రవారం కోరింది. కొలీజియం చేసిన సిఫార్సులను నిర్లక్ష్యం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కొలీజియం సూచించి, పెండింగ్‌లో వున్న ప్రతి పేరుకు సంబంధించి అన్ని వివరాలతో వారంలోగా ఒక నివేదికను అందజేయాల్సిందిగా అటార్నీ జనరల్ వెంకటరమణిని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఆ నియామకాలు ఎందుకు ఇంకా పెండింగ్‌లో వున్నాయి, ఏ స్థాయిలో ఆవి ఎందుకు ఆగిపోయాయో చెప్పాలని కోరింది. పాలనా కార్యక్రమాలు సజావుగా ముందుకు సాగేలా చూసేందుకే ఈ చర్య తీసుకున్నట్లు చంద్రచూడ్ చెప్పారు.

ఆక్రమిత ప్రాంతాలనుండి వైదొలగండి

ఐరాస జనరల్ అసెంబ్లీ డిమాండ్

న్యూయార్క్: పాలస్తీనా భూభాగాల్లో అక్రమ ఆక్రమణలకు స్వస్తి చెప్పి 12 మాసాల్లోగా వారి భూభాగాల నుండి ఇజ్రాయిల్ వైదొలగాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. తీర్మానానికి అనుకూలంగా 124 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 14ఓట్లువచ్చాయి. 43మంది గైర్హాజరయ్యారు. ఈ తీర్మానం ఆమోదించడాన్ని చారిత్రకమైనదిగా పాలస్తీనా ప్రతినిధివర్గం ప్రశంసించింది. ఈ ఏడాది కొత్తగా వచ్చిన హక్కుల కింద పాలస్తీనా ఈ తీర్మానాన్ని మొదటగా ప్రవేశపెట్టింది. తన ప్రవర్తనను మార్చుకునేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు అంతర్జాతీయ సమాజాన్ని, చారిత్రక ఐసిజె రూలింగ్‌ను ఉపయోగించుకోవడమే ఈ తీర్మానం వెనుకగల ఉద్దేశమని పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ వ్యాఖ్యానించారు. ఈ చర్యను స్వాగతిస్తున్నామని హమాస్ పేర్కొంది. పాలస్తీనా ప్రజల పోరాటాలకు అంతర్జాతీయ సమాజం సంఘీభావాన్ని ఇది తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది.

బెంగాల్‌కు తక్షణమే వరద సాయం చేయండి

- ప్రధానికి మమత లేఖ
- డివిసి నుంచి తప్పుకుంటామని హెచ్చరిక

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌కు తక్షణమే వరద సాయం విడుదల చేయాలని కేంద్రాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మమత లేఖ రాశారు. వరదల కారణంగా రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది ప్రభావితమయ్యారని, వరదల నష్టాలను ఎదుర్కొనడానికి కేంద్ర నిధులను వెంటనే విడుదల చేయాలని మోడీకి రాసిన నాలుగు పేజీల లేఖలో మమత కోరారు. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డివిసి) ఏకపక్షంగా, ప్రణాళికారహితంగా మైదాన్, పంచేట్ డ్యాముల నుంచి భారీ పరిమాణంలో నీటిని విడుదల చేయడంతో దక్షిణ బెంగాల్‌లోని అన్ని జిల్లాలు వరదల్లో మునిగిపోయాయని, దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మమతా తెలిపారు. ఈ ఏకపక్ష విధానం కొనసాగితే, డివిసి నుండి పూర్తిగా వైదొలగడం మినహా పశ్చిమ బెంగాల్‌కు వేరే మార్గం లేదని పేర్కొన్నారు. దిగువ దామోదర్, పరిసర ప్రాంతాలు 2009 తరువాత భారీ వరదలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. డివిసి కేంద్ర ప్రభుత్వ సంస్థ. ఇది పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లోని ప్రాజెక్టులను పర్యవేక్షిస్తోంది.

అదానీపై స్విస్ సీరియస్ విచారణ..!

- మెగా మనీలాండరింగ్‌పై దృష్టి
- మోసం చేస్తే ఐదేళ్ల వరకు శిక్ష



న్యూఢిల్లీ : స్విస్ బ్యాంక్ అకౌంట్లలో అదానీ మెగా మనీలాండరింగ్ సొమ్ముపై అక్కడి ప్రభుత్వ రెగ్యులేటరీ సంస్థలు సీరియస్‌గా విచారణ జరుపుతున్నాయని సమాచారం. ఈ కేసుపై స్విస్ అటార్నీ జనరల్ కార్యాలయం (ఒఎజి) దృష్టి సారించిందని ది వైర్ ఓ కథనంలో తెలిపింది. స్విస్ బ్యాంక్ అకౌంట్లలో అదానీకి ఉన్న 31 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2600 కోట్లు) సొమ్మును అక్కడి ప్రభుత్వ అధికారులు సీజ్ చేశారని సెప్టెంబర్ 12న అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ గ్రూపు మనీలాండరింగ్‌కు పాల్పడిందని తెలిపింది. కాగా.. భారత్‌కు చెందిన ఒక గ్రూపు మెగా మనీలాండరింగ్‌కు సంబంధించి విచారణ జరుగుతుందని.. దీనిపై స్విస్ అటార్నీ జనరల్ పలువురిని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆ సంస్థ పేరును ప్రత్యేకంగా వెల్లడించలేదు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ప్రకారం అది అదానీ గ్రూపునకు సంబంధించినదని సమాచారం. ఈ కేసులో విచారించిన లేదా పాల్గొన్న, పాల్గొనని వారి పేర్లను వెల్లడించడానికి ఒఎజి ఆసక్తి చూపలేదు. 2023 జులై 20 నాడు ఫెడరల్ క్రిమినల్‌కోర్టు (ఎఫ్‌సిసి) నిర్ణయం ప్రకారం.. అటార్నీ జనరల్ ఆఫ్ స్విట్జర్లాంట్ జెనీవా నుంచి క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ప్రారంభించింది. ప్రస్తుతం పత్రాల ఫోర్జరీ (ఆర్ట్.305బిఐఎస్ పేరస్.1అండ్2 ఎస్‌సిసి). తీవ్రమైన మనీలాండరింగ్ (ఆర్ట్. 305బిస్ పేరస్ 1,2 ఎస్‌సిసి)పై పరిశోధనలు కొనసాగుతున్నాయి. విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఇంతకు మించిన సమాచారాన్ని వెల్లడించలేమని ఆ వర్గాలు పేర్కొన్నాయి. స్విస్ క్రిమినల్ కోడ్ ఆర్టికల్ 251 ప్రకారం.. "తప్పుడు లేదా తప్పుడు పత్రాలతో మోసగించడానికి ఉపయోగించినట్లయితే.. ఐదేళ్ల వరకు శిక్ష, జరిమానా విధించబడుతుంది." ఆర్టికల్ 305బిఐఎస్ 1.11 ప్రకారం ఉద్దేశ్యపూర్వకంగా మోసానికి పాల్పడితే వారి ఆస్తులను జప్తు చేయడం లేదా మూడు సంవత్సరాల వరకు శిక్ష పడనుంది." అని స్విస్ చట్టాలు చెబుతున్నాయి. మనీలాండరింగ్‌కు పాల్పడిన యజమాని, వ్యక్తి లేదా సంస్థను బయటికి తీసుకురావాలని విచారణ సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయని సమాచారం. బివిఐ, మారిషస్, బెర్ముడాల్లో అదానీ స్టాక్స్‌కు చెందిన నిధులను పెట్టుబడిగా పెట్టి మనీలాండరింగ్‌కు పాల్పడిందని ఇటీవల హిండెన్‌బర్గ్ ప్రధానంగా ఆరోపించింది. దీంతో స్విస్ మీడియాలో అదానీ గ్రూప్ చాలా చర్చనీయాంశమైంది. బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్, మారిషస్, బెర్ముడాలో వివాదాస్పద నిధులలో అదానీ అనుబంధ సంస్థ ఫ్రంట్‌మాన్ ఎలా పెట్టుబడి పెట్టింది అనే దానిపై ప్రాసిక్యూటర్లు సమాచారాన్ని అందించారని హిండెన్‌బర్గ్ వెల్లడించింది. ఈ సమాచారాన్ని స్విస్ క్రిమినల్ కోర్టు రికార్డుల నుండి పొందినట్లు పేర్కొంది. 2021 నాటికే అదానీపై మనీలాండరింగ్, సెక్యూరిటీల ఫోర్జరీ విచారణలో భాగంగా స్విస్ అధికారులు బహుళ స్విస్‌బ్యాంక్ ఖాతాలలో ఈ సొమ్మును స్తంభింపజేసినట్లు వెల్లడించింది. అదానీ గ్రూప్‌నకు సంబంధించిన ఈ మనీలాండరింగ్ కేసు చాలా తీవ్రమైందని హిండెన్‌బర్గ్ తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే.



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

కొల్‌కతాలో వైద్యుల భారీ ర్యాలీ

కొల్‌కతా: శనివారం నుంచి అత్యవసర సేవలకు హాజరవుతామని ప్రకటించిన కొల్‌కతా వైద్యులు శుక్రవారం భారీ ఆందోళన నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్ (డబ్ల్యూబిజెడిఎఫ్) ఆధ్వర్యాన రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయం (స్వాస్థ్య భవన్) నుండి సిజిఒ కాంప్లెక్స్‌లోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కార్యాలయం వరకు సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. హిలాండ్ పార్క్ ప్రాంతం నుండి ఉత్తర కొల్‌కతాలోని శ్యాంబజార్ వరకు రిలే టార్చ్ ర్యాలీ జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఈ ర్యాలీ పాల్గొన్న జూనియర్ డాక్టర్ అనికేత్ మహతో మీడియాతో మాట్లాడుతూ 'సమ్మెను ముగించడాన్ని మా బలహీనతగా రాష్ట్ర ప్రభుత్వం చూడకూడదు' అని పేర్కొన్నారు.

సామాన్య ప్రజలు, ఆరోగ్య కార్యకర్తల నుంచి తమకు లభించిన మద్దతు ఇంక నుంచి కూడా కొనసాగుతుందని డబ్ల్యూబిజెడిఎఫ్ ఆశిస్తుందని అన్నారు. మరో వైద్యులు దేబాసిస్ హల్దర్ మాట్లాడుతూ వైద్య కళాశాలల్లో తమ ఆందోళన కొనసాగుతుందని చెప్పారు.

40 మంది వైద్య విద్యార్థులపై వేటు


పశ్చిమ బెంగాల్ నడియా జిల్లా కళ్యాణి వద్ద ఉన్న జెఎన్ఎం ఆసుపత్రి, వైద్య కళాశాలకు చెందిన 40 మంది వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లను ఆరునెలల పాటు అధికారులు నిషేధించారు. ఇతర విద్యార్థులను, డాక్టర్లను బెదిరించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. గురువారం జరిగిన కళాశాల కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిషేధం విధించిన 40 మంది విద్యార్థులను ఆరు నెలల పాటు కాలేజీలోకి అనుమతించరు. పరీక్షలకు హాజరుకావడాన్ని అనుమతిస్తారు.

సవరించిన ఐటి నిబంధనలు రాజ్యాంగ విరుద్ధం ! : బాంబే హైకోర్టు

ముంబయి : సోషల్ మీడియా గొంతునొక్కేందుకు కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఐటి నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమంటూ బాంబే హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే బూటకపు, తప్పుడు సమాచారాన్ని గుర్తించడం కోసమే వీటిని తెచ్చామన్న ప్రభుత్వ వాదనను కోర్టు తోసిపుచ్చింది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం (ఐటి) నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై జనవరిలో డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు చీలిపోవడంతో 'టై బ్రేకర్ జడ్జి'గా పేరొందిన జస్టిస్ ఎఎస్ చందూర్కర్‌కు ఈ అంశాన్ని నివేదించారు. దానిపై విచారించిన జస్టిస్ చందూర్కర్ రాజ్యాంగ నిబంధనలను ఈ ఐటి రూల్స్ ఉల్లంఘిస్తున్నాయని శుక్రవారం తీర్పు చెప్పారు. "ఈ విషయాన్ని విస్తృతంగా పరిశీలించాను. ఈ నిబంధనలు రాజ్యాంగంలోని 14వ అధికరణ (సమానత్వం హక్కు), 19వ అధికరణ (భావ ప్రకటనా స్వేచ్ఛ), 19(1)(జి) (స్వేచ్ఛ, వృత్తి హక్కు)లను తీవ్రంగా ఉల్లంఘిస్తున్నాయి." అని ఆయన పేర్కొన్నారు. 'నిబంధనల్లోని "బూటకం, తప్పు, తప్పుదారి పట్టించే" వ్యక్తీకరణ అనేది అస్పష్టంగా వుంది. స్పష్టమైన నిర్వచనం లేనందున ఇది చెల్లదు' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. కొత్త ఐటి నిబంధనలను సవాల్ చేస్తూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా ప్రభృతులు వేసిన పిటిషన్లను హైకోర్టు విచారణకు స్వీకరించిన నేపథ్యంలో ఈ రూలింగ్ వెలువడింది. ప్రభుత్వం గురించి వచ్చిన సమాచారం బూటకమా లేక అబద్ధమా అనేది గుర్తించేందుకు నిజ నిర్ధారణ బృందాన్ని (ఎఫ్‌సియు) ఏర్పాటు చేయడం కూడా ఆ నిబంధనల్లో ఒకటిగా వుంది. ఈ అంశంపై జనవరిలో విచారించిన ఇద్దరు సభ్యుల డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు చీలిపోవడంతో దీన్ని జస్టిస్ చందూర్కర్‌కు నివేదించాల్సి వచ్చింది. భావ ప్రకటనా స్వేచ్ఛపై ఎలాటి ప్రభావం పడదని పేర్కొంటూ జస్టిస్ గోఖలే ఈ నిబంధనలను సమర్ధించగా, జస్టిస్ పటేల్ వీటిని కొట్టిపారేశారు. ఈ నిబంధనలు సెన్సార్‌షిప్‌కు సంబంధించినవని వ్యాఖ్యానించారు. తాజాగా జస్టిస్ పటేల్ ఇచ్చిన తీర్పును చందూర్కర్ సమర్ధించారు. గతేడాది ఏప్రిల్ 6న కేంద్ర ప్రభుత్వం ఐటి నిబంధనలు-2021 కి సవరణలను తీసుకొచ్చింది. సవరించిన నిబంధనల కింద ఎఫ్‌సియు ఏ పోస్టునైనా బూటకమైనదిగా, భావించినట్లైతే వెంటనే దాన్ని సామాజిక మాధ్యమాల వేదికలకు ట్యాగ్ చేస్తారు. ఇక ఆ పోస్టును తొలగించడం లేదా డిస్‌క్లైమర్ పెట్టడం తప్ప వాటికి మరో అవకాశం వుండదు. ఒకవేళ డిస్‌క్లైమర్ పెడితే వారికి గల రక్షణ కోల్పోయి, చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవకాశం వుంటుంది.

దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ భీకర దాడులు

- హిజ్బుల్లా టాప్ కమాండర్ మృతి
- పశ్చిమాసియాలో యుద్ధ విమానాలు, నౌకలను మోహరించిన అమెరికా
- లెబనాన్‌కు రాకముందే పేజర్లలో పేలుడు పదార్థాలు



ఇజ్రాయిల్ దాడులతో బీరుట్‌లో ధ్వంసమైన ఇంటి ముందు స్థానికులు

గాజా/ బీరుట్ : అమెరికా, ఇతర యూరప్ దేశాల మద్దతుతో యూదు దురహంకార ఇజ్రాయిల్ అంతకంతకూ రెచ్చిపోతోంది. గత సంవత్సర కాలంగా గాజాలో మారణ హోమం సృష్టిస్తున్న నెతన్యాహు ప్రభుత్వం ఇప్పుడీ దాడులను పశ్చిమాసియాలో ఇతర ప్రాంతాలకు విస్తరించడం ద్వారా దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని చూస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం కూడా లెబనాన్‌పై భీకర దాడులకు దిగింది. ఈ దాడుల్లో హిజ్బుల్లా అత్యున్నత మిలిటరీ గ్రూపు రద్వాన్ గ్రూపు కమాండర్ ఇబ్రహీం అఖిల్, ఇతర కమాండర్లు మృతి చెందారు. ఇతర సభ్యులతో సమావేశంలో ఉన్నప్పుడు ఈ దాడి జరిగిందని సమాచారం. ఇజ్రాయిల్ దాడిలో మొత్తం 12 మంది మృతి చెందగా, మరో 60 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఒక వైపు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ గాజాపై ఇజ్రాయిల్ అమానుష దాడులను వెంటనే ఆపాలని, తాను ఆక్రమించుకున్న ప్రాంతాల నుంచి తిరిగి వెనక్కి వెళ్లాలని కోరుతూ గురువారం తీర్మానాన్ని ఆమోదించింది. అదే సమయంలో ఇజ్రాయిల్ లెబనాన్‌లోని పౌర ఆవాసాలపైన బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో ఎంత మంది చనిపోయిందీ ఇంకా తెలియరాలేదు. దాదాపు వంద రాకెట్లు, ఫైటర్ జెట్‌లు లెబనాన్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయిలీ రేడియో కేంద్రం తెలిపింది. పేజర్ పేలుళ్లపై ఐరాస భద్రతా మండలి శుక్రవారం సమావేశం కానుందని లెబనాన్ ప్రధాన మంత్రి నజీబ్ మికాటి పిలుపునిచ్చారుఉత్తర ఇజ్రాయిల్‌లోని మౌంట్ మెరాన్ ప్రాంతంలో గల మిలటరీ బారెక్స్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ రాకెట్లు పడ్డాయి. వీటిలో చాలావరకు బహిరంగ ప్రదేశాల్లోనే పడ్డాయని ఇజ్రాయిల్ ఆర్మీ రేడియో తెలిపింది. సఫేద్ పట్టణం దిశగా కూడా కొన్ని రాకెట్లు దూసుకువచ్చాయి. ఈ ప్రాంతంలో ఘర్షణలు మరింత పెచ్చరిల్లే ప్రమాదముందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. లెబనాన్‌లోని నాలుగైదు పట్టణాలను లక్ష్యంగా ఎంచుకుని 52 చోట్ల ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు దాడులు జరిపాయని లెబనాన్ నేషనల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా సన్నద్ధం

గాజా, లెబనాన్‌లపై ఇజ్రాయిల్ దాడులను సమర్థించుకొస్తున్న అమెరికా, దీనిని ప్రాంతీయ యుద్ధంగా విస్తర్తింపజేయాలని చూస్తోంది. దీనిలో భాగంగా అమెరికా తన యుద్ధ విమానాలను, నౌకలను, సైనిక బలగాలను పశ్చిమాసియాకు తరలిస్తోంది. గత ఏడాది కాలంగా వీటి సంఖ్యను పెంచుతూ వస్తోంది. దాదాపు 40వేల మంది సైనికులను ఇప్పటికే మోహరించింది. 12 యుద్ధ నౌకలు, నాలుగు ఎయిర్ ఫోర్స్ యుద్ధ విమానాల స్క్వాడ్రన్‌లను సిద్ధం చేసినట్లు పలువురు అమెరికన్ అధికారులు వెల్లడించారు. మన బలగాలను కాపాడుకోవడమే కాకుండా అవసరమైతే ఇజ్రాయిల్‌కు అండగా వుంటామని పెంటగన్ ప్రతినిధి సాబ్రినా సింగ్ చెప్పారు. ఈ వారంలో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్‌తో ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ చాలాసార్లు మాట్లాడారు. యుద్ధంలో కొత్త దశ ఆరంభమైందని వ్యాఖ్యానించారు.

పేలుళ్లకు కొద్ది గంటల ముందుగానే...

పేజర్ పేలుళ్లకు కొద్ది గంటలు ముందుగానే హిజ్బుల్లా తన సభ్యులకు కొత్త పేజర్లను అందజేసింది. కొన్నిచోట్ల పేజర్లను ఇంకా బాక్స్‌ల్లో నుండి తీయకముందే అవి పేలిపోయాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. లెబనాన్‌కు పేజర్లు వచ్చిన వెంటనే హిజ్బుల్లా కూడా వాటిని పరీక్షించిందని, వాటిల్లో అలారమ్‌లు వంటివేవైనా వున్నాయా అనేది తెలుసుకోవడానికి విమానాల్లో వాటిని తీసుకెళ్లినట్లు కూడా ఆ వర్గాలు చెప్పాయి.

పేలుళ్లపై భద్రతా మండలికి లేఖ

లెబనాన్‌కు పేజర్లు రావడానికి ముందుగానే వాటిలో పేలుడు పదార్థాలు నింపినట్లు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని లెబనాన్ ఐక్యరాజ్య సమితి మిషన్ తెలిపింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి పంపిన లేఖలో ఈ విషయం వెల్లడించారు. పేలుడు పదార్థాలు నింపిన పేజర్లు, వాకీటాకీలకు ఎలక్ట్రానిక్ మెసేజ్‌లు పంపడం ద్వారా వాటిని పేల్చివేసినట్లు అధికారులు నిర్ధారించారని ఆ లేఖ పేర్కొంది. ఇజ్రాయిలే ఈమొత్తం వ్యవహారానికి బాధ్యత వహించాల్సి వుంటుందని ఆ లేఖలో లెబనాన్ యుఎన్ మిషన్ పేర్కొంది. శుక్రవారం భద్రతా మండలి సమావేశమై చర్చిస్తోంది.

గాజాలో 17మంది మృతి

గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ దాడుల్లో శుక్రవారం 17మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ 17మందిలో నుస్రత్ శరణార్థ శిబిరంలో తొమ్మిది మంది, గాజా నగరంలో ఆరుగురు చనిపోగా, అంతకుముందు దాడుల్లో గాయపడి మరణించినవారు మరో ఇద్దరు ఉన్నారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని కబాతియాలో ఐదుగురు పాలస్తీనియన్ల మృతదేహాలను ఇంటి పైకప్పు మీద నుండి సైనికులు లాగిపడేస్తున్న వీడియో ఒకటి వైరల్ అవుతోంది.

ఆయుధాలు అప్పగించకపోతే చర్య తీసుకుంటాం

- నక్సల్స్‌కు అమిత్ షా హెచ్చరిక


న్యూఢిల్లీ : ఆయుధాలు అప్పగించి, ప్రధాన జీవన స్రవంతిలో కలవాలని లేదా ప్రభుత్వ చర్యలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని నక్సలైట్లను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హెచ్చరించారు. మావోయిస్టుల వల్ల ఇబ్బంది పడుతున్నట్లు చెబుతున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 55 మందితో మాట్లాడిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో, దేశంలో 2026 మార్చి 31 నాటికి వామపక్ష తీవ్రవాదం అంతమవుతుందన్నారు. తుపాకులు ధరించిన వారు ఇప్పటికీ లొంగిపోకపోతే కేంద్ర ప్రభుత్వం చర్యలకు దిగుతుందని, వాటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని అమిత్ షా చెప్పారు.

'ఓటుకు నోటు' కేసు మరో రాష్ట్రానికి బదిలీ చేయం : సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో కోర్టును ఆశ్రయించారని 'ఓటుకు నోటు' కేసులో పిటిషనర్లను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లకు ప్రాసిక్యూషన్‌పై పూర్తి నమ్మకం వ్యక్తం చేసినందుకు ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జితో పర్యవేక్షించాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చుతున్నట్లు స్పష్టం చేసింది. ప్రస్తుత స్టేజ్‌లో ఈ పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్లు వెల్లడించింది. ఒకవేళ ప్రతివాది అయిన సిఎం ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొంది.

కవిత బెయిల్ ఆర్డర్ విషయంలో సిఎం రేవంత్ రెడ్డి క్షమాపణలను ద్విసభ్య ధర్మాసనం స్వీకరించింది.



గాయపడిన మహిళా న్యాయవాది

పోలీసులా? కీచకులా?

- స్టేషన్‌లోనే మహిళా న్యాయవాది దుస్తుల చించివేత, దాడి
- ఆమె కాబోయే భర్తయిన ఆర్మీ అధికారిపై దౌర్జన్యం
- ఒడిషాలో భయానక అనుభవం

భువనేశ్వర్ : బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళల పట్ల పెచ్చుమీరుతున్న అఘాయిత్యాల్లో సరికొత్త అధ్యాయానికి ఒడిశాలోని పోలీసులు శ్రీకారం చుట్టారు. రక్షణ కల్పించాల్సిన వారే అపర కీచకులుగా మారిపోయి, వారికి నరకం చూపించారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఘటనపై రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (క్రైమ్ బ్రాంచ్) అరుణ్ బోత్రాకు మహిళా న్యాయవాది, ఆమె కాబోయే భర్తయిన ఆర్మీ అధికారి లిఖితపూర్వకంగా శుక్రవారం చేసిన ఫిర్యాదు ప్రకారం వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 15వ తేదీ రాత్రి ఆర్మీ అధికారి (పశ్చిమ బెంగాల్‌లోని సిక్కు రెజిమెంట్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు), ఆయనకు కాబోయే భార్యయిన న్యాయవాదితో కలిసి రెస్టారెంట్ నుంచి కారులో తిరిగివస్తున్నారు. పత్తర్‌గడియా సమీపంలో వీరిని ఒక పోకిరీల గుంపు వెంబడించింది. దీంతో వీరు భరత్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సహాయం చేయాలని కోరారు. ఆ సమయంలో మిగిలిన సిబ్బంది అంతా పెట్రోలింగ్‌కు వెళ్లడంతో పోలీస్‌స్టేషన్‌లో ఒక మహిళా అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉన్నారు. కేసు నమోదు చేయాలని, తమకు రక్షణ కల్పించాలని బాధితులు కోరగా, వారు నిరాకరించారు, పైగా మహిళా న్యాయవాదితో అనుచితంగా ప్రవర్తించారు. ఇంతలో పెట్రోలింగ్‌కు వెళ్లిన పోలీసులు తిరిగివచ్చారు. ఫిర్యాదు రాస్తున్న ఆర్మీ అధికారిని నలుగురు పోలీసులు పట్టుకుని సెల్‌లోకి లాక్కెళ్లారు. అతని ప్యాంటు తీసివేసి వాలెట్, సెల్‌ఫోన్, ఆర్మీ గుర్తింపు కార్డు, కారు కీతో సహ అన్నీ తీసుకున్నారు. దీన్ని ప్రశ్నించిన మహిళా న్యాయవాదిపై దాడికి దిగారు. పోలీస్ స్టేషన్ కారిడార్ గుండా ఈడ్చుకెళ్లారు. జాకెట్ తీసేసి చేతులు కట్టేశారు. రెండు కాళ్లను స్కార్ఫ్‌తో కట్టేశారు. ఒక పోలీస్ అధికారి ఆమె బ్రాను తీసివేసి ఛాతీపై తన్నాడు. పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తన ప్యాంటు విప్పి రహస్య అవయవాలు చూపిస్తూ ఆమెను దూషించాడు. తరువాత ఆమెను కూడా కస్టడీలో ఉంచారు. హైకోర్టు బెయిల్‌తో బుధవారం బాధితులిద్దరూ విడుదలయ్యారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన దారుణ ఘటనపై రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (క్రైమ్ బ్రాంచ్) అరుణ్ బోత్రాకు లిఖితపూర్వకంగా బాధితులు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అభియోగాలు లేకుండా ఆర్మీ అధికారిపై, ఆయన కాబోయే భార్యపై తీవ్రంగా దాడి చేయడం, 14 గంటలపాటు నిర్బంధంలో ఉంచడంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ డిమాండ్ చేశారు. భరత్‌పూర్ పోలీస్ స్టేషన్‌లోని పోలీసులపై క్రైం బ్రాంచి పోలీసులు కేసు నమోదు చేసి, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ప్రారంభించారు.

నేడు అతిషి, మరో ఐదుగురు మంత్రుల ప్రమాణం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, ఢిల్లీ ముఖ్యమంత్రిగా నియమితులైన అతిషి మర్లెనా మరో ఐదుగురు మంత్రులు శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శనివారం నాడిక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ అధికారిక నివాసం (రాజ్ నివాస్) ముఖ్యమంత్రిగా అతిషి, మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, కైలాష్ గహ్లోట్, ముఖేష్ అహ్లావత్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఏడో మంత్రి ఎవరనేది అస్పష్టంగానే ఉంది.ప్రమాణ స్వీకారోత్సవానికి లెఫ్టినెంట్ గవర్నర్ సచివాలయానికి ఆరు పేర్లు మాత్రమే వచ్చాయని సీనియర్ ప్రభుత్వ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఆప్ నేత ఒక క్యాబినెట్ స్థానం ఖాళీగా ఉంటుందని ధ్రువీకరించినా, కారణాలను వెల్లడించలేదు.

కేజ్రీవాల్‌కు ప్రభుత్వ వసతి కల్పించండి : కేంద్రానికి ఆప్ డిమాండ్

ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు దేశరాజధానిలో ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వ వసతి కల్పించాలని ఆ పార్టీ శుక్రవారం డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణా వ్యవహారాల శాఖకు లేఖ రాయనున్నట్లు ఆప్ రాజ్యసభ ఎంపి రాఘవ్ చద్దా తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి జాతీయ పార్టీకి దేశ రాజధానిలో కార్యాలయం, అధినేత వసతి కోసం రెండు భవనాలను కేటాయించాల్సి ఉందని గుర్తు చేశారు.

హర్యానా ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్

హర్యానాలో ఆప్ ఎన్నికల ప్రచారంలో కేజ్రీవాల్ శుక్రవారం పాల్గొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జగద్రి పట్టణంలో జరిగిన రోడ్‌షోకు హాజరయ్యారు. ప్రజలకు తన వాహనం సన్‌రూఫ్‌పై నుంచి అభివాదం చేశారు.

'నీట్' కేసులో సిబిఐ రెండో ఛార్జిషీట్

పాట్నా : నీట్ యుజి - 2024 పేపర్ లీక్ కేసులో సిబిఐ శుక్రవారం రెండో ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. పాట్నాలోని సిబిఐ ప్రత్యేక కోర్టు ముందు ఆరుగురు నిందితులపై ఈ ఛార్జిషీట్ ఉంచింది. హజరిబాఘ్‌లోని ఒయాసిస్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ బలదేవ్ కుమార్ అలియాస్ చింటు, సన్నీకుమార్, డాక్టర్ అహ్సనుల్ హుక్, ఓయాసిస్ సూల్ వైస్ ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇంతియాజ్, ఒక హిందీ వార్తాపత్రిక విలేకరి జమాలుద్దీన్ అలియాస్ జమల్, అమన్ కుమార్ సింగ్ పేర్లను రెండో ఛార్జిషీట్‌లో సిబిఐ ఉంచింది. ఆగస్టు 1న సిబిఐ నమోదు చేసిన మొదటి ఛార్జిషీట్‌లో 13 మంది నిందితుల పేర్లను సిబిఐ నమోదు చేసిన సంగతి తెలిసిందే. రెండో ఛార్జిషీట్‌లో సిబిఐ అభియోగాల ప్రకారం.. హజరిబాఘ్‌లోని నీట్ పరీక్ష నిర్వహణ కోసం ఒయాసిస్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్, సూల్ వైస్ ప్రిన్సిపాల్‌ను సిటీ కో ఆర్డినేటర్లుగా నియమించారు. వీరంతా పేపర్‌ను ముందుగా తీసుకునేందుకు ఇతర నిందితులతో కలసి కుట్ర పన్నారు. ఈ కేసులో సిబిఐ ఇప్పటి వరకూ 48 మందిని అరెస్టు చేసింది. పేపర్ లీక్‌తో లబ్ధి పొందిన అభ్యర్థులను కూడా సిబిఐ గుర్తించింది. వీరి వివరాలను ఎన్‌టిఎకు అందజేసింది. అరెస్టు చేసిన ఇతర నిందితులపై విచారణ కొనసాగుతోందని సిబిఐ తెలిపింది. నీట్ యుజి 2024 పేపర్ లీక్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసును సిబిఐ దర్యాప్తు చేస్తోంది.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ప్రత్యేక మిషన్


(మొదటి పేజీ తరువాయి)

కొనకూడదు వంటి షరతులు పెట్టిందని, ఫ్యాక్టరీని నడపడానికి కాకుండా మూసెయ్యడానికి ఈ డబ్బులు ఇస్తున్నారా ? షరతులతో డబ్బులు ఇచ్చి తెలుగు ప్రజలను అవమానించడం కాదా ? అంటూ ప్రశ్నించారు. ఈ డబ్బును కూడా కేంద్రమే జిఎస్‌టి పేరుతో వెనక్కి తీసుకుపోయే కుట్ర అని తెలిపారు. ప్లాంట్‌ను కాపాడలేకపోతే రాజీనామా చేస్తానని ఇటీవల గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారని, కేంద్రం కుట్రల పరంపరను కొనసాగిస్తుంటే వంద రోజుల్లో ఎలాంటి ప్రతిఘటనా ఇవ్వకుండా అలా ప్రతిజ్ఞ చేయడం వల్ల ఏం లాభమని ప్రశ్నించారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మిక సంఘాలపై జనసేనకు చెందిన ఓ నాయకుడు ఇటీవల చేసిన ఆరోపణలను రుజువు చేయాలని, రుజువు చేయలేకపోతే ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

లడ్డూ లడాయి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి విమర్శ చేశారు. నెయ్యి నాణ్యతా పరిశీలన రొటీన్‌గా జరిగే ప్రక్రియ అని, గతంలో టిడిపి హయాంలో, తమ హయాంలో నాణ్యత లేదని నెయ్యి ట్యాంకర్లను పలుమార్లు తిప్పి పంపారన్నారు. టిడిపి వచ్చాకనే నెయ్యి శాంపిల్స్ గుజరాత్‌కు పంపారని, ఎప్పుడో జులైలో వచ్చిన రిపోర్టులను ఎందుకు రెండు నెలలపాటు బహిర్గతం చేయకుండా ఆలస్యం చేశారని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సైతం లడ్డూ నాణ్యతపై విచారణ జరిపిస్తామన్నారు. టిటిడి మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు ప్రెస్‌మీట్ పెట్టి చాలా సార్లు నెయ్యిలో నాణ్యత లోపించిందని తాను ఫిర్యాదు చేశానన్నారు. ఇదిలా ఉండగా లడ్డూ వ్యవహారంపై తెలంగాణ, ఢిల్లీ నుంచి బండి సంజయ్ సహా, బిజెపి నాయకులు, సంఘ్ నేతలు, మత పరంగా రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. గతంలో టిటిడి బోర్డు ఛైర్మన్లుగా పని చేసిన వైసిపి నేతలు వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి తమ హయాంలో ఎలాంటి అపవిత్ర చర్యలకు పాల్పడలేదని పదే పదే వివరణ ఇచ్చారు. న్యాయ పోరాటానికి సిద్ధమని వైవి సుబ్బారెడ్డి ప్రకటించారు. తాను తిరుపతి శ్రీవెంకటేశ్వరుని సమక్షంలో ప్రమాణం చేస్తానని, చంద్రబాబూ అందుకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు.



మీకోసం

కుక్కర్ అడుగుభాగం నల్లగా అయితే రెండు చిన్న బంగాళాదుంప ముక్కల్ని వేసి కాసిన్ని నీళ్లు పోసి వేడి చేయాలి. ఆ నీటితో బాగా రుద్ది కడిగితే నలుపు పోతుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

వినదగునెవ్వరు చెప్పిన ...

ఇందు, హేమంతి మంచి స్నేహితులు. చదువులో ఇద్దరూ ముందుంటారు. జ్యోతి కూడా అదే తరగతి చదువుతోంది. ఇతరుల మీద చాడీలు చెప్పడం అంటే జ్యోతికి మహా సరదా. ఒకరోజు ఇందు తన కథల పుస్తకం పోయిందని వెతుకుతుంది. ఆ రోజు హేమంతి స్కూలుకు రాలేదు.

'ఏం జరిగింది' అని జ్యోతి అడిగింది జ్యోతి.

'నా కథల పుస్తకం పోయింది. కనిపించడం లేదు' అని బాధగా చెప్పింది ఇందు.

'నీ కథల పుస్తకం నిన్న హేమంతి తీయడం చూశాను' అని చెప్పింది జ్యోతి. ఆ తరువాతి రోజు హేమంతి స్కూలుకు వచ్చినా, పుస్తకం గురించి ఏమీ అడక్కుండానే ఇందు, హేమంతితో మాట్లాడడం మానేసింది.

ఒక రోజు తరగతిలో ఉపాధ్యాయుడు 'వినదగు నెవ్వరు చెప్పిన/ వినినంతనె వేగ పడక...' పద్యం పిల్లలతో వల్లె వేయించారు. 'ఎవరు ఏమి చెప్పినా వినాలి. కానీ తొందరపడి నిర్ణయం తీసుకోకూడదు. అపార్థం చేసుకోకూడదు' అని భావం కూడా చక్కగా వివరించి చెప్పారు. అప్పటికే హేమంతి రెండు రోజుల నుంచి స్కూలుకు రావడం లేదు. ఇందుకు ఏదో అపరాధభావం వెంటాడింది. హేమంతితో వెంటనే మాట్లాడాలనుకుంది. తన ఇంటికి వెళ్లింది. హేమంతి జ్వరంతో బాధపడుతూ ఉంది. తనని చూసి గట్టిగా పట్టుకొని ఏడ్చింది ఇందు. స్నేహితురాలి ప్రవర్తన చూసి హేమంతి కంగారు పడింది.

'ఎందుకు ఏడుస్తున్నావు' అని అడిగింది. ఇందు జరిగిందంతా చెప్పింది. 'నిన్ను తప్పుగా అర్థం చేసుకున్నాను. నిన్న మా అమ్మ అలమరా అంతా వెతికి నా కథల పుస్తకం ఇచ్చింది. అప్పుడే నా తప్పు తెలిసింది. ఈరోజైనా నువ్వు స్కూలుకి వస్తావేమో విషయం చెప్పి మాట్లాడాలనుకున్నాను. కానీ నువ్వు రాలేదు. నీతో మాట్లాడేదాకా నా మనసు మనసులో లేదు. అందుకే ఇంటికి వచ్చేశాను' అని చెప్పింది ఇందు. ఆ రోజు నుంచి ఇకపై ఎవరినీ తప్పుగా అనుకోకూడదు. తొందరపడి అపార్థం చేసుకోకూడదు. అని మనసులో గట్టిగా నిర్ణయం తీసుకుంది ఇందు.

నీతి : తొందరపడి ఎవరినీ అపార్థం చేసుకోకూడదు. నిజం ఏమిటో తెలుసుకోవాలి. చెప్పుడు మాటలు వినకూడదు.



– కె.ఇందు, 7వ తరగతి, జిల్లా పరిషత్ హైస్కూలు, కూండ్రం, అనకాపల్లి.

నేను గీసిన బొమ్మ





పి. సృజన, 8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాంపూర్, నిజాంపేట్ మండలం, మెదక్ జిల్లా.

ఆకారాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఆకారాలను ఇంగ్లీషులో ఏమంటారో రాయండి. (క్లూ చూడండి)

circle square
traingle rectangle



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆడిపాడే వయసులో ఆధ్యాత్మికమా?

పిల్లలు చేసే చిలిపి పనులకు తెగ మురిసిపోతాం. భలే చేశారని సంబరపడిపోతాం. తెలిసినవాళ్లకి, చుట్టాలకి, పక్కాలకి ఆ చేష్టలు చెప్పి ఆనందిస్తాం. ఇదంతా ఒకప్పుడు. ఇప్పుడు స్మార్ట్ ఫోను యుగం నడుస్తోంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఖాతాల్లో పిల్లల చేష్టలను పుంఖాను పుంఖలుగా రాస్తున్నారు. వీడియోలు షేర్ చేస్తున్నారు. అలా పిల్లలకి సెలబ్రిటీ హోదా ఇవ్వడం ఇప్పుడు ఒక ఫ్యాషన్. అలా సోషల్ మీడియా చేసిన ఓ సెలబ్రిటీనే ఢిల్లీ పశ్చిమ ప్రాంతానికి చెందిన అభినవ్ అరోరా.



అయితే ఇక్కడ అరోరా అందరి పిల్లల్లా చిలిపి చేష్టలతో పాపులర్ అవ్వలేదు. మతపరమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వైరల్ అయ్యాడు. ఇంకేముంది! కావాల్సిన వాళ్లకి కావాల్సినంత దొరికేసింది. లక్షల్లో లైకులు వచ్చేశాయి. ఫాలోవర్లు పెరిగిపోయారు. తామేమీ తక్కువ కాదని ఒక రాజకీయ పార్టీ ఢిల్లీ పెద్దలు కూడా అరోరాకి జై కొట్టారు. అవార్డులు, రివార్డులతో ముంచేశారు.

దీనికిముందు ఏం జరిగింది?

అభినవ్ అరోరా.. అందరి పిల్లల్లాంటివాడే. అయితే తను పెరిగిన వాతావరణమో, చుట్టుపక్కల వాళ్ల ప్రభావమో ఒకింత దైవభక్తి ఎక్కువ. స్కూల్లో పిల్లలందరూ 'హాయ్ డూడ్', హాయ్ బ్రో' అని పిలుచుకుంటుంటే, అరోరా మాత్రం 'రాధే, రాధే' అని పిలిచేవాడు. ఎవరితోనూ స్నేహం చేసేవాడు కాదు. నిజం చెప్పాలంటే అతనితో స్నేహం చేసేందుకు పిల్లలెవరూ ఇష్టపడేవారు కాదు. అతని పక్కన కూర్చోడానికే ఒప్పుకునే వారు కాదు. ఇదంతా మూడేళ్ల క్రితం మాట. అంటే అభినవ్‌కి ఏడేళ్లప్పుడు..

ఇప్పుడు అభినవ్‌కి పదేళ్లు. ఈ మూడేళ్లలో చాలా మారిపోయింది. తమ పిల్లలను అభినవ్ పక్కన కూర్చోబెట్టమని పిల్లల తల్లిదండ్రులు పోటీలు పడుతున్నారు. రోజుకొక ఇద్దరి చొప్పున అభినవ్‌కి అటుపక్క, ఇటుపక్క కూర్చోవడం ఆ క్లాసులో పిల్లలకు ఆనవాయితీగా మారిపోయింది. ఖాళీ పీరియడ్లలో అభినవ్‌తో భక్తి గీతాలు, భజనలు చేయించడం టీచర్లు దినచర్యలా భావిస్తున్నారు.

లక్షల్లో ఫాలోవర్లు

అరోరా ఇప్పుడు అతి చిన్న బాబాగా తెగ కీర్తి గడిస్తున్నాడు. తను గుళ్లు, గోపురాలకి తిరిగిన వందలాది వీడియోలు, రీల్స్, ప్రవచనాలు, ఇంటర్వ్యూలని ఇన్‌స్టాలో దాదాపు పది లక్షల మంది అనుసరిస్తున్నారు. ఫేస్‌బుక్‌లో రెండు లక్షలకు పైగా జనాలు వీక్షిస్తున్నారు. అరోరా యూట్యూబ్ ఛానెల్‌ని అనుసరించే వారి సంఖ్య కూడా లక్షన్నరకి చేరుతోంది.

'కామెడీ సీరియళ్లు చూపించేదాన్ని. అయినా..'

అభినవ్ అరోరా సాధారణ దైవభక్తి గల కుటుంబంలో పుట్టాడు. తన ముద్దుల బిడ్డ గురించి అరోరా తల్లి జ్యోతి చాలా విషయాలు చెప్పింది. 'రోజూ ఉదయం, సాయంత్రం మేం సాధారణ పూజలే చేసేవాళ్లం. ఇద్దరు పిల్లల్లో అరోరా చిన్నవాడు. తనకి ఒక అక్క ఉంది. మా ఇంటి చుట్టూ ఆలయాలు ఎక్కువ. అక్కడ రోజూ భగవద్గీత పారాయణం చేసేవారు. చిన్నప్పటి నుంచి వాటిని వింటూ పెరగడం వల్ల అరోరాకి కాస్త దైవభక్తి ఎక్కువే. మొదట్లో మాకు బానే ఉండేది. అయితే రోజులు గడుస్తున్న కొద్దీ తను సాధారణ పిల్లల్లా ప్రవర్తించడం మానేశాడు. ఫ్రెండ్స్‌తో ఆడుకోమని, బయటికి వెళ్లమని ఎంత చెప్పినా వినేవాడు కాదు. ఒక్కోసారి వాళ్ల నాన్న తరుణ్‌తో దెబ్బలు కూడా తినేవాడు. పిల్లాడ్ని సాధారణంగా చేయాలని కార్టూన్ సీరియల్స్ చూపించేదాన్ని. పిల్లలు బాగా ఇష్టపడే 'మోటూపత్' పెట్టి తనతో పాటూ నేనూ కూర్చొని చూసేదాన్ని. నవ్వు రాకపోయినా, తనని ఎలాగైనా నవ్వించాలని నవ్వేదాన్ని. జీన్స్ ప్యాంట్లు, టీ షర్టులు వేసేదాన్ని. ఎన్ని చేసినా అరోరాలో మార్పు రాలేదు. అతన్ని మార్చే ప్రయత్నంలో నన్ను మార్చడానికి ప్రయత్నించేవాడు. ఇప్పుడు మేమంతా అరోరా ఇష్ట ప్రకారమే నడుచుకుంటున్నాం. అప్పుడు అంత వేదన పడ్డ మేము, ఇప్పుడు అరోరాకి లభిస్తున్న కీర్తి, ప్రశంసలకు లొంగిపోయాం. దీన్నే కొనసాగించి, ఈ దేశం గర్వించదగ్గ గొప్ప భక్తుడిగా నా కొడుకుని తీర్చిదిద్దాలనుకుంటున్నాను' అని అంటోంది. బిడ్డ ప్రయోజకుడవ్వాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. కానీ ఇది ప్రయోజకత్వమా? పిచ్చితనమా? ఇది మానసికంగా అరోరాలో వచ్చిన విపరీత ప్రవర్తనే కాని, ఇంకోటి కాదు.

ఫ్రెండ్స్ లేరు.. టీవీ చూడడు..

'అభినవ్‌కి ఫ్రెండ్స్ లేరు. టీవీ చూడడు. ఫోన్‌తో ఆడుకోడు. అసలు ఆ కోరికలేమీ లేవు. ఎప్పుడూ కృష్ణా, రాధా అంటూ ఉంటాడు. మా ఇంట్లో ఓ పెద్ద గది నిండా దేవుళ్ల పటాలే ఉంటాయి. తెల్లారే 3 : 30కే లేచి, అభినవ్ తన భక్తి ప్రపంచంలో మునిగిపోతాడు. చలిరాత్రులైనా బద్ధకించడు. నేను లేవకముందే నా పదేళ్ల బిడ్డ అలా భక్తి పారవశ్యంలో ఉండడం నాకు చాలా అద్భుతంగా అనిపిస్తుంది' అని ఆ తల్లి ఎంతో అమాయకంగా చెబుతున్నంత సేపూ అభినవ్ అలా వింటూనే ఉన్నాడు. అమ్మ చెప్పడం పూర్తయ్యాక, 'నా హృదయమంతా కృష్ణుడు నిండిపోయాడు. నేను అతనితో ఉండటానికే ఇష్టపడతాను. ఈ సౌకర్యాలన్నింటినీ వదిలేసి బృందావన్‌లో ఓ చిన్న పూరిగుడిసెలో ఉండేందుకు కూడా వెనుకాడను' అని ఆ బాలుడు చెప్పాడు.

'అమ్మ చేసే స్వీట్లు చాలా ఇష్టం'

అలాంటి అభినవ్‌ని 'నీకు అమ్మ చేతి వంటలో ఏది ఇష్టం' అని అడిగితే, 'అమ్మ వండే స్వీట్లన్నీ ఇష్టమే, ఆమె చేసే సేమియా అయితే చాలా బాగుంటుంది. ఇక నా కోసం ప్రత్యేకంగా వండే పప్పు అయితే అస్సలు వదిలిపెట్టను' అని చెబుతున్నప్పుడు మాత్రం అభినవ్ అంతకుముందులా లేడు. ఆ వయసు పిల్లాడు, అమ్మ గురించి, తను చేసే వంటల గురించి ఎలా చెబుతారో అచ్చం అలాగే మాట్లాడాడు. ఆ క్షణం తనని చూసిన వారెవరికైనా ఇంత చిన్నపిల్లాడు ఆధ్యాత్మికంగా ఎలా మాట్లాడుతున్నాడు? అని ఆశ్చర్యపోతారు.

ఎన్నో ఉదంతాలు

అభినవ్ లాంటి స్వయం ప్రకటిత బాబాలు మనకు కొత్త కాదు. ఆధ్యాత్మిక పేరుతో చిన్నపిల్లలకు లేనిపోని అద్భుతాలు అంటగట్టి వాళ్ల జీవితాలను బాల్యానికి దూరం చేయడం గతంలో కూడా కొందరి విషయాల్లో చూశాం. జైపూర్‌లో ఓ బాలికని కృష్ణుడికి అంకితం ఇచ్చేందుకు ఆమెతో కఠోర నిరాహార దీక్ష చేయించింది ఆమె కుటుంబం. నిద్రాహారాలు లేక ఆ యువతి మరణించినప్పుడు కూడా అదో వేడుక లాగా నిర్వహించింది. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా పునర్జన్మల పేరుతో పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్న చిన్నారులను దేవతల్లాగా కొలవడం చూశాం. వారంతా ఇప్పుడు ఏమయ్యారో ఎవరికీ తెలియదు. అసలు ఉన్నారో లేరో కూడా ఎవరికీ పట్టదు. ఇలాంటి విషయాలను తీవ్రంగా పరిగణించి అడ్డుకట్ట వేసే దిశగా పాలకులు చర్యలు తీసుకోవాలి. కానీ, మన దౌర్భాగ్యం ఎలా తగలడిందంటే..

అవార్డుల పేరుతో..

సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిన అభినవ్ వీడియోలు చూసిన కేంద్రం పెద్దలు, మొన్న జరిగిన అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి అతన్ని ప్రత్యేక అతిథిగా ఆహ్వానించారు. అంతకుముందే డిసెంబరులో 'ఇండియాస్ యంగెస్ట్ స్పిర్చ్యువల్ వక్త'గా అవార్డు ఇచ్చారు. ఈ అవార్డులు, ప్రశంసలు ఆ తరువాత కూడా చాలానే వచ్చాయి. ఇవన్నీ ఎక్కడికి దారితీశాయంటే ప్రస్తుతం స్కూల్లో సాధారణ విద్య అభ్యసిస్తున్న అభినవ్ భవిష్యత్తులో స్పిర్చ్యువల్ స్కూల్‌లో సెయింట్‌గా మారేలా శిక్షణ తీసుకోవాలనుకుంటున్నాడు.

పిల్లలు పాదరసం లాంటి వారు. ఏ పాత్రలో పోస్తే అలా ఒదిగిపోతారు. అలాంటి పిల్లలను పెద్దవాళ్లు తమ ప్రయోజనాల కోసం ప్రభావితం చేయడం ఏమాత్రం సమంజసం కాదు. ఆ ప్రభావం ఆ చిన్నారి మనసులను ఎంతో కుంగదీస్తుంది. ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఈ చిన్నారి అభినవ్ అరోరాని ఈ విపరీతాలు ఎక్కడికి దారితీశాయో మన కళ్ల ముందే ఉంది.



బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న రమాదేవి



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన సభలో మాట్లాడుతున్న వి ఉమామహేశ్వరరావు

ఏచూరి ఆశయం అజరామరం

- **సంస్మరణ సభల్లో పలువురు వక్తలు**

ప్రజాశక్తి – యంత్రాంగం


సీతారాం ఏచూరి ఆశయం అజరామరమని, ఆయన ఆశయ సాధనకు పునరంకితం అవ్వడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. సీతారాం ఏచూరి సంతాప సభలు శుక్రవారం విశాఖ, ఒంగోలు, తూర్పుగోదావరిలో జరిగాయి. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంతాప సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భారత దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరిది కీలకపాత్ర అని, వామపక్ష ఐక్యత, లౌకికతత్వ పరిరక్షణకు ఆయన పార్లమెంట్‌లోనూ, బయటా విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమ సారథిగా ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిదని కొనియాడారు. సమాజ మార్పు కోసం విద్యార్థి దశ నుంచే సోషలిజం మార్గాన్ని ఎంచుకుని తాను ఎత్తిన ఎర్రజెండాను దించకుండా ఉద్యమించిన యోధుడని తెలిపారు. జాతీయ స్థాయిలో అనేక పదవులు లభించే పరిస్థితి ఉన్నా నిరాడంబర రాజకీయవాదిగా జీవితం గడపడం ఆయన ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా, లౌకిక తత్వాన్ని నిలబెట్టే దిశగా ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం దేశంలో కష్టజీవులకు తీరని లోటు అని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన జరిగిన సభకు సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు హాజరయ్యారు.

బాపట్ల జిల్లా చీరాల ఎన్‌జిఒ భవన్‌లో జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ .. లౌకిక ప్రజాస్వామ్యం కోసం చట్టసభల్లో ప్రజల వాణిని సీతారాం ఏచూరి వినిపించారని అన్నారు. దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే విధానాలపై పార్లమెంటులో ప్రశ్నించారన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నేతగా పరిచయమైన ఆయన దేశ రాజకీయాల్లో.. రైతులు, కార్మికులు, కష్టజీవుల ప్రయోజనాల కోసం కమ్యూనిస్టుగా చివరి వరకూ పని చేశారని పేర్కొన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను వ్యతిరేకించారని గుర్తు చేశారు. దేశ రాజకీయాల్లో ప్రజాస్వామ్య, లౌకికవాదులకు దిక్సూచిగా నిలిచారని కొనియాడారు. ఆయన మరణం సిపిఎంతో పాటు దేశ రాజకీయాలు, సామాన్య ప్రజలకు తీరని లోటన్నారు. సభలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి కుర్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని అల్యూమినియం అసోసియేషన్ హాల్లో జరిగిన సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమం రూపకల్పనలో ఏచూరి ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. యుపిఎ–1 ప్రభుత్వంలో ఉపాధి హామీ చట్టం, గిరిజన హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం వంటివి సాధించడంలో సఫలీకృతులయ్యారన్నారు. 2024 ఎన్నికల్లో ఇండియా కూటమి ఏర్పాటులో కీలక భూమిక పోషించి మతతత్వ బిజెపికి బ్రేకులు వేశారని తెలిపారు. భద్రాచలం మాజీ ఎంపి మీడియం బాబూరావు మాట్లాడుతూ భారతదేశంలో జాతీయ ఉద్యమం, మూలాలు, లక్ష్యాలు, వాటిని సాధించడంలో పాలకుల వైఫల్యాలపై రాజ్యసభలో ఏచూరి చేసిన చర్చ యావత్ సభ్యులందరినీ ఆలోచింపజేసిందని గుర్తు చేశారు. మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కమ్యూనిస్టుల జీవన విధానం, సైద్ధాంతిక ఆచరణ, ప్రజల కోసం జీవించే తీరును ఈ సందర్భంగా కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, వైసిపి కేంద్ర కమిటీ సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించే మహోన్నత నేత ఏచూరి అని అన్నారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విజయవాడలో 'హరి హర వీరమల్లు'

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ మూవీ 'హరి హర వీరమల్లు' షూటింగ్ అప్‌డేట్ వచ్చింది. తొలి భాగానికి సంబంధించి చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది. ఏడాదిగా పవన్ రాజకీయాల్లో బిజీగా ఉండటంతో ఈ సినిమా మిగిలిన చిత్రీకరణ వాయిదా పడుతూ వస్తోంది. పవన్ పాత్రకు సంబంధించి 20 రోజుల షూట్ మాత్రమే మిగిలిఉంది. తన సన్నివేశాలను పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్‌కు సమయాన్ని కేటాయించారు. ఈనెల 23న విజయవాడలో 'హరిహర వీరమల్లు' కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఇందులో పవన్ సహా కీలక నటీనటులు పాల్గొంటారు. హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్ నిక్ పాల్ ఆధ్వర్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేయనున్నారు. జ్యోతికృష్ణ దర్శకత్వంలో పాన్ ఇండియాగా తెరకెక్కనున్న ఈ మూవీ ఈ ఏడాది చివరికి ప్రేక్షకుల ముందుకురానుంది. షూటింగ్ కోసం విజయవాడ పరిసర ప్రాంతాల్లో బ్లూమ్యాట్ సెట్‌ను సిద్ధం చేశారు. మరో మూడు రోజుల్లో పవన్ సెట్‌లో అడుగుపెట్టనున్నారు. రెండు భాగాలుగా రానున్న ఈ మూవీ తొలిభాగం 'హరి హర వీరమల్లు పార్ట్ 1 : స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. అనుపమ్‌ఖేర్, బాబీ దేవోల్, నిధి అగర్వాల్, నోరాహి ఫతేహి, విక్రమ్ జీత్, జిషుసేన్ గుప్త తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం : ఎం.ఎం.కీరవాణి, నిర్మాత : ఎ.దయాకర్ రావు, సమర్పణ : ఏ.ఎం.రత్నం.



బంగ్లా కట్టడి



తస్కిన్ అహ్మద్‌ను బౌల్డ్ చేసిన బుమ్రా

- **బౌలింగ్‌లో మెరిసిన బుమ్రా, ఆకాశ్‌దీప్, జడేజా**
- **టీమిండియాకు 308పరుగుల ఆధిక్యత**

చెన్నై: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ పటిష్ట స్థితిలో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్‌ను కేవలం 149పరుగులకే కట్టడి చేయడంతో టీమిండియాకు 227 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా రెండోరోజు ఆట ముగిసే సమయానికి 3వికెట్ల నష్టానికి 81 పరుగులు చేసింది. దీంతో భారతజట్టుకు ఇప్పటికే 308 పరుగుల ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో రోహిత్ శర్మ (5) మరోసారి నిరాశపరచగా.. యశస్వి జైస్వాల్ (10), విరాట్ కోహ్లి (17) తక్కువ పరుగులకే ఔటయ్యారు. క్రీజులో శుభ్‌మన్ గిల్ (33), రిషభ్ పంత్ (12) ఉన్నారు. అంతకుముందు జస్ప్రీత్ బుమ్రా(4/50), ఆకాశ్ దీప్(2/19), రవీంద్ర జడేజా(2/19), మహ్మద్ సిరాజ్(2/30) బౌలింగ్‌లో చెలరేగడంతో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది.

ఓవర్‌నైట్ స్కోర్ 6వికెట్ల నష్టానికి 339పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. జడేజా(86) సెంచరీకి చేరువలో తస్కిన్ అహ్మద్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత ఆకాశ్ దీప్(17), అశ్విన్(113) కూడా ఔటవ్వడంతో టీమిండియా ఇన్నింగ్స్ త్వరగా ముగిసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ మూడు వికెట్ల నష్టానికి 81పరుగులు కొట్టింది. ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట కొనసాగించిన భారత్ తొలి సెషన్‌లోనే ఆలౌటయ్యింది. తస్కిన్ అహ్మద్(3/55) మూడు వికెట్లతో రాణించి బంగ్లాకు బ్రేకిచ్చాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించిన భారత్‌ను తస్కిన్ మరోసారి దెబ్బకొట్టాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (5)ను స్వల్ప స్కోర్‌కే ఔట్ చేశాడు. క్రీజులో కుదురుకున్నట్లే కనిపించిన యశస్వీ జైస్వాల్(10)ను నహిద్ రానా ఆఫ్ సైడ్ బంతితో బోల్తా కొట్టించాడు. ఆ కాసేపటికే విరాట్ కోహ్లి(17)ను హెహిదీ హసన్ మిరాజ్ ఎల్బీగా వెనక్కి పంపాడు. మూడు వికెట్లు పడిన దశలో శుభ్‌మన్ గిల్ (33 నాటౌట్), రిషభ్ పంత్(12 నాటౌట్)లు ఆచితూచి ఆడారు. రెండో రోజు ఆట ముగిసే సరికి నాలుగో వికెట్‌కు 14 పరుగులు జోడించారు.

స్కోర్‌బోర్డు...

భారత్ తొలి ఇన్నింగ్స్: 376ఆలౌట్

బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: షాద్మన్ ఇస్లామ్ (బి)బుమ్రా 2, జాకిర్ హసన్ (బి)ఆకాశ్ దీప్ 3, శాంటో (సి)కోహ్లి (బి)సిరాజ్ 20, మోమినుల్ (బి)ఆకాశ్ దీప్ 0, ముష్ఫికర్ (సి)రాహుత్ (బి)బుమ్రా 8, షకీబ్ (సి)పంత్ (బి)జడేజా 32, లింటన్ దాస్ (సి)ధ్రువ్ జురెల్ (బి)జడేజా 22, మెహిదీ హసన్ (నాటౌట్) 27, మహ్మద్ (సి)కోహ్లి (బి)బుమ్రా 9, తస్కిన్ అహ్మద్ (బి)బుమ్రా 11, నహిద్ రానా (బి)సిరాజ్ 11, అదనం 4. (47.1ఓవర్లలో ఆలౌట్) 149పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/22, 3/22, 4/36, 5/40, 6/91, 7/92, 8/112, 9/130, 10/149 **బౌలింగ్:** బుమ్రా 11--1-50-4, సిరాజ్ 10.1-1-30-2, ఆకాశ్ దీప్ 5-0-19-2, అశ్విన్ 13-4-29-0, జడేజా 8-2-19-2.

ఇండియా రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)లింటన్ దాస్ (బి)నహిద్ రానా 10, రోహిత్ శర్మ (సి)జాకిర్ హసన్ (బి)తస్కిన్ అహ్మద్ 5, శుభ్‌మన్ (బ్యాటింగ్) 33, కోహ్లి (ఎల్‌బి)మెహిదీ హసన్ 17, పంత్ (బ్యాటింగ్) 12, అదనం 4. (23ఓవర్లలో 3వికెట్ల నష్టానికి) 81పరుగులు. **వికెట్ల పతనం:** 1/15, 2/28, 3/67 **బౌలింగ్:** తస్కిన్ అహ్మద్ 3-0-17-1, హసన్ మహ్మద్ 5-1-12-0, నహిద్ రానా 3-0-12-1, షకీబ్ 6-0-20-0, మెహిదీ హసన్ 6-0-16-1.

సంజు, అభిమన్యు సెంచరీలు

- **నిరాశ పర్చిన సూర్యకుమార్**
- **ఇండియా – 'డి' 349 ఆలౌట్**
- **ఇండియా – 'సి' జట్టు 216/7**

ప్రజాశక్తి–అనంతపురం ప్రతినిధి

దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ఆసక్తికరంగా సాగుతోంది. అనంతపురం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఇండియా 'ఎ', 'సి', జట్ల మధ్య, ఇండియా 'బి', 'డి' జట్ల మధ్య ఆఖరి రౌండ్ రెండోరోజు మ్యాచ్‌లు జరిగాయి. ఇండియా–డి ఆటగాడు సంజు శాంసన్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇండియా–బి బౌలర్ నవ్‌దీప్ సైనీ ఐదు వికెట్లు పడగొట్టాడు. ఇండియా–బి జట్టు కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ టోర్నీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. సూర్యకుమార్ యాదవ్ కేవలం ఐదు పరుగులు చేసి నిరాశపరిచాడు. మరో మ్యాచ్‌లో ఇండియా–ఎ జట్టులో శాశ్వత్ రావత్ 124, అవేశ్‌ఖాన్ అర్ధసెంచరీ సాధించారు. ఇండియా–సి జట్టులో అభిషేక్ పోరెల్ అర్ధ సెంచరీ చేశాడు.


ఓవర్‌నైట్ స్కోర్ 306/5 పరుగులతో ప్రారంభించిన ఇండియా–డి జట్టు.. ఇండియా బి బౌలర్ నవ్‌దీప్ సైనీ దాటికి 87.3 ఓవర్లలో 349 పరుగులకు ఆలౌట్ అయ్యింది. నవదీప్‌సైనీ (5 వికెట్లు) నిప్పులు చెరిగే వేగంతో బంతులను సంధించాడు. దీంతో శుక్రవారం ఉదయం 43 పరుగులు మాత్రమే చేసి మిగితా 5 వికెట్లను ఇండియా 'డి' జట్టు కోల్పోయింది. అనంతరం ఇండియా 'బి' జట్టు ఆటముగిసే సమయానికి 56 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. జట్టులో కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ మరోసారి 116 పరుగులు చేశాడు. ఇండియా 'డి' బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, ఆదిత్య థాకరే 2 వికెట్లు తీసుకున్నారు.

ఇండియా – 'సి' 216/7

ఇండియా 'ఎ' బౌలర్ అకీబ్ ఖాన్, సామ్స్ ములానీ ధాటికి ఇండియా 'సి' జట్టు ఆట ముగిసే సమయానికి 7 వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసింది. అకీబ్ ఖాన్ 3, సామ్స్ ములానీ 2 వికెట్లు తీసుకున్నారు. ఇండియా 'సి' జట్టులో అభిషేక్ పోరెల్ అర్ధ సెంచరీ సాధించాడు. 113 బంతులు ఎదుర్కొన్న అభిషేక్ 9 ఫోర్లతో 82 పరుగులు చేశాడు. బాబా ఇంద్రజిత్ 34, రుతురాజ్ గైక్వాడ్ 17, సాయి సుదర్శన్ 17 పరుగులు చేశారు. నారంగ్ 35, వైశాక్ 14 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు.

క్వార్టర్స్‌లో ఓడిన మాళ్విక

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ



హాంగ్జౌ(చైనా): చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. క్వార్టర్స్‌కు చేరిన ఏకైక మహిళా షట్లర్ మాళ్విక బన్సోద్ టాప్‌సీడ్ చేతిలో వరుససెట్లలో ఓటమిపాలైంది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో మాళ్విక 10–21, 16–21తో టాప్‌సీడ్, జపాన్‌కు చెందిన యమగుచి చేతిలో పోరాడి ఓడింది. మాళ్విక ఈ టోర్నమెంట్‌లో తనకంటే సీడెడ్ క్రీడాకారిణులపై సంచలన విజయాలను నమోదు చేసుకుంటూ క్వార్టర్స్‌కు చేరిన సంగతి తెలిసిందే. క్వార్టర్‌ఫైనల్లో తొలి గేమ్‌లో తేలిపోయిన మాళ్విక.. ముఖ్యంగా రెండో గేమ్‌లో ప్రత్యర్థికి ముచ్చెమటలు పట్టించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68